ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org


మంగళవారం 09.12.2025 | సంపుటి : 12 సంచిక : 140 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370






హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్


తొలిరోజు..

# తెలంగాణ రైజింగ్ హిస్టారికల్

## ప్రపంచ నలుమూల నుంచి తరలివచ్చిన పారిశ్రామిక దిగ్గజాలు

దేశ స్వాతంత్ర్యం అనంతరం మన నాయకులు కొత్త రాజ్యాంగాన్ని రూపొందించి భవిష్యత్తు కోసం రోడ్ మ్యాప్ వేశారు. మేం కూడా తెలంగాణ భవిష్యత్తు కోసం రోడ్ మ్యాప్ రూపొందించాలనుకున్నాం. ఇందుకు మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, రాజ్యాంగ నిర్మాతల నుంచి ఎంతో స్ఫూర్తిని పొందాం. తెలంగాణ ప్రజలు దశాబ్దాలుగా ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడారు. దేశజనాభాలో 2.9 శాతమే ఉన్నా 5 శాతం ఆదాయం ఇస్తున్నాం. ఏ రాష్ట్రం చేయని విధంగా రాష్ట్రాన్ని 3 జోన్లుగా విభజించాం. 3 జోన్లను సేవ, తయారీ, వ్యవసాయ రంగాలకు కేటాయించాం. క్యూర్, ప్యూర్, రేర్ జోన్లుగా పిలుచుకుంటున్నాం.
- సీఎం రేవంత్ రెడ్డి

"వికసిత్ భారత్ దిశగా తెలంగాణ వేగంగా అడుగులు వేస్తోంది. 2047లోగా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారాలనేది మా లక్ష్యం. బస్సుల నిర్వహణ కూడా మహిళా సంఘాలకు ఇచ్చాం. విమానాశ్రయాలు, రైల్వేలు, రోడ్ల విస్తరణ దిశగా చర్యలు చేపట్టాం..
- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అసాధ్యం. సమస్యలకు ప్రతి భారతీయుడూ ఒక పరిష్కారం చూపిస్తాడు. ఐకమత్యం, శాంతియుత పరిస్థితులతోనే అభివృద్ధి సాధ్యం. మొత్తం ప్రపంచాన్ని ఒకే కుటుంబంగా చూస్తాం. ప్రపంచం ఎదుర్కొనే అనేక సమస్యలకు భారత్ వద్ద పరిష్కారం. అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వాల నినాదం కావాలి
- కైలాస్ సత్యార్థి

### మొదటి రోజు పెట్టుబడుల వరద

- రూ.2.43 లక్షల కోట్ల ప్రభుత్వం ఒప్పందాలు
- ఒకేరోజు 35 కుపైగా ఎంవోయూలు
- ఫ్యూచర్ సిటీలో వంతారా జూపార్క్ ఏర్పాటు
- ఏజీఐడీసీ కంపెనీ రూ.70వేల కోట్లతో ఒప్పందం
- విన్ గ్రూప్‌తో రూ.27వేల కోట్ల ఒప్పందం
- ట్రంప్ మీడియా టెక్నాలజీ రూ.3,500 కోట్లు
- రూ.25వేల కోట్లతో గ్రీన్ డేటా సెంటర్



### ఆసియా కంపెనీలతో కీలక ఒప్పందాలు

ఆసియా దేశాలతో ఆర్థిక భాగస్వామ్యంపై చర్చలో మంత్రి ఉత్తమ్

2లో..

- రాష్ట్ర ఎదుగుదలలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ మా లక్ష్యం
- కొత్త రాష్ట్రం అయినా అభివృద్ధిలో దూకుడు
- దేశ జీడీపీలో రాష్ట్ర వాటా 10శాతం ఉండాలనేది ఆశయం
- గాంధీ, అంబేద్కర్ సిద్ధాంతాలే అభివృద్ధి మార్గదర్శకాలు
- క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు జోన్ల అభివృద్ధి మోడల్ అమలు
- అభివృద్ధి ప్రయాణంలో గ్లోబల్ ఇన్వెస్టర్లు కీలక భాగస్వాములు
- పెట్టుబడులకు తెలంగాణ అన్ని విధాలుగా అనుకూలం
- గ్లోబల్ సమిట్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ ప్రసంగం
- వికసిత్ భారత్ దిశగా తెలంగాణ రైజింగ్ : గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- ఫ్యూచర్ సిటీ ఆలోచన అద్భుతం : సిఐఐ మాజీ చైర్మన్ దినేశ్
- బెంగుళూరు మించి తెలంగాణకు పెట్టుబడుల ఆకర్షణ: డీకే
- హైదరాబాద్ దేశ అర్థిక వ్యవస్థకు మూలస్తంభం
- హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీనిపెంచేందుకు కలసికట్టుగా కృషి
- రాష్ట్రాల సహకారంతోనే వికసిత భారత్ కల సాకారం
- ప్రపంచంలోనే శక్తిమంతమైన దేశంగా భారత్ అవతరణ
- తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ రైజింగ్ అన్‌స్టాపబుల్ అంటూ రాష్ట్ర ఎదుగుదలలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. కొత్త రాష్ట్రమైన తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతోందని అన్నారు. 2047కు సరికొత్త లక్ష్యాలు నిర్దేశించుకొని ముందుకు సాగుతున్నామన్నారు. 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎదగాలనేదే తమ ఆశయమన్నారు. ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్' ప్రారంభోత్సవ కార్యక్ర మంలో ఆయన ప్రసంగించారు. పారిశ్రామికవేత్తలు, ఆర్థికవేత్తల నుంచి ఆలోచనలు, అభిప్రాయాలు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కూడా 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమిని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10శాతం ఉండాలనేది తమ ఆశయమన్నారు. లక్ష్యం పెద్దది అయినప్పటికీ కష్టపడి సాధిస్తామనే నమ్మకం మాకుంది. అందరి సహకారంతో మా లక్ష్యాన్ని అందుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో తెలంగాణ భవిష్యత్ విజన్‌ను స్పష్టంగా వివరించారు. దేశ భవిష్యత్ కోసం రాజ్యాంగ సభ ఏర్పాటు చేసి భారత రాజ్యాంగ నిర్మాతల దృష్టిని గౌరవించడం చారిత్రక నిర్ణయమని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సిద్ధాంతాలే తెలంగాణ అభివృద్ధి మార్గదర్శకాలని ఆయన అన్నారు. విడిపోయిన తర్వాత ప్రజా పోరాటంతో సాధించిన ప్రత్యేక రాష్ట్రం తెలంగాణ 2014లో సోనియా గాంధీ, డాక్టర్ మన్మోహన్ సింగ్ నాయకత్వంలో భారత పటంలో చోటు చేసుకుందని గుర్తు చేశారు. గత దశాబ్దంలో రాష్ట్రం అత్యధిక అభివృద్ధి లక్ష్యాలతో ముందుకు సాగిందన్నారు. రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికల కోసం నిపుణుల కమిటీ ఏర్పాటుతో 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్'ను సిద్ధం చేసినట్లు సీఎం వెల్లడించారు. ఈ డాక్యుమెంట్ ప్రజల ఆశలు, ఆకాంక్షలను ప్రతిబింబించేలా రూపొందించబడిందని, నీతి ఆయోగ్, నిపుణుల సూచనలు ప్రధాన పాత్ర పోషించాయని చెప్పారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ ఎదగడం ముఖ్య లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశ జనాభాలో 2.9 శాతమే ఉన్నా.. దేశ జిడిపిలో 5 శాతం వాటా సాధించిన తెలంగాణ 2047 నాటికి దాన్ని 10 శాతానికి పెంచాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. రాష్ట్ర అభివృద్ధి మిగతా 2లో..



### హాయ్..సీఎం సర్..!

#### గ్లోబల్‌సమ్మిట్‌లో ప్రత్యేక ఆకర్శణగా రోబో

గ్లోబల్ సమ్మిట్‌లో రోబో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అతిథులకు స్వాగతం పలకడంతో పాటు గ్లోబల్ సమ్మిట్ లక్ష్యాలను అందరికీ వివరిస్తోంది రోబో. సీఎం రేవంత్‌ను కూడా హాయ్ అంటూ పలక రించింది. తిరిగి ముఖ్యమంత్రి కూడా రోబోకు హాయ్ చెబుతూ ముందుకు సాగారు. గ్లోబల్ సమ్మిట్‌లో ఈ రోబో అందరినీ ఆకట్టుకుంటోంది.

## ఆమ్రపాలికి హైకోర్టులో చుక్కెదురు

**క్యాట్ ఉత్తర్వులపై హైకోర్టు స్టే**

**హైదరాబాద్(జనంసాక్షి):** ఏఎస్ అధికారి ఆమ్రపాలికి తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. ఆమ్రపాలిని తెలంగాణకు కేటాయిస్తూ క్యాట్ ఇచ్చిన ఆదేశాలపై స్టే విధించింది. క్యాట్ ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ఆమ్రపాలికి సూచించింది. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. ఆమ్రపాలిని ఏపీకి కేటాయిస్తూ గత ఏడాది అక్టోబర్‌లో కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ డీవోపీటీ మిగతా 2లో..






## వారం గడిచినా ఎగరని ఇండిగో

దేశవ్యాప్తంగా వందలాది విమానాల రద్దు • విమానాశ్రయాల్లో ప్రయాణికుల అవస్థలు

**న్యూఢిల్లీ,డిసెంబర్8(జనంసాక్షి):** దేశీయ విమానయాన సంస్థ ఇండిగో సంక్షోభం కొనసాగుతోంది. వరుసగా ఏడో రోజు సోమవారం కూడా దేశవ్యాప్తంగా వందలాది విమానాలు రద్దయ్యాయి. ఢిల్లీ, ముంబై, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, కోల్‌కతా, జైపూర్, శ్రీనగర్ సహా పలు ఎయిర్‌పోర్టుల్లో విమానాలు రద్దయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎయిర్ పోర్టుల్లో పడిగాపులు పడుతున్నారు. సోమవారం ఉదయం ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషన్ ఎయిర్‌పోర్టులో మొత్తం 134 విమానాలు రద్దయ్యాయి. అందులో 75 డిపార్చర్స్ కాగా, 59 అరైవల్స్ ఉన్నాయి. బెంగళూరులోని మిగతా 2లో..

ఇండిగో గందరగోళం..

### అత్యసవర చర్చ కుదరదు

ప్రభుత్వం అన్నిరకాలు చర్యలు తీసుకుంటోంది

పిటిషన్లపై విచారించేందుకు సుప్రీం తిరస్కరణ

9లో..

## మావోయిస్టుల లొంగుబాటు

ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయిన 11 మంది సభ్యులు

వారిలో కేంద్ర కమిటీ సభ్యుడు రాంధేర్



2లో..

### ఉమ్మడి ఆదిలాబాద్‌లో గజగజే..



2లో..

### పురోగతి లేని చర్చలు

- జెలెన్‌స్కీపై ట్రంప్ అసహనం
- అమెరికా శాంతి ప్రతిపాదనలను పూర్తిగా చదవలేదని అసహనం

2లో..

### సీఎం రేవంత్ ఏది మాట్లాడినా అబద్ధమే..

దోపిడీ తప్ప పారదర్శకత ఏదీ?: హరీశ్

# దేశ స్వాతంత్ర్యానికి వందేమాతరం ప్రేరణ

మాతృభూమి ఔన్నత్యాన్ని చాటేలా జనప్రవాహాన్ని కదలించిన గీతం

- వేదకాలం నుంచి మాతను కొలవడం ఆదర్శం
- అదే స్ఫూర్తితో వందేమాతర గీతం రచన
- బ్రిటిష్ వారితో పోరాటంలో ముందు నిలిచింది
- జిన్నా ఉద్యమానికి తలొగ్గి నెహ్రూ గీతాన్ని అవమానించాడు
- వందేమాతరం 150 ఏళ్ల ప్రస్తానంపై లోక్‌సభలో ప్రధానమంత్రి మోడీ ప్రసంగం



న్యూఢిల్లీ(జనంసాక్షి): దేశ స్వాతంత్ర్యానికి వదేమాతర గీతం ప్రేరణ అని ప్రధాని మోడీ అన్నారు. కోట్లాది మంది భారతీయులు ఈ గీతానికి ఉత్తేజితులై స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్నారని అన్నారు. ఇది దేశానికి ప్రేరణ ఇచ్చిన గీతమని, స్వాంతంత్ర్య సముపార్జనకు నాందిగా మారిందని అన్నారు. లోక్‌సభలో వందేమాతర గీతం 150వ వార్షికోత్సవంపై జరిగిన చర్చలో ప్రధాని మోడీ పాల్గొన్నారు. ఈ చర్చ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ.. బకించంద్ర ఛటోపాధ్యాయ రాసిన వందేమాతర గీతం బెంగాల్‌లో బాగా ప్రాచుర్యం అయినట్లు మహాత్మాగాంధీ దక్షిణాఫ్రికా వార పత్రిక 'ఇండియన్ ఒపినియన్'లో డిఎంబర్ 2, 1905న రాశారు. బెంగాల్ స్వదేశీ ఉద్యమ సమయంలో బకించంద్ర రాసిన పాటను పాడటానికి లక్షలాది మంది ప్రజలు గుమిగూడి భారీ ర్యాలీలు నిర్వహించారు. ఈ పాట ఎంతగా ప్రాచుర్యం పొందింది అంటే.. ఈ గీతమే మన జాతీయ గీతంగా మారింది. ఈ పాట భావాలు గొప్పవి. మిగతా 2లో..

### బెంగాల్ ఎన్నికల కోసమే వందేమాతరంపై చర్చ

- సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికే తెరపైకి అంశం
- నెహ్రూ విజన్‌తోనే నేటి సాంకేత ప్రగతి సాగింది
- లోక్‌సభలో వందేమాతరంపై ప్రియాంక ప్రసంగం
- నెహ్రూతోనే వందేమాతర గీతానికి గౌరవం
- నెహ్రూను, కాంగ్రెస్‌ను తిట్టిపోయడమే మోడీ ఎజెండా
- లోక్‌సభలో కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్ మండిపాటు

2లో..

## భారత్‌తో దోస్తీతో చైనాకు చెక్..

పేర్కొన్న అమెరికా వార్షిక డిఫెన్స్ పాలసీ బిల్లు

**న్యూయార్క్(జనంసాక్షి):**ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనాతో జరుగుతున్న వ్యూహాత్మక పోటీలో ఆధిపత్యం పొందేందుకు భారత్‌తో సంబంధాలు బలోపేతం చేసుకోవాలని అమెరికా వార్షిక డిఫెన్స్ పాలసీ బిల్లు పేర్కొంది. 'ది నేషనల్ డిఫెన్స్ ఆథరైజేషన్ యాక్ట్ -2026ను కాంగ్రెషనల్ నాయకులు ఆదివారం విడుదల చేశారు. దీనిలో అమెరికా రక్షణ మంత్రి భారత్‌తో డిఫెన్స్ రంగంలో భాగస్వామ్యాన్ని మరింత ముందుకుతీసుకెళ్లాలని సూచించారు. ఇందుకోసం విదేశాంగశాఖ మంత్రితో సమన్వయం చేసుకోవాలని వెల్లడించింది. అప్పుడే ఇండో-పసిఫిక్‌లో చైనాపై ఆధిపత్యం సాధ్యమవుతుందని వెల్లడించారు. ఇందుకు క్వాడ్ కూటమి వంటివి ఉపయోగపడతాయని వెల్లడించింది. అమెరికా విదేశాంగ



మంత్రి యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ సెక్యూరిటీ డైలాగ్ వంటి సంప్రదింపుల వ్యవస్థను ఏర్పాటుచేయాలని సదరు బిల్లులో పేర్కొంది. ఇది భారత్ మిగతా 2లో..



### కాంగ్రెస్ నుంచి నవజ్యోత్‌కౌర్ వెలి

**చండీగఢ్(జనంసాక్షి):**పంజాబ్‌లో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు నవజోత్ సింగ్ సిద్ధూ సతీమణి నవజోత్ కౌర్ సిద్ధూను ఆ పార్టీ సస్పెండ్ చేసింది. ఆమె ప్రాథమిక సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ముఖ్యమంత్రి పీఠం కోసం రూ.500 కోట్లు ఇవ్వాల్సి ఉంటుందంటూ ఇటీవల ఆమె సంచలన మిగతా 2లో..

## మొదటి రోజు పెట్టుబడుల వరద

**హైదరాబాద్,డిసెంబర్8(జనంసాక్షి):** భారత్ ఫ్యూచర్ సిటీలో అత్యంత వైభవంగా నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైంది. రాష్ట్ర ఉజ్జ్వల భవిష్యత్ విజన్ ఆవిష్కరణకు నిర్వహించిన ఈ అంతర్జాతీయ సదస్సు తొలిరోజున పేరొందిన కంపెనీలు.. దేశ విదేశాల ప్రతినిధులు పారిశ్రామికవేత్తల దృష్టిని అమితంగా ఆకట్టుకుంది. తొలి రోజే సుమారు రూ..2.43 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు కుదిరాయి. 35 ఎంఓయూల పై సంతకాలు జరిగాయి. దీని ద్వారా తెలంగాణ రాష్ట్రం "విజన్ 2047" దిశగా వేగంగా పయనిస్తున్న ఆర్థిక శక్తిగా తన సుస్థిర స్థానాన్ని చాటుకుంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో తొలి రోజు డీప్‌టెక్, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్ రంగాల్లో పలు పెట్టుబడుల ఒప్పందాలపై సంతకాలు చేశారు తెలంగాణలో పెట్టుబడులకు మన దేశంతో పాటు ఇతర దేశాల నుంచి ప్రముఖ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. దీంతో ఒకే రోజున రూ. 2.43 లక్షల కోట్ల పెట్టుబడులను ప్రభుత్వం ఆకర్షించింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో తొలి రోజు భారీగా ఎంవోయూలు కుదిరాయి. డీప్ టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్ తదితర రంగాల్లో వివిధ కంపెనీలతో రూ.1.88 లక్షల కోట్ల మేర ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. డీప్ టెక్నాలజీ రంగంలో రూ.75 వేల కోట్లు, గ్రీన్ ఎనర్జీ రంగంలో రూ.27 వేల కోట్లు, పునరుత్పాదక రంగంలో రూ.39,700 కోట్లు, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో రూ.19,350 కోట్లు, ఏవియేషన్ రంగంలో జీఎంఆర్ గ్రూప్‌తో రూ.15 వేల కోట్లు, తయారీ రంగంలో రూ.13,500 కోట్లు, ఉక్కు రంగంలో రూ.7 వేల కోట్లు, టెక్స్‌టైల్ రంగంలో రూ.4 వేల కోట్లు మేర ఒప్పందాలు కుదిరినట్లు ప్రభుత్వం వెల్లడించింది.రాష్ట్ర ఖ్యాతిని ఘనంగా చాటేలా 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్'ను కాంగ్రెస్ ప్రభు త్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుంది. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సమిట్ సోమ వారం ఘనంగా ప్రారంభమైంది. అంతర్జా తీయ, ఆర్థిక సదస్సు కోసం దేశ, విదేశాలకు చెందిన ప్రముఖులు తరలివచ్చారు. రేపటి సమిట్ కోసం ఇంకా పెద్ద సంఖ్యలో ప్రము ఖులు తరలి వస్తున్నారు. . భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా నిర్వహిస్తున్న ఈ సమిట్‌లో రాష్ట్ర ఖ్యాతిని ఘనంగా చాటేలా 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్'ను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుంది. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సమిట్ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. అంతర్జాతీయ, ఆర్థిక సదస్సు కోసం దేశ, విదేశాలకు చెందిన ప్రముఖులు తరలివచ్చారు. రేపటి సమిట్ కోసం ఇంకా పెద్ద సంఖ్యలో ప్రముఖులు తరలి వస్తున్నారు. . భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా నిర్వహిస్తున్న ఈ సమిట్ లో అంచనా కు మించి తెలంగాణ ప్రభుత్వం వివిధ కంపెనీలు, సంస్థలతో ఎంవోయులు చేసుకుంది. సోమవారం ఒక్క రోజే రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలను రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకుంది. ఒక్క పవర్ సెక్టార్ లోనే రెండు లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓయూ కుదిరింది. ఈ ఓ కీలక ఒప్పందం కుదిరింది. ఫ్యూచర్‌సిటీలో కొత్త జూ పార్క్ ఏర్పాటుకు గుజరాత్‌లోని వన్యప్రాణుల పునరావస కేంద్రం వంతారా యాజమాన్యం ముందుకొచ్చింది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో వంతారా బృందం ఎంవోయూ కుదుర్చుకుంది. ప్రభుత్వ పరంగా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని సీఎం ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## ఆసియా కంపెనీలతో కీలక ఒప్పందాలు : ఉత్తమ్

హైదరాబాద్: ఆసియా దేశాలకు చెందిన 2 కీలక కంపెనీలతో ఒప్పందాలు జరిగినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. సింగపూర్‌నకు చెందిన ఏజీఐడీసీ కంపెనీ రూ.70వేల కోట్లతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు మంత్రి ఉత్తమ్ వివరించారు. ఈ సంస్థ ఏఐ ఆధారిత డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తుందన్నారు. వియత్నాంకు చెందిన విన్ గ్రూప్‌తో రూ.27వేల కోట్ల ఒప్పందం జరిగిందన్నారు. ఈ సంస్థ రాష్ట్రంలో సోలార్‌ప్లాంట్లు, ఈవీ, ఎనర్జీ స్టోరేజీ ఏర్పాటుచేయనుంది. ఆసియా దేశాలతో ఆర్థిక భాగస్వా మ్యంపై గ్లోబల్ సమ్మిట్‌లో చర్చ జరిగింది. ఈ చర్చలో సింగపూర్, థాయ్ లాండ్, వియత్నాం ప్రతినిధులు పాల్గొన్నారు. విన్‌గ్రూప్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ ఏర్పాటు చేయనుందని మంత్రి ఉత్తమ్ వివరించారు. టెక్నాలజీ, స్కిల్ డెవలప్‌మెంట్ వంటివాటిపై దృష్టి సారిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. మరోవైపు ఫ్యూచర్ సిటీ ప్రాంగణంలో ఒలెక్ట్రా ఎలక్ట్రికల్ కారును సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. స్వయంగా ఆయన కారు నడిపారు.

## పురోగతి లేని చర్చలు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీపై అసహనం వ్యక్తం చేశారు. ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధం ఆపేందుకు అమెరికా ప్రతిపాదించిన శాంతి ప్రతిపాదనలను జెలెన్‌స్కీ పూర్తిగా చదవలేదని ట్రంప్ మండిపడ్డారు.ఇదే సమయంలో 10 నెలల కాలంలో తాను ఎనిమిది యుద్ధాలను ఆపినట్లు ట్రంప్ మరోసారి వ్యాఖ్యలు చేశారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా కెన్నెడీ సెంటర్ ఆనర్స్ రెడ్ కార్పెట్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ.. రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి కోసం మేము అధ్యక్షుడు పుతిన్, జెలెన్ స్కీ సహా ఉక్రెయిన్ నాయకులతో మాట్లాడుతున్నాం. శాంతి కోసం మేము తయారు చేసిన ప్రతిపాదనలను జెలెన్ స్కీ చదవలేదు. ఆయన తీరు పట్ల నేను కొంచెం నిరాశ చెందాను. ప్రతిపాదనలను అంగీకరించేందుకు జెలెన్ స్కీ సిద్దంగా లేరు. మరోవైపు.. అమెరికా ప్రతిపాదన పట్ల రష్యా రెస్పాన్స్ బాగుంది. జెలెన్ స్కీ నిర్ణయాలను ఉక్రెయిన్ ప్రజలు కూడా తిరస్కరిస్తున్నారు. ఎనిమిది యుద్ధాలు ఆపిన నాకు రష్యాతో ఎలా యుద్ధం ముగించాలో తెలియదా? అంటూ' అని ఘాటు విమర్శలు చేశారు.

మరోవైపు.. అమెరికా-ఉక్రెయిన్ ప్రతినిధులు మియామిలో వరుసగా మూడు రోజుల పాటు చర్చలు జరిపారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి పురోగతి కనిపించలేదు. ఈ సందర్భంగా అమెరికా ప్రతిపాదించిన శాంతి ప్రణాళికపై చర్చలు కొనసాగుతున్నాయి. ఈ ప్రణాళికను రష్యా కొన్ని భాగాల్లో అంగీకరించినట్లు అమెరికా పేర్కొంటోంది. కానీ ఉక్రెయిన్ ఇంకా పూర్తిగా అంగీకరించలేదు. చర్చలు కొనసాగుతున్నప్పటికీ రష్యా యుద్ధాన్ని ముగించేందుకు సిద్ధంగా ఉండటం కీలకం అని అమెరికా, ఉక్రెయిన్ అధికారులు చెబుతున్నారు. ఈ చర్చల్లో అమెరికా తరఫున స్టీవ్ విట్కాఫ్, జారెడ్ కుష్నర్ పాల్గొనగా.. ఉక్రెయిన్ తరఫున రుస్తెమ్ ఉమెరోవ్, ఆండ్రి హ్నాటోవ్ ఉన్నారు.. అలాగే, జెలెన్ స్కీ కూడా వీడియో కాల్ ద్వారా చర్చల్లో పాల్గొన్నారు. కాగా, అమెరికా ప్రతిపాదనలోని కొన్నిఅంశాలను రష్యా తిరస్కరించిన?ట్టు తెలిసింది.

రష్యా దాడులు..

ఇదిలా ఉండగా.. శాంతి స్థాపన కోసం ఒకవైపు ఉక్రెయిన్‌తో అమెరికా చర్చలు జరుపుతుండగా.. మరోవైపు వాటిని పట్టించుకోకుండా రష్యా దాడులు చేస్తూనే ఉంది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకూ ఉక్రెయిన్‌పై చేసిన దాడుల్లో మౌలిక వసతులు ధ్వంసమయ్యాయి. సెంట్రల్ సిటీ క్రెమెన్‌చుక్‌లోని మౌలిక సదుపాయాలపై డ్రోన్లు, క్షిపణులతో రష్యా విరుచుకుపడింది. దీంతో విద్యుత్తు, నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. క్రెమెన్‌చుక్ నగరం.. అతి పెద్ద చమురు రిఫైనరీలకు, పరిశ్రమలకు కేంద్రం. ఉత్తర ప్రాంతంలోని చెర్నివ్‌లో జరిగిన దాడిలో ఒకరు మరణించారు.

## ఉమ్మడి ఆదిలాబాద్‌లో గజగజే

తెలంగాణలోని ఉత్తర, పశ్చిమ జిల్లాల్లో ఇవాళ, రేపు చలిగాలులు వీచే అవకాశం ఉందని తాజాగా హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఉమ్మడి ఆదిలాబాద్?తో పాటు సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో చలి తీవ్రత అధికంగా ఉండే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. ఈ జిల్లాలకు పసుపు రంగు హెచ్చరికలు జారీ చేసినట్లు వెల్లడించింది. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రంలోకి క్రింది స్థాయి గాలులు ప్రధానంగా ఈశాన్య దిశ నుంచి వీస్తున్నాయని తెలిపింది.రాష్ట్రంలో రాత్రి నుంచి ప్రారంభం అవుతున్న చలి ఉదయం పూట తీవ్ర స్థాయిలో ఉంటోంది.





# తొలిరోజు తెలంగాణ హిస్టారికల్ రైజింగ్

కోసం మొదటిసారి క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు జోన్ల అభివృద్ధి మోడల్‌ను అమలు చేస్తున్నామన్నారు. చైనా గ్వాంగ్‌డాంగ్ మోడల్‌ను ఆదర్శంగా తీసుకొని.. జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్ వంటి దేశాల పోటీ స్థాయికి తెలంగాణను తీసుకెళ్లే ప్రణాళిక ఉందని ఆయన తెలిపారు. తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో గ్లోబల్ ఇన్వెస్టర్లు కీలక భాగస్వాములని.. వారికి ఈ సందర్భంగా ఆహ్వానం పలుకుతున్నట్లు సీఎం అన్నారు. కష్టం అయితే వెంటనే చేయండి.. అసాధ్యమైతే డెడ్‌లైన్ పెంచుతాం అని సందేశం ఇచ్చారు. ఏ రాష్ట్రం చేయని విధంగా రాష్ట్రాన్ని 3 జోన్లుగా విభజించాం. వాటిని సేవ, తయారీ, వ్యవసాయ రంగాలకు కేటాయించాం. క్యూర్, ప్యూర్, రేర్ జోన్లుగా పిలుచుకుంటున్నాం. ఈ విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో సహకరించిన వారందరికి ఈ సందర్భంగా సీఎం రేవంత్ ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు, ఆర్థికవేత్తల సూచనలను ఆహ్వానిస్తున్నామన్నారు. దేశ స్వాతంత్య్రం అనంతరం మన నాయకులు కొత్త రాజ్యాంగాన్ని రూపొందించడం ద్వారా భవిష్యత్తుకు రోడ్ మ్యాప్ వేశారని వివరించారు. అలాగే తాము సైతం తెలంగాణ భవిష్యత్తు కోసం రోడ్ మ్యాప్ రూపొందించాలనుకున్నామన్నారు.తెలంగాణ ప్రజలు దశాబ్దాలుగా ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడారని గుర్తు చేశారు. రానున్న పదేళ్లలో తెలంగాణను దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా, ప్రపంచంలోనే ఉన్నత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. దేశానికి స్వాతంత్రం సిద్ధించి.. 2047లో వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందని.. నాటికి మనం ఏం సాధించామో చెప్పాలని నిపుణులను కోరినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆ సమయంలోనే తెలంగాణ రైజింగ్-2047 దార్శనికతకు బీజం పడిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. మనమేదైనా గొప్పగా చేయాలని భావించినప్పుడు తెలంగాణ సంస్కృతిలో ముందుగా దేవుళ్ల ఆశీర్వాదం తీసుకుంటాం? ప్రజల మద్దతు కోరుతామన్నారు. భవిష్యత్తు కోసం మన కలలు నెరవేర్చుకోవడానికి ప్రజల ఆలోచనలు, అంచనాలు తెలుసుకున్నామన్నారు. అందుకు అధికారులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, నీతి ఆయోగ్ నిపుణుల సహాయం తీసుకున్నామన్నారు.ఈ గ్లోబల్ సమ్మిట్‌కు అన్ని రంగాలకు చెందిన ప్రతినిధులు రావడం మన అదృష్టంగా భావిస్తున్నామన్నారు. వ్యాపారవేత్తలు, కార్పొరేట్ దిగ్గజాలు, విధాన నిర్ణేతలు, దౌత్యవేత్తలు, ప్రభుత్వ అధికారులతోపాటు వివిధ రంగాలకు చెందిన నిపుణులకు సీఎం రేవంత్ ధన్యవాదాలు చెప్పారు. ఈ సమ్మిట్‌లో మీ సూచనలు, సలహాలు, అభిప్రాయాలను స్వీకరించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు.తెలంగాణలో అపారమైన అవకాశాలు ఉన్నాయని వివరించారు. మంచి సానుకూల వాతావరణం కూడా ఉందన్నారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉన్న రాష్ట్రాన్ని.. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని తాము సంకల్పించామని చెప్పారు. దేశంలో తెలంగాణ దాదాపు 2.9శాతం జనాభా కలిగి ఉందని గుర్తు చేశారు. దేశ జీడీపీలో తెలంగాణ నుంచి దాదాపు 5శాతం వాటాను అందిస్తున్నామని స్పష్టం చేశారు. 2047 నాటికి భారత దేశ జీడీపీలో 10 శాతం వాటాను తెలంగాణ నుంచి అందించాలన్నది తమ లక్ష్యమని ధీమా వ్యక్తం చేశారు. సేవారంగం, తయారీ రంగం, వ్యవసాయ రంగం.. ఇలా తెలంగాణను మూడు భాగాలుగా విభజించి.. ప్రాంతాల వారీగా అభివృద్ధి లక్ష్యాలను నిర్ధేశిరచుకున్నామని వివరించారు. ఇలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్న రాష్ట్రాల్లో తెలంగాణ దేశంలోనే మొట్టమొదటిదని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అందుకోసం కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ, పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ, రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ మోడల్స్ నిర్దేశించామని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగం అనంతరం ఈ సమ్మిట్ ప్రారంభ వేడుకలు ముగిశాయి. అనంతరం వివిధ రంగాలపై సదస్సులు ప్రారంభమైనాయి. సెమీకండక్టర్ రంగంపై చర్చలో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. విద్యా రంగంలో గ్లోబల్ సెంటర్‌గా తెలంగాణ చర్చ గోష్టిలో మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు.

వికసిత్ భారత్ దిశగా తెలంగాణ రైజింగ్

గవర్నర్ మాట్లాడుతూ.. తెలంగాణ 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం దోహదపడుతోందని గవర్నర్ పేర్కొన్నారు. వికసిత్ భారత్ దిశగా తెలంగాణ రైజింగ్ కొనసాగుతోందన్నారు. 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారాలనేది తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని పేర్కొన్నారు. మహిళా రైతులను పలు విధాలుగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. బస్సుల నిర్వహణ కూడా మహిళా సంఘాలకు ఇచ్చామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తెలంగాణలో స్థిరమైన, పారదర్శకమైన ప్రభుత్వం ఉందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వివరించారు. తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైందని నోబెల్ అవార్డు గ్రహీత కైలాశ్ సత్యార్థి తెలిపారు. తెలంగాణ ప్రత్యేక విజన్‌తో ముందుకెళ్తోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో 20 లక్షల మంది రైతులకు ప్రభుత్వం రుణమాఫీ చేసిందని చెప్పారు. మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారని గుర్తు చేశారు.

హైదరాబాద్ దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభం:కిషన్ రెడ్డి

హైదరాబాద్ కేవలం ఓ రాష్ట్రానికి రాజధాని నగరం కాదు.. దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభం లాంటిదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఐటీ హబ్‌గా, ఇన్నొవేషన్ కారిడార్‌గా, ఫార్మాసూటికల్ క్యాపిటల్‌గా, ఏరోస్పేస్ టెక్నాలజీ సెంటర్‌గా వర్ధిల్లుతోంది. ఈ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని మరింత పెంచేందుకు అందరమూ కలిసి కట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. 2047 నాటికి మన దేశం వికసిత భారత్‌గా వెలుగొందాలని తరచూ ప్రధాని మోదీ పిలుపునిస్తూ ఉంటారు. అయితే రాష్ట్రాల సహకారంతోనే ఈ కల సాకారమవుతుందని ఆయన అన్నారు.

బెంగుళూరుతో పోటీ పడుతున్న హైదరాబాద్: డికె

అభివృద్ధి, పెట్టుబడుల విషయంలో హైదరాబాద్ బెంగళూరు నగరం పోటీపడుతోందని కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. ఈ రెండు మహానగరాలూ ప్రపంచంతో పోటీపడుతున్నాయన్నారు. ఫ్యూచర్‌సిటీలో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో ఆయన ప్రసంగించారు. తర్వాత తరానికి ఏం కావాలో ఈ ప్రభుత్వం ఆలోచించిందని అన్నారు. తెలంగాణ, సౌత్ ఇండియా అభివృద్ధికి కర్ణాటక సహకరిస్తుందన్నారు. దేశ ఐటీ ఎగుమతుల్లో బెంగళూరు 40 శాతం కలిగి ఉంది. చిన్న రాష్ట్రమైనప్పటికీ తెలంగాణ కూడా గొప్ప వాటా కలిగి ఉంది. కాలిఫోర్నియా వంటి నగరాల్లో 13 లక్షల భారత ఇంజినీర్లు పని చేస్తున్నారని శివకుమార్ తెలిపారు.

ఫ్యూచర్ సిటీ ఆలోచన అభినందనీయం: దినేశ్

ఫ్యూచర్ సిటీ పేరుతో కొత్త నగరం ఆలోచన అభినందనీయమని సీఐఐ మాజీ ఛైర్మన్ దినేశ్ అన్నారు. తెలంగాణ ఇప్పటికే వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా ఉందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న

### ఆమ్రపాలికి హైకోర్టులో చుక్కెదురు

ఉత్తర్వులు ఇచ్చింది. వాటిని ఆమె క్యాట్‌లో సవాలు చేశారు. దీంతో ఆమ్రపాలిని తిరిగి తెలంగాణకు కేటాయిస్తూ క్యాట్ ఆదేశాలిచ్చింది. ఈ క్రమంలో క్యాట్ ఉత్తర్వులను డీవోపీటీ మళ్లీ హైకోర్టులో అప్పీలు చేసింది. ఆమ్రపాలికి స్వాపింగ్ వర్తించదని డీవోపీటీ వాదించింది. హరికిరణ్ రిజర్వ్ కేటగిరీ కాబట్టి ఆయనతో ఆమ్రపాలికి స్వాపింగ్ వర్తించదని వివరించింది. ఈ క్రమంలో క్యాట్ ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

## మావోయిస్టుల లొంగుబాటు

ఛత్తీస్‌గఢ్‌లో మరో 11 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు రాంధేర్ ఉన్నారు. ఆయనపై రూ.3 కోట్ల రివార్డు ఉంది. ఎంఎంసీ(మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్) జోన్‌లో ఆయన క్రియాశీలకంగా ఉన్నారు. మిలింద్ తెల్తుంబే మరణించినప్పటి నుంచి రాంధేర్ ఎంఎంసీ బాధ్యతలు చూస్తున్నారు. ప్రస్తుతం ఆయన లొంగుబాటుతో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులు నక్సల్స్ రహిత ప్రాంతాలుగా మారాయి.

### భారత్‌తో దోస్తీతో చైనాకు చెక్..

అమెరికా మధ్య 2008లో జరిగిన పౌర అణుఒప్పంద పురోగతిని సమీక్షించాలని సూచించింది.

## సీఎం రేవంత్ ఏది మాట్లాడినా అబద్ధమే..


**హైదరాబాద్,డిసెంబర్8(జనంసాక్షి):** రేవంత్ రెడ్డి బిల్డప్ బాబాయ్ అని, ఆయన ఏం మాట్లాడినా అబద్ధమే అంటూ సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. రెండేండ్ల పాలనలో దోపిడీ తప్ప పారదర్శక లేదని, ఆత్మస్తుతి, పరనింద తప్ప రేవంత్ చేసిందేమీ లేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రిది ప్రైవేట్ లిమిటెడ్ పాలన అని, తన రెండేండ్ల పాలనలో చేసింది ఒక్కటైనా చెప్పగలడా అని ప్రశ్నించారు. ప్రజాభవన్‌ను జల్సాలకు, విందులు, వినోదాలకు ప్రజాభవన్‌ను కేరాఫ్‌గా మార్చారు అంటూ ఘాటు విమర్శలు చేశారు. పార్టీ నేతలతో కలిసి రేవంత్ రెండేండ్ల పాలనపై తెలంగాణ భవన్‌లో హరీశ్ రావు మీడియాతో మాట్లాడారు. 'రేవంత్ పాలనలో రెండేళ్లుగా దోపిడీ తప్ప పారదర్శకత లేదు. ఆత్మస్తుతి, పరనింద తప్ప రేవంత్ రెండేండ్లలో చేసిందేమీ లేదు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీశారు. రెండేండ్ల పాలనలో రాష్ట్ర ఆదాయం ఎందుకు తగ్గింది?. ఎన్నికల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అమలు చేశాం. ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో తెలంగాణను నంబర్ వన్‌గా నిలబెట్టాం. ఎన్నో కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి చేశామని అన్నారు. ప్రతీరోజు ప్రజల్ని కలుస్తానని రేవంత్ రెడ్డి మేనిఫెస్టోలో చెప్పారు. రేవంత్ రెడ్డి బిల్డప్ బాబాయ్. ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఒక్క రోజు మాత్రమే ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్నాడు. నాలుగైదు రోజులు మంత్రులు వచ్చారు.. ఆ తర్వాత వాళ్లు కూడా పత్తా లేరు. ఆ దరఖాస్తులను పట్టించుకున్న నాథుడే లేడు. మేనిఫెస్టోలోని మొదటి కార్యక్రమం, రేవంత్ రెడ్డి మొదటి మాటే తుస్సుమంది.

# దేశ స్వాతంత్ర్యానికి వందేమాతరం ప్రేరణ

ఇది ఇతర దేశాల పాటల కంటే తియ్యగా ఉంటుంది. దేశభక్తిని మేల్కొల్పడం దీని ఏకైక లక్ష్యం. ఇది భారతదేశాన్ని తల్లిగా చూస్తుంది' అని అన్నారు. రుగ్వేదంలోని శ్లోకాన్ని, రామాయణంలో రాముడు పలికిన వాక్యాలను ఈ సందర్భంగా ప్రధాని మోడీ తన ప్రసంగంలో ప్రస్తావించారు. దేశమంటే మన మాతృభూమిగా కొలవడం అనాదిగా వస్తోందని, వందేమాతర గీతానికి ఇవే ప్రేరణలని అన్నారు. లోక్‌సభలో వందేమాతరంపై జరుగుతున్న ప్రత్యేక చర్చ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కాంగ్రెస్ పార్టీపై, భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ గతంలో జాతీయ గీతాన్ని 'తుక్డే తుక్డే' చేసినట్టు ఆరోపించారు. అలాగే, వందేమాతరంతో ముస్లింలను రెచ్చగొట్టే విధంగా ఉందని నెహ్రూ పేర్కొన్నాడని చెప్పారు. సభలో 'షేమ్ షేమ్' నినాదాలు వినిపించినప్పటికీ, మోడీ వ్యాఖ్యానిస్తూ.. గత శతాబ్దంలో కొన్ని శక్తులు జాతీయ గీతానికి సర్వనాశనం చేశాయని పేర్కొన్నారు. ఆ చరిత్రను వచ్చే తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనదేనని ప్రధాని మోడీ అన్నారు.

## బెంగాల్ ఎన్నికల కోసమే వందేమాతరంపై చర్చ

**న్యూఢిల్లీ,డిసెంబర్8(జనంసాక్షి):**



దేశానికి స్వాతంత్యం వచ్చి 79 ఏళ్లు అవుతున్నదని, ఇప్పుడు వందేమాతరంపై చర్చ దేనికని కాంగ్రెస్ పార్టీ వాయనాడ్ ఎంపీ ప్రియాంకాగాంధీ ప్రశ్నించారు. వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్రం లోక్‌సభ లో ఈ గేయంపై చర్చ చేపట్టింది. ఈ చర్చలో పాల్గొన్న ప్రియాంకాగాంధీ ప్రభుత్వాన్ని పైవిధంగా ప్రశ్నించారు.కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు వందేమాతరంపై చర్చ చేపట్టడానికి రెండే రెండు కారణాలు ఉన్నాయని ప్రియాంకాగాంధీ చెప్పారు. అందులో మొదటిది వచ్చే ఏడాది జరగనున్న బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు కాగా, రెండోది దేశ ప్రజల దృష్టిని భవిష్యత్తు వైపు మళ్లకుండా గతంపైనే నిలిపి ఉంచడం కోసమని ఆమె వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ మంచి ప్రసంగం చేశారు కానీ, నిజాలు చెప్పడంలో ఆయన బలహీనంగా కనిపించారని అన్నారు. అంతేగాక 'మీరు ఎన్నికల కోసం పనిచేస్తుంటే మేం దేశ ప్రజల కోసం పనిచేస్తున్నాం' అని బీజేపీని ఉద్దేశించి ప్రియాంకాగాంధీ అన్నారు. మేం ఎన్ని ఎన్నికలు ఓడిపోయామనేది విషయం కాదని, మేం ప్రజల కోసం మీతో, మీ సిద్ధాంతాలతో పోరాడుతూనే ఉంటామని చెప్పారు. దేశం కోసం మా పోరాటం కొనసాగుతుందని, మా పోరాటాన్ని మీరు అడ్డుకోలేరని వ్యాఖ్యానించారు. భారతదేశంలోని ప్రతి అణువులో వందేమాతరం ఉందని, మరి దాని గురించి చర్చించాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. పశ్చిమ బెంగాల్‌లో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కారణంగా కేంద్ర ప్రభుత్వం వందేమాతరం గురించి చర్చిస్తోందని ఆమె ఆరోపించారు. వాస్తవానికి వందేమాతరం ప్రస్తావన వచ్చినప్పుడు, మనకు చరిత్ర గుర్తుకు వస్తుందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఒకప్పటి ప్రధానిగా కనిపించడం లేదు. ఆయన మంచి ప్రసంగాలు చేస్తారు, కానీ వాస్తవాలను అర్థం చేసుకోరు. మోడీ ప్రజలకు వాస్తవాలను అందించే విధానం ఆయన నైపుణ్యానికి నిదర్శనం. కానీ నేను ప్రజా ప్రతినిధిని ? కళాకారుడిని కాదు' అని ప్రియాంక గాంధీ అన్నారు. వందేమాతరం గురించి ప్రస్తావించినప్పుడు, మనకు మొత్తం చరిత్ర గుర్తుకు వస్తుందని, అది స్వాతంత్య్ర పోరాట చరిత్ర, స్వేచ్ఛ కోసం పోరాటం, నైతికత, బ్రిటిష్ సామ్రాజ్య పతనం గుర్తుకు వస్తుందన్నారు. వందేమాతరం భారతదేశ ప్రజలను రాజకీయ, నైతిక ఆకాంక్షతో అనుసంధానించిందని అన్నారు.

**నెహ్రూతోనే వందేమాతర గీతానికి గౌరవం: కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్**

ప్రధాని నరేంద్రమోదీ పై ప్రతిపక్ష కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది. లోక్‌సభలో వందేమాతరంపై చర్చ సందర్భంగా ప్రధాని ప్రసంగిస్తూ చేసిన వ్యాఖ్యలను.. లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష ఉప నాయకుడు గౌరవ్ గొగోయ్ తప్పుపట్టారు. వందేమాతరం పై చర్చ సందర్భంగా ప్రధాని దేశ చరిత్రను వక్రీకరించి తిరగరాసేందుకు ప్రయత్నించారని మండిపడ్డారు. బీజేపీ ఎంత ప్రయత్నించినా నెహ్రూ వారసత్వాన్ని అడ్డుకోలేదని గౌరవ్ గొగోయ్ వ్యాఖ్యానించారు. వందేమాతరం గేయానికి ప్రాముఖ్యతను ఇచ్చింది, ఆ గేయానికి జాతీయ గేయం హోదాను కల్పించింది కాంగ్రెస్ పార్టీయేనని ఆయన గుర్తుచేశారు. ఏ అంశంపై మాట్లాడినా దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరును, కాంగ్రెస్ పార్టీ పేరును ప్రస్తావించడం ప్రధాని మోదీకి అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు.ఆపరేషన్ సింధూర్‌పై చర్చ సందర్భంగా ప్రధాని ప్రసంగిస్తూ నెహ్రూ పేరును 14 సార్లు, కాంగ్రెస పార్టీ పేరును 50 సార్లు ప్రస్తావించారని గొగోయ్ తెలిపారు. అదేవిధంగా 75వ రాజ్యాంగ దినోత్సవరం సందర్భంగా కూడా ప్రధాని మాట్లాడుతూ.. నెహ్రూ పేరును 10 సార్లు, కాంగ్రెస్ పేరును 26 సార్లు ప్రస్తావించారని చెప్పారు.

## కాంగ్రెస్ నుంచి నవజ్యోత్‌కౌర్ వెలి

ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు అమరీందర్ సింగ్ రాజా తాజాగా ఆమెపై చర్యలు తీసుకున్నారు. తన భర్త నవజోత్ సింగ్ సిద్ధూ క్రియాశీలక రాజకీయాల్లోకి రావడానికి సిద్ధంగా ఉన్నారని కౌర్ శనివారం విలేకరులతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. కానీ, బేషరతుగా ఆయన్ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించాలని కోరారు. తామెప్పుడూ పంజాబ్ ప్రయోజనాల కోసమే పోరాడతామన్నారు. కానీ, సీఎం సీటులో కూర్చోవడానికి ఇవ్వాల్సిన రూ.500 కోట్లు తమ వద్ద లేవంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేశారా? అని విలేకరులు ప్రశ్నించగా.. 'అదేం లేదని' బదులిచ్చారు. కానీ, రూ.500 కోట్లు ఇచ్చినవాళ్లే సీఎం అవుతారంటూ మళ్లీ అనడంతో పార్టీలో తీవ్ర వివాదం చెలరేగింది.ఈ వివాదం ముదరటంతో తన వ్యాఖ్యల్ని వక్రీకరించారని కౌర్ వివరణ ఇచ్చారు. ఇంకే పార్టీ నుంచైనా సిద్ధూ సీఎం అవుతారా? అన్న విలేకరుల ప్రశ్నకు 'మా దగ్గర ఇవ్వడానికి డబ్బులు లేవు' అని సమాధానం ఇచ్చినట్లు చెప్పారు.

## వారం గడిచినా ఎగరని ఇండిగో..

కంపెగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో 127 (65 అరైవల్స్, 62 డిపార్చర్స్), హైదరాబాద్‌లో 77 (38 అరైవల్స్, 39 డిపార్చర్స్), చెన్నైలో 71, అహ్మదాబాద్‌లో 20, వైజాగ్‌లో ఏడు, ముంబై, కోల్‌కతా, శ్రీనగర్‌లోనూ పదుల సంఖ్యలో విమానాలు రద్దయ్యాయి. మొత్తంగా సోమవారం ఉదయం 9:30 గంటల సమయానికి దేశ వ్యాప్తంగా 360 ఇండిగో విమానాలు రద్దు అయ్యాయి. ఆదివారం ఏకంగా 650 విమానాలు రద్దు చేయగా, మొత్తం 2,300 విమానాలకు 1,650 నడిపినట్టు ఆ ఇండిగో ఒక ప్రకటనలో తెలిపింది. డిసెంబర్ 10వ తేదీ నాటికి రాకపోకలను స్థిరీకరిస్తామని పేర్కొంది. విమానాల రాకపోకలను సాధారణ స్థితికి తేవడానికి ప్రయత్నాలు కొనసాగిస్తున్నామని తెలిపింది. మరోవైపు రోజూ వందలాది విమానాల రద్దు, ఆలస్యంతో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వేలాది మంది ఎయిర్‌పోర్టుల్లో పడిగాపులు కాయడం కన్పించింది. తమ విమానాలు ఎప్పుడు పునరుద్ధరిస్తారో తెలియక నిస్సహాయంగా ఎదురుచూస్తున్నారు. తాము వివరాలు అడిగినా ఇండిగో సిబ్బంది పూర్తి సమాచారం అందజేయడం లేదని, వారి స్పందన చూసి విసిగివేసారిపోయామని పలువురు ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. దేశీయ విమానయాన సంస్థ ఇండిగో సంక్షోభం కారణంగా ప్రయాణికులు నానాయాతన పడుతున్నారు. వరుసగా ఏడో రోజూ విమానాల రద్దయ్యాయి. సోమవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 112 సర్వీసులను ఇండిగో రద్దు చేసింది. ఇందులో హైదరాబాద్‌కు రావాల్సిన 58 సర్వీసులు ఉండగా, ఇక్కడి నుంచి వెళ్లాల్సిన 54 విమానాలు ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. విమానాల రద్దుతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు విశాఖపట్నం నుంచి 7 విమానాలను ఇండిగో రద్దు చేసింది. వీటిలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీకి వెళ్లాల్సిన విమానాలు ఉన్నాయి. అదేవిధంగా అహ్మదాబాద్ నుంచి రాకపోకలు సాగించే 18 విమానాలు రద్దయ్యాయి. కాగా, ప్రయాణికులకు ఢిల్లీ ఎయిర్‌పోర్టు అడ్వైజరీ జారీ జారీచేసింది. సోమవారం కూడా ఇండిగో విమానాలు ఆలస్యంగా నడిచే అవకాశం ఉందని తెలిపింది. ఎయిర్‌పోర్టుకు వచ్చే ముందు స్టేటస్ చెక్ చేసుకోవాలని సూచించింది. అయితే ఢిల్లీ విమానాశ్రయంలో ఇప్పటివరకు మొత్తం 134 విమానాలను ఇండిగో రద్దు చేసింది. ఇందులో రావాల్సినవి 59 ఉండగా, వెళ్లాల్సినవి 75 ఉన్నాయి.

# గ్లోబల్ సమ్మిట్ భద్రతా ఏర్పాట్ల పర్యవేక్షణ

- కలియతిరిగిన డీజీపీ బి.శివధర్ రెడ్డి
- డీజీపీతో కొరియా కాన్సుల్ జనరల్‌తో మర్యాదపూర్వక భేటీ





**మీర్‌ఖాన్‌పేట, డిసెంబర్ 8 (జనంసాక్షి) :** కందుకూరు మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేటలో భారీ స్థాయిలో ఏర్పాటుచేసిన గ్లోబల్ సమ్మిట్ భద్రతా ఏర్పాట్లను రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి సోమవారం విస్తృతంగా పర్యవేక్షించారు. కాలినడకన వివిధ ప్రాంతాలను కలియ తిరిగారు. సమ్మిట్‌కు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్న దాదాపు వంద ఎకరాల విస్తీర్ణంలోని ప్రాంగణమంతా పర్యవేక్షిస్తూ స్థానిక అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా, ముఖ్య అతిథులు మరియు ప్రతినిధుల కోసం ఏర్పాటు చేసిన ప్రధాన వేదిక, వివిధ దేశాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధం చేసిన ప్రత్యేక సమావేశ మందిరాలు, మరియు భారీ స్థాయిలో వాహనాలను నిలిపేందుకు కేటాయించిన పార్కింగ్ స్థలాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. సమ్మిట్ ప్రారంభోత్సవ కార్యక్రమాలు, అనంతరం జరిగే సమావేశాల కోసం ఏర్పాటు చేసిన వేదికలను, వాటి పరిసర ప్రాంతాల భద్రతా స్థితిగతులను డిజిపి స్వయంగా తెలుసుకున్నారు. ప్రధాన వేదిక ప్రాంగణమంతా పర్యవేక్షిస్తూ, భద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ప్రత్యేక సూచనలు జారీ చేశారు. సోమవారం రాత్రి వరకు కొనసాగుతున్న సమావేశాలకు సంబంధించిన ఏర్పాట్లపై అవసరమైన సూచనలు చేశారు. మీరు ఖాన్ పేట కు వస్తున్న ప్రముఖులకు బందోబస్తు, తుక్కుగూడ ప్రాంతం నుండి మీరు ఖాన్ పేట వరకు ఏర్పాటుచేసిన పోలీసు సిబ్బందిని గురించి తెలుసుకున్నారు.

**డీజీపీతో కొరియా కాన్సుల్ జనరల్ మర్యాదపూర్వక భేటీ**

ముంబైలోని రిపబ్లిక్ ఆఫ్ కొరియాకు కొత్తగా నియమితులైన కాన్సుల్ జనరల్ డాంగ్‌వాన్ యూ తన బృందంతో కలిసి హైదరాబాద్ పర్యటనలో భాగంగా, సమ్మిట్ జరుగుతున్న ప్రాంతంలోని కార్యాలయంలో డిజిపి బి.శివధర్ రెడ్డితో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. హైదరాబాద్‌లో కొరియా దేశానికి చెందిన సంస్థలు, కొరియా పౌరుల రక్షణ గురించి చర్చించారు. భద్రతా ఏర్పాట్ల పర్యవేక్షణలో శాంతిభద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం. భగవత్, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, ఐజిపి (పి అండ్ ఎల్) డాక్టర్ ఎం. రమేష్ తదితరులు డిజిపి వెంట ఉన్నారు. భద్రత ఏర్పాట్లను మరింత పటిష్టం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నతాధికారులతో సవివరంగా చర్చించారు.

# రాష్ట్రంలో రూ.3 వేల కోట్ల పెట్టుబడి



- ప్రభుత్వంతో సురభి గ్రూప్ ఎంఓయూ
- గ్రీన్ ఎనర్జీ రంగంలో 1000 మందికి ఉపాధి
- పెద్దపల్లి జిల్లాలో పరిశ్రమ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** గ్రీన్ ఎనర్జీ సెక్టార్ లో పెట్టుబడి పెట్టేందుకు సురభి గ్రూప్స్ ముందుకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్‌లో సురభి గ్రూప్ ఎస్ఎల్ఆర్ పవర్ చైర్మన్ సురభి హరేందర్ రావు రాష్ట్రంలో 3 వేల కోట్ల పెట్టుబడి తో పెద్దపల్లి జిల్లాలో పరిశ్రమ స్థాపనకు ప్రభుత్వంతో ఎంఓయు కుదుర్చుకున్నారు. సోమవారం హైదరాబాదులో జరిగిన గ్లోబల్ సమ్మిట్ లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి మల్లు విక్రమార్కకు ఎంఓయు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ సురభి గ్రూప్స్ గ్రీన్ ఎనర్జీ సెక్టార్లో భాగంగా పెద్దపల్లి జిల్లా సుగ్లాంపల్లి లో 3000 కోట్ల రూపాయల పెట్టుబడితో సోలార్ సెల్, ప్యానెల్ తయారీ పరిశ్రమను నెలకొల్పుతున్నారన్నారు. ఈ పరిశ్రమ నిర్మాణం వల్ల వెయ్యి మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి లభించనుందన్నారు. ఏడాది కాలంలో పరిశ్రమ నిర్మాణం పూర్తవుతుందని, గ్రీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చిన సురభి గ్రూప్స్ చైర్మన్ హరిందర్ రావును అభినందించారు.

## అందరూ కలసి వస్తే ఫ్యూచర్ సిటీ అద్భుతం

- నటుడు నాగార్జున వ్యాఖ్యలు

**హైదరాబాద్, డిసెంబర్8 (జనంసాక్షి) :** గ్లోబల్ సమ్మిట్‌లో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, అక్కినేని నాగార్జున సమ్మిట్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారిద్దరూ ఒకే కారులో అక్కడికి వచ్చారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు భట్టి విక్రమార్క, నాగార్జున. సల్మాన్ ఖాన్ తదితరులు కూడా హాజరయ్యారు. అనంతరం మీడియాతో నాగార్జున మాట్లాడారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. 50 ఏళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్నామని.. ఇక్కడ వాతావరణం బాగుందని వ్యాఖ్యానించారు. తెలంగాణలో అన్నపూర్ణ స్టూడియో ఉందని.. ఫ్యూచర్ సిటీలో మరో స్టూడియో నిర్మాణానికి బాలీవుడ్ ప్రముఖులు కలిసి ముందుకు రావడం మంచి పరిణామమని చెప్పుకొచ్చారు.

# మొదటి విడత గ్రామ పంచాయతీల్లో పోలింగ్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు ఉండాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా కలెక్టర్



హనుమకొండ ప్రతినిధి డిసెంబర్ 8 (జనం సాక్షి) :ఈ నెల 11న జిల్లాలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించే భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాల్లో పోలింగ్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ ఎంపీడీవోలను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని ఎన్ఐసీ హాలు నుండి భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ ఎంపీడీవోలతో గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా సర్పంచ్, వార్డు స్థానాలకు ఈ నెల 11వ తేదీన జరగనున్న పోలింగ్ నిర్వహణ ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో ప్రిసైడింగ్ అధికారులకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమం, పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు, గ్రామపంచాయతీల వారీగా పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్, బడ్జెట్, తదితర అంశాలను భీమదేవరపల్లి ఎల్కతుర్తి కమలాపూర్ ఎంపీడీవోలు వీరేశం, విజయ్ కుమార్, బాబు లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన పోలింగ్ మెటీరియల్ పంపిణీ కోసం ఈ మండలాల్లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద కౌంటర్లు, టెంట్లు, సైన్ బోర్డులు, పోలింగ్ జరిగే 11వ తేదీన పోలింగ్ కేంద్రాలలో నిబంధనల మేరకు ఏర్పాట్లు చేయాలన్నారు.ఆయా మండలాల్లో ఎన్నికల నిర్వహణకు సంబంధించి నిర్వహించిన శిక్షణకు హాజరు కాని ప్రిసైడింగ్ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, డిఆర్డిఓ మేన శ్రీను, జడ్పీ సీఈవో రవి, భీమదేవరపల్లి ఎల్కతుర్తి కమలాపూర్ మండలాల ప్రత్యేక అధికారులు అనసూయ, శ్రీనివాసులు, నరసింహస్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అఖండ2 మూవీని వీక్షించిన మోహన్ భగవత్

- చిత్రం బాగుందని ప్రశంసలు

**న్యూఢిల్లీ, డిసెంబర్8 (జనంసాక్షి) :** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ-2 సినిమాను ప్రత్యేకంగా వీక్షించారు. ఇందుకోసం ఢిల్లీలోని ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో ప్రత్యేక షో ఏర్పాటుచేశారు. మోహన్ భగవత్‌తో పాటు అఖండ-2 డైరెక్టర్ బోయపాటి శ్రీను, ఆ చిత్ర నిర్మాతలు కూడా ఈ సినిమాను చూశారు. సినిమా వీక్షణ అనంతరం.. అఖండ-2 మూవీపై ఆర్ఎస్ఎస్ చీఫ్ ప్రశంసలు కురిపించారు. సినిమా చాలా బావుందని చెప్పిన ఆయన.. అందులో కథానాయకులు అద్భుతంగా నటించారని కితాబిచ్చారు. బోయపాటి శ్రీను దర్శకత్వం వహించిన అఖండ-2.. తొలుత సెప్టెంబర్ 25న రిలీజ్ కావాల్సి ఉండగా.. అనివార్య కారణాలతో వాయిదా పడి డిసెంబర్ 5కు వాయిదా పడింది. కానీ, విడుదలకు ముందు కొన్ని సమస్యలు తలెత్తడంతో మరోసారి అర్ధంతరంగా పోస్ట్‌పోన్ అయింది. అయితే.. ఈ సినిమాను ఈనెల 25న రిలీజ్‌కు సిద్ధం చేసినట్టు సమాచారం. ఈ మూవీ కోసం ఇప్పటికే థియేటర్ల వద్ద కట్టిన బ్యానర్లను, కటౌట్స్‌ను తీయొద్దని థియేటర్ యాజమాన్యాలకు మూవీ టీమ్ సూచించినట్లు తెలుస్తోంది.

## హనుమకొండ పీఎస్ నుండి అంతర్రాష్ట్ర దొంగల పరార్

**హనుమకొండ ప్రతినిధి, డిసెంబర్ 8 (జనం సాక్షి) :** హనుమకొండ నగరం నడిబొడ్డున ఉన్న హనుమకొండ పోలీస్ స్టేషన్ నుండి అంతర్ రాష్ట్ర దొంగలు పరార్ అయ్యారు. సోమవారం తెల్లవారు జామున ఈ ఘటన చోటు చేసుకున్నది. ఇతర రాష్ట్రానికి చెందిన నలుగురు గంజాయి నిందితులను నార్కోటిక్స్ పోలీసులు పట్టుకొని హనుమకొండ పోలీసులకు అప్పగించారు. హనుమకొండ పోలీసు స్టేషన్ కంప్యూటర్ రూమ్ నుంచి సోమవారం తెల్లవారుజామున 5గంటలకు సెంట్రీ డ్యూటీ పోలీసుల కళ్లు గప్పి కంప్యూటర్ రూమ్ వెనుక భాగం డోర్ పగలగొట్టి ముగ్గురు దొంగలు పరార్ అయ్యారు. ఈ విషయంలో పోలీసు ఉన్నతాధికారులు సీరియస్ కావడంతో పారిపోయిన దొంగలను పట్టుకోవడానికి హనుమకొండ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## యువతిని హత్య చేసిన దుండగుడు

**పెళ్లికి ఒప్పుకోలేదన్న కసితో కిరాతకంగా హత్య**

**హైదరాబాద్, డిసెంబర్ 8 (జనంసాక్షి) :** హైదరాబాద్ ముషీరాబాద్‌లో దారుణం చోటుచేసుకుంది. పెళ్లికి ఒప్పుకోవడం లేదని ఓ యువతిని ఆమె తల్లి ముందే దుర్మార్గుడు కిరాతకంగా హత్య చేసి పారిపోయాడు. వారాసిగూడ పోలీసుస్టేషన్ పరిధిలో ఓ ఇంటర్ విద్యార్థిని (18) దారుణ హత్యకు గురైంది. మేనమామ వరసయ్యే యువకుడు యువతి తల్లి కళ్లముందే కత్తితో ఆమె గొంతు కోసి హత్య చేశాడు. ఈ దారుణానికి పాల్పడిన యువకుడు.. ఘటనాస్థలిలోనే కత్తి, సెల్‌ఫోన్ వదిలేసి పరారయ్యాడు. సమాచారం అందుకున్న వారాసిగూడ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఇటీవల ఆ ఇద్దరు యువతీయువకులకు పెద్దలు పెళ్లి నిశ్చయించారు. ఆ తర్వాత వారి మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. తన మాట లెక్కచేయట్లేదని కోసం పెంచుకున్న యువకుడు.. మాట్లాడతానంటూ ఇంటికి వచ్చి.. ఆమె తల్లి ముందే గొంతుకోసి పరారయ్యాడు. క్లూస్ టీం, పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

## ఢిల్లీ హైకోర్టులో ఎన్టీఆర్ పిటిషన్

**న్యూఢిల్లీ, డిసెంబర్8 (జనంసాక్షి) :** ప్రముఖ నటుడు జూనియర్ ఎన్టీఆర్ తన వ్యక్తిగత హక్కులకు రక్షణ కోరుతూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కామర్స్ సైట్స్, సోషల్ మీడియా వేదికల్లో కంటెంట్.. ఎన్టీఆర్ వ్యక్తిగత హక్కులను ఉల్లంఘించేలా ఉందని న్యాయవాది సాయి దీపక్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ మన్మీత్ ప్రీతమ్ సింగ్ అరోరా కీలక ఆదేశాలు జారీ చేశారు. జూనియర్ ఎన్టీఆర్ పిటిషన్‌ను ఐటీ నిబంధనలు -2021 కింద ఈ-కామర్స్ వేదికలు, సోషల్ మీడియా కంపెనీలు ఫిర్యాదుగా పరిగణించాలని పేర్కొన్నారు. మూడు రోజులలోపు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తదుపరి విచారణను డిసెంబర్ 22కు వాయిదా వేశారు. గతంలో ప్రముఖ నటులు నాగార్జున, బాలీవుడ్ నటుడు అజయ్ దేవ్‌గణ్, ఐశ్వర్యరాయ్ తదితరులు కూడా ఇదే విధమైన రక్షణను కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తమ ఫొటోలు, పేర్లు, వీడియోలను అనుమతి లేకుండా ఇతరులు వినియోగించరాదని కోర్టు ద్వారా ఆదేశాలు పొందారు. తాజాగా జూనియర్ ఎన్టీఆర్ కూడా ఇదే తరహా రక్షణ కోరుతూ కోర్టును ఆశ్రయించారు. వాణిజ్య అంశాల్లో కూడా తన వ్యక్తిగత హక్కులను ఉల్లంఘించరాదని పిటిషన్‌ను దాఖలు చేశారు. సోషల్ మీడియా వినియోగం విస్తృతమైన నేటి జమానాలో పెడ పోకడలు మితిమీరిన విషయం తెలిసిందే.

# 9 నుంచి 'టీటీఏ సేవాడేస్ 2025' ప్రారంభం

- డిసెంబర్ 25న 'టీటీఏ' 10వ వార్షికోత్సవం
- డిసెంబర్ 14న గచ్చిబౌలిలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం
- 40కి పైగా సేవా కార్యక్రమాలను ప్రకటించిన 'టీటీఏ'



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలుగు కళల తోట.. తెలంగాణ సేవల కోట.. అంటూ తెలంగాణ ప్రజల సంస్కృతి, సంప్రదాయాలను అమెరికాలో ఘనంగా నిలబెడుతున్న తెలంగాణ అమెరికా తెలుగు సంఘం (టీటీఏ) తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారీ స్థాయిలో "సేవాడేస్ 2025" కార్యక్రమాలను ప్రారంభిస్తోంది. ఈ టీటీఏ సేవాడేస్ 2025 డిసెంబర్ 9 నుంచి డిసెంబర్ 23 వరకు తెలంగాణ జిల్లాల్లో నిర్వహిస్తారు. డిసెంబర్ 14న గచ్చిబౌలిలో "10కె రన్"తో డ్రగ్స్‌పై భారీ స్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తారు. డిసెంబర్ 25న టీటీఏ 10వ వార్షికోత్సవ వేడుకలు జరుపుతారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీటీఏ నాయకులు 'టీటీఏ సేవాడేస్ 2025' ప్రకటించి, కార్యక్రమాల వివరాలు తెలిపారు. టీటీఏ ఏటా నిర్వహించే ఈ సేవాడేస్‌లో భాగంగా ఆరోగ్యం, విద్య, సమాజ అభివృద్ధి, యువత అవగాహనా కార్యక్రమాలు, మాదకద్రవ్యాల నివారణపై చైతన్యం, రక్తదానం, ఆహార పంపిణీ, గిరిజన ప్రాంతాలకు మద్దతు.. వంటి 40కి పైగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తారు. టీటీఏ సేవాడేస్‌లో భాగంగా సేవ కార్యక్రమాలను తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, వరంగల్, హన్మకొండ, భూపాలపల్లి, మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట, జనగామ, నల్లగొండ, యాదాద్రితో పాటు మరిన్ని జిల్లాల్లో నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలను టీటీఏ నాయకత్వ బృందం రూపొందించింది. టీటీఏ ఫౌండర్ పైల మల్లారెడ్డి, ప్రెసిడెంట్ నవీన్ మల్లిపెద్ది, ఏసీ-చైర్ విజయపాల్ రెడ్డి, ఏసీ కో చైర్ మోహన్ రెడ్డి పటలోళ్ల,సేవాడేస్ సలహాదారు డా. ద్వారకానాథ్ రెడ్డి, టీటీఏ కన్వెన్షన్ 2026 చైర్ ప్రవీణ్ చింతా, 10వ వార్షికోత్సవ చైర్ డీఎల్ఎన్ రెడ్డి, జాయింట్ ట్రెజరర్ స్వాతి చెన్నూరి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ - ఇంటర్నేషనల్ సర్వీసెస్ డైరెక్టర్ జ్యోతి రెడ్డి దూదిపాల, ఎక్స్ బోడ్ రమా కుమారి వనమా, అంతర్జాతీయ వీపీ నర్సింహ పెరుక, సేవాడేస్ కోఆర్డినేటర్ విశ్వ కంది, 10వ వార్షికోత్సవ వేడుక కల్చరల్ చైర్ డా. వాణి గడ్డం.. అమెరికా నుండి టీటీఏ నాయకత్వం, తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులు, వాలంటీర్లు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

**'10కె రన్"తో డ్రగ్స్‌పై అవగాహన**

టీటీఏ సేవాడేస్ 2025లో భాగంగా డిసెంబర్ 14న గచ్చిబౌలిలో సే నో టూ డ్రగ్స్ సందేశంతో "10కె రన్" నిర్వహించబోతున్నారు. ఈ ఏడాది సేవాడేస్ ప్రధాన థీమ్ సే నో టూ డ్రగ్స్ అని టీటీఏ నాయకులు తెలిపారు. ఈ రన్‌లో విద్యార్థులు, యువత, స్పోర్ట్స్ కమ్యూనిటీ, వాలంటీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు.

## అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న బైకర్

- ఒకరు మృతి..మరొకరికి గాయాలు

**మంచిర్యాల, డిసెంబర్ 8 (జనంసాక్షి) :** మంచిర్యాల జిలా కేంద్రంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోటపల్లి మండలం నక్కలపల్లి గ్రామానికి చెందిన కొండపర్తి సందీప్ (26) అనే వ్యక్తికి తన భార్యతో కలిసి శ్రీరాంపూర్‌లో నివాసం ఉంటున్నారు. ఆదివారం రాత్రి సందీప్ తన తోడల్లుడైన ఓదెలకు చెందిన సుమన్‌తో కలిసి శ్రీరాంపూర్ నుండి మంచిర్యాలకు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. కాలేజ్ రోడ్డు సమీపంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి దిగగానే బైక్ అదుపుతప్పి డివైడర్ కు ఢీ కొట్టడంతో కింద పడ్డారని తెలిపారు. ఈ ప్రమాదంలో సందీప్ అక్కడికక్కడే మృతిచెందగా సుమన్ కు తీవ్ర గాయాలైనాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకొని సందీప్ మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ మార్చురీకి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సుమన్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు.కాగా ప్రస్తుతం సందీప్ ఐఎన్టీయూసి ఏరియా వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్ రావు దగ్గర డ్రైవర్ గా పనిచేస్తున్నాడు.

## చెరువు శిఖంలో 5 ఎకరాల కబ్జాకు విముక్తి


- ఫిర్యాదులు రావడంతో రంగంలోకి దిగిన హైడ్రా




**హైదరాబాద్, డిసెంబర్ 8 (జనంసాక్షి) :** హైదరాబాద్ మహానగరంలోని మియాపూర్‌లో భారీ స్థాయి భూకబ్జాలను అడ్డుకుని ప్రభుత్వ ఆస్తిని హైడ్రా కాపాడింది. సుమారు రూ.600 కోట్ల విలువ గల 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి పూర్తిగా స్వాధీనం చేసింది. ఈ కబ్జాలు మియాపూర్ ముక్తామహబూబ్ కుంటకు ఆనుకుని ఉన్న సర్వే నెంబర్ 44/5లోని కుంట భూభాగంలో ఈ కబ్జా చేసుకుంది. కబ్జా చేయడానికి కబ్జాదారులు దానిని 44/4 సర్వే నెంబర్‌గా చూపించి అక్రమ మార్పులు చేసినట్లు హైడ్రా దర్యాప్తులో బయటపడింది. కుంట కట్టపై దాదాపు 200 మీటర్ల మేర 18 షెడ్లను ఏర్పాటు చేసి నెలకు 50 వేల చొప్పున అద్దె వసూలు చేస్తున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఖాళీ స్థలాన్ని ప్రైవేట్ బస్సు పార్కింగ్ కోసం ఉపయోగించి నెలకు 8 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు హైడ్రా అధికారుల దర్యాప్తులో బయటపడింది. కబ్జాదారుల వద్ద భూమికి సంబంధించిన ఏ పత్రాలు లేవని నిర్ధారించడంతో హైడ్రా క్షణమే చర్యలకు దిగింది. అక్రమంగా నిర్మించిన అన్ని షెడ్లను తొలగించి, భూభాగం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆస్తిని రక్షించింది. కూన సత్యం గౌడ్, బండారి అశోక్ ముదిరాజ్ ఈ కబ్జాలకు ప్రధాన కారకులు అని హైడ్రా గుర్తించింది. వీరి వెనుక కొన్ని బడా బాబుల మద్దతు ఉన్నట్టు కూడా అధికారులు అనుమానిస్తున్నారు.

# కామధేనువుగా మారిన కూకట్‌పల్లి

- అభివృద్ధిలో మాత్రం వెనకపడేశారు: కవిత



**హైదరాబాద్, డిసెంబర్8 (జనంసాక్షి) :** హైదరాబాద్‌కు కూకట్‌పల్లి కొందరికి కామధేనువుగా మారిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. సోమవారం కూకట్‌పల్లిలో పర్యటించిన కవిత... వై జంక్షన్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... మేడ్చల్ జిల్లా పర్యటనలో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో తమ పర్యటన సాగుతోందన్నారు. ఇక్కడ 2 వేల కోట్ల రూపాయల విలువైన భూములను ప్రభుత్వం అమ్మిందని... కానీ కూకట్‌పల్లి నియోజకవర్గం కోసం కనీసం రూపాయి కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. గ్లోబల్ రైజింగ్ సమ్మిట్ అని గొప్పగా పెడుతున్నారని.. కానీ కూకట్‌పల్లిలో కనీస వసతులు లేవన్నారు. ఇక్కడ ఒక్క స్టేడియం కూడా లేదని విమర్శించారు. అసలు హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీ అని ఎలా చెబుతున్నారని ప్రశ్నించారు. జేఎన్టీయూ మెట్రో స్టేషన్ వద్ద విపరీతమైన ట్రాఫిక్ సమస్య ఉందన్నారు. కూకట్‌పల్లి అంటే ఒక మిని ఇండియా మాదిరిగా ఉందన్నారు. కానీ ఇక్కడ పేదవాళ్లు రెంట్‌కు ఇళ్లు తీసుకునే పరిస్థితి కూడా లేదని చెప్పుకొచ్చారు. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే వచ్చి ఓట్లు అడుగుతున్నారని.. ఓట్లు లేనప్పుడు వచ్చి ప్రజల సమస్యలు తెలుసుకోవటం లేదంటూ వ్యాఖ్యలు చేశారు. పాలక పక్షం పట్టించుకోవటం లేదని.. ప్రతిపక్షం అడగటం లేదన్నారు. అందుకే జాగృతి బాధ్యతను భుజాన వేసుకొని ప్రశ్నిస్తోందని తెలిపారు. కూకట్‌పల్లిలో భూములు అమ్మడే కాదు.. ఇక్కడ అభివృద్ధిపై కాంగ్రెస్ శ్రద్ధ పెట్టాలని కవిత డిమాండ్ చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
9 డిసెంబర్ 2025

# తెలంగాణ భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళిక-2047

తెలంగాణ విజన్ 2047 గురించి మాట్లాడితే, ఇది మరింత ప్రతిష్ఠాత్మకమైన లక్ష్యాలు ఉంచుతుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినపుడు ప్రజల ఆకాంక్షలు చాలా ఎక్కువగా ఉండేవి. కానీ ఆ లక్ష్యాలు దగ్గరయ్యేంతవరకు అవి నెరవేరలేదు. ప్రస్తుతం తెలంగాణ అభివృద్ధి కోసం రూపొందించిన "తెలంగాణ రైజింగ్ 2047" విజన్ డాక్యుమెంట్, కొత్త మార్గదర్శకాలతో రూపొందించబడింది. ఈ డాక్యుమెంట్ ద్వారా రాష్ట్రం 2047 నాటికి ప్రపంచ స్థాయిలో అగ్రగామిగా ఎదగాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో సాంకేతికత, పారిశ్రామిక అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు, రైతుల ఆదాయాల పెంపు, మహిళల సమర్థత వంటి కీలక అంశాలు ఉన్నాయి.

ప్రధానంగా, తెలంగాణలో యువతకు నూతన నైపుణ్యాల ద్వారా ప్రగతి సాధించడానికి, కొత్త పరిశ్రమలు, స్టార్టప్‌లు స్థాపించడానికి లక్ష్యాలు ఉన్నాయి. ప్రభుత్వం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించేందుకు, ఇన్నోవేషన్, సాంకేతికత, ఫార్మా, క్వాంటమ్ టెక్నాలజీ, ఏయిరోస్పేస్ వంటి రంగాల్లో పెట్టుబడులను పెంచేందుకు కార్యాచరణ చేపట్టింది. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతుల పనితీరును మెరుగుపర్చేందుకు ఉపయోగించి, మౌలిక వసతులు, సాగు పద్ధతులు సవరించేందుకు ప్రణాళికలు రూపొందించబడ్డాయి.

విజన్ డాక్యుమెంట్ లో తెలంగాణ రాష్ట్రం మూడు విభాగాలుగా, "క్యూర్, ప్యూర్, రేర్" గా విడగొట్టి, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఏకానమీగా తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి విభాగం హైదరాబాద్ ను కోర్ నగరంగా అభివృద్ధి చేస్తూ, రెండవ విభాగంలో జిల్లా కేంద్రాలను, మూడవ విభాగంలో గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసే ప్రణాళికలు ఉన్నాయి. ఈ విధానం అన్ని ప్రాంతాలలో సమగ్ర అభివృద్ధి కల్పిస్తుందనే నమ్మకంతో ఉంది.

తెలంగాణ రైజింగ్ 2047 అనేది తెలంగాణ రాష్ట్రం యొక్క సమగ్ర అభివృద్ధి కోసం రూపొందించిన ఒక దూరదృష్టి ప్రణాళిక. ఈ ప్రణాళిక 2047 నాటికి స్వాతంత్ర్య సమరయోధుల ఉద్దేశ్యాన్ని ముందుకు తీసుకెళ్లి, తెలంగాణను ప్రపంచ స్థాయిలో ఒక శక్తివంతమైన ఆర్థిక, సామాజిక, సాంకేతిక, పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రణాళికలో ప్రభుత్వం మూడు ముఖ్యమైన ఆర్థిక-భౌగోళిక క్షేత్రాలు: కోర్ అర్బన్ ఎకానమీ, పెరీ-అర్బన్ ఎకానమీ, (గ్రామీణ-వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ) అనే మూడు ప్రాంతాలలో అభివృద్ధి ప్రతిపాదనలను సజావుగా ప్రవేశపెట్టింది.

కోర్ ప్రాంతం, తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో సమీపించి, ప్రపంచ స్థాయి నగర అభివృద్ధి, సాంకేతిక పారిశ్రామిక కేంద్రాలు, ఐటీ హబ్‌లు, స్టార్టప్‌లు, హై-టెక్ పరిశ్రమలు, శాస్త్రీయ-పరిశోధనా సంస్థలు, మార్కెట్-డ్రివెన్ పరిశ్రమలు వంటి ఆర్థిక రంగాలలో అభివృద్ధి లక్ష్యంగా ఉంది. ప్యూర్ ప్రాంతంలో, పెద్ద-పరిమాణంలో తయారీ, మాన్యుఫ్యాక్చరింగ్, లాజిస్టిక్స్, అగ్రో-ఇండస్ట్రీలు వంటి రంగాలు అభివృద్ధి చేయడం, గ్రామీణ ప్రాంతాలతో ఉన్న కనెక్టివిటీ మెరుగుపరచడం, రవాణా, సరఫరా గొలుసులు ఏర్పడించడం అనేది కీలకంగా భావించారు. రేర్ ప్రాంతంలో, వ్యవసాయ అభివృద్ధి, సేంద్రీయ వ్యవసాయం, జీవ సంబంధిత పరిశ్రమలు, గ్రామీణ పారిశ్రామిక వృద్ధి లక్ష్యంగా పరిశీలిస్తున్నారు.

ఈ ఆర్థిక విభాగాలు సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు పోవడం ద్వారా, తెలంగాణ రాష్ట్రంలో జీడీపీ గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రోడక్ట్ 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ వృద్ధిని కొనసాగించడం, ఆర్థిక సమతుల్యతను సృష్టించడం, ఉద్యోగ అవకాశాలు పెంచడం, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంచడం, సామాజిక భద్రతలో ఉన్న పేద, రైతు, మహిళలకు సమానమైన అవకాశాలు అందించడం దృష్ట్యా, ముఖ్యంగా గ్రామీణ మరియు సామాజిక రంగాల అభివృద్ధిపై దృష్టి పెట్టారు.

తెలంగాణ రైజింగ్ 2047-లో ప్రజల సంక్షేమం, సుస్థిర అభివృద్ధి, సామాజిక సమానత్వం కూడా ప్రధానమైన అంశాలు. మానవ వనరుల అభివృద్ధి, శిక్షణ, నైపుణ్య విద్య, ఆధునిక విద్యావ్యవస్థలు, నాణ్యమైన ఆరోగ్య సేవలు, గ్రామీణ-పట్టణ సంయోజనాలు, అర్ధ-పట్టణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజాపాలన సదుపాయాలు, నూతన ఆవిష్కరణలు వంటి అంశాలపై ప్రణాళిక దృష్టి కేటాయిస్తుంది. గ్రామీణ ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయడం, వ్యవసాయ-ఇంటిగ్రేటెడ్ విధానాలు తీసుకురావడం, సాగు-వ్యవస్థలు మరింత పర్యావరణ-స్నేహంగా ఉండేలా చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

రాష్ట్ర మౌలిక-పరమైన నిర్మాణాల అభివృద్ధి కూడా ఈ ప్రణాళికలో కీలకమైన భాగం. రవాణా వ్యవస్థలు, ఎలక్ట్రికల్-పబ్లిక్-యుటిలిటీ-హబ్స్, జాతీయ స్థాయి రహదారులు, పారిశ్రామిక రవాణా గమనాలు, ప్రభుత్వ సంస్థల క్షిప్రమైన సేవలు, స్మార్ట్ సిటీస్, హార్డ్ వర్క్ వ్యవస్థలు, ట్రాన్స్‌పోర్టేషన్ అండ్ లాజిస్టిక్స్ కారిడార్లు ఇవన్నీ కీలక ప్రణాళిక భాగాలు. రూరల్-పట్టణ ప్రాంతాల బలోపేతం, పట్టణ రవాణా వృద్ధి, జాతీయ-ప్రాంతీయ వ్యవస్థాపక-రాష్ట్ర చర్చలు మొదలైన వాటిని ప్రాధాన్యత ఇవ్వడం అవసరమవుతుంది.




సమాజంలో హక్కులు, కులం, గోత్రం, మతం, ప్రాంతాల మధ్య ఉన్న అస్తవ్యస్తతలను తగ్గించాలనే దృష్టితో సామాజిక-ఆర్థిక సమానత్వం ప్రాధాన్యతను ఇవ్వడం, ప్రజల హక్కులు, రుణాలు, ఉపాధి అవకాశాలు, మహిళల సాధికారత, ఆరోగ్య-సామాజిక సంక్షేమం మొదలైన అంశాల పై ప్రాధాన్యం ఇవ్వడం ఈ ప్రణాళికలో ప్రధానంగా ఉంది. ఈ ప్రణాళికను అమలు చేయడానికి, నియంత్రణ, పారదర్శకత, విధానాల్లో నిరంతర మార్పులు, సమర్థమైన పాలన, సంస్కరణలు, వివిధ వర్గాల-రాజకీయ-ఆర్థిక-పరిశ్రామిక సహకారం అవసరం. ఈ ప్రణాళికకు సంబంధించిన యథార్థ-గమ్యాల కలసినంతా తెలంగాణను ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చెందించిన, సాంకేతిక-ఆర్థిక హబ్‌గా మార్చే దిశగా ఇది కృషి చేయవచ్చును. కానీ, ఈ ప్రణాళికకు అనుకూలంగా సవాళ్లు కూడా ఉన్నాయి. గ్రామీణ-పట్టణ-సామాజిక మార్పులను సమన్వయంగా తీసుకురావడం, రైతుల పరిస్థితుల- ఆర్థిక-వ్యవసాయ-జీవన్మార్గాలను మెరుగుపరచడం, వ్యవసాయ సాగును కొత్త సాంకేతికతలకు తగినట్లుగా మార్పులు చేయడం, గ్రామీణ ప్రాంతాల్లోకి మార్కెటింగ్-పరిశ్రమను తీసుకురావడం, పట్టణ కేంద్రీకరణ వల్ల వచ్చే సంక్షోభాలను ఎదుర్కోవడం వంటి సమస్యలను అధిగమించాల్సిన అవసరం ఉంటుంది. ప్రతి పక్కన ప్రభుత్వం, రాజకీయ-ఆర్థిక వర్గాలు, సామాజిక శక్తులు-ప్రజలు భాగస్వామిగా ఈ ప్రణాళికను తీసుకువెళ్ళి, తెలంగాణను 2047 నాటికి ఒక మెరుగైన ఆర్థిక-సామాజిక రాష్ట్రంగా నిర్మించాలన్న లక్ష్యంతో ప్రజలు, అభ్యుదయ భావనతో ఈ ప్రణాళికను విజయవంతంగా అమలు చేసే విధానం ఇవ్వబడింది. ఈ దిశగా అన్ని వర్గాల-సామాజిక-ఆర్థిక భాగస్వామ్యం, ప్రజల సమన్వయం, ఉద్యమం, పారదర్శక పాలన, సాంకేతిక మార్పులు, గ్రామీణ అభివృద్ధి, పట్టణ అభివృద్ధి, పరిశ్రమ-పరిశ్రమ సంయోగం వంటివి సమగ్ర అభివృద్ధి-పూర్వక దిశగా - 2047 లక్ష్యాలను చేరుకోడానికి కీలకమైనవి.

తెలంగాణ విజన్ 2047 ప్రణాళికను అమలు చేయడం ద్వారా, రాష్ట్రం వర్తమానాన్ని అధిగమించి, ప్రతి రంగంలో పోటీ సృష్టించగలిగే స్థాయికి చేరుకోవచ్చు. ఇలాంటి విజయానికి కావలసిన సహకారం పేద, రైతు, మహిళ, యువతా వర్గాలకు అన్ని వర్గాల నుంచి అందాల్సి ఉంటుంది. ఈ లక్ష్యాలను సాధించడానికి, ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, అలాగే ప్రైవేటు పెట్టుబడులు సమన్వయంగా పనిచేయడం అత్యంత అవసరం. విజన్ డాక్యుమెంట్, ప్రతిసారీ పెట్టుబడులను ఆకర్షించడానికి, పెట్టుబడిదారుల అవసరాలను, వారి ప్రయోజనాలను కూడా చూసుకుంటూ, సామాన్య ప్రజల అభివృద్ధి కోసం కూడా కృషి చేయాలని పేర్కొంది. ప్రభుత్వ పాలనలో పారదర్శకతను పెంచి, ప్రజల హక్కులను సురక్షితం చేయడం, అలాగే సమాజంలో ఉన్న పేదరికాన్ని నివారించేందుకు ఉన్నతమైన విధానాలను ప్రవేశపెట్టడం చాలా ముఖ్యమైంది. అందరూ కలసి, తెలంగాణ అభివృద్ధి కోసం నిరంతర కృషి చేయడం, ఈ విజన్ ను నిజం చేసే విధంగా ప్రతి ఒక్కరికీ తమ బాధ్యతను గుర్తించి, దానిని నెరవేర్చడం కావాలి. అందరికీ అందుబాటులో ఉన్న విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు, సాంకేతిక పరిజ్ఞానం అన్ని రంగాలలో సమానంగా అందించాలి. 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం సాధించే ప్రగతి, దేశవ్యాప్తంగా ఉదాహరణగా నిలిచేలా ఉంటుంది. తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ 2047, రాష్ట్ర అభివృద్ధికి దారి చూపే మైలురాయిగా నిలిచిపోతుంది.

ం.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# మనవ హక్కులకు అండగా-హెచ్ఆర్సీ

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పౌరుడి వ్యక్తిగత గౌరవం, అభివృద్ధి, స్వేచ్ఛ, భద్రత అనేవి రాజ్యాంగం ప్రసాదించిన మౌలిక హక్కులు. అయితే ఈ హక్కులు వాస్తవ జీవితంలో తరచూ భంగం కలుగుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం, అధికార దుర్వినియోగం, పోలీసు వ్యవస్థలోని అవకత వకలు, సామాజిక వివక్ష, ఆర్థిక బలహీనతు ఇలాంటి అనేక అంశాలు పౌరుల హక్కులను ప్రమాదంలో పడేస్తున్నాయి. బాధితులకు న్యాయం దొరకకపోవడం, తమ సమస్యను ఎక్కడకు తీసుకెళ్లాలో తెలియక తలవంచు కోవడం ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో కనిపించే వాస్తవం. ఈ నేపథ్యంలో మానవ హక్కుల కమిషన్లు ప్రజలకు రక్షణ కవచంలా నిలుస్తున్నాయి.

"అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం-చారిత్రక నేపథ్యం.." ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం "డిసెంబర్ 10ను అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవంగా" జరుపుకుంటారు. కారణం..1948 డిసెంబర్ 10న ఐక్యరాజ్యసమితి సార్వత్రిక మానవ హక్కుల ప్రకటన (Universal Declaration of Human Rights—UDHR)ను ఆమోదించిన రోజు అదే. ఈ ప్రకటన మొత్తం ప్రపంచానికి ఒకే సందేశం ఇచ్చింది..ప్రతి మనిషి పుట్టుకతోనే స్వేచ్ఛగలవాడు, సమాన గౌరవం కలవాడు. ప్రపంచంలోని యాభైకి పైగా రాజ్యాంగాలు,వందల చట్టాల రూపకల్పన ఈ UDHR ఆధారంగానే అమలు చెందాయి.

యునైటెడ్ నేషన్స్ ప్రతి సంవత్సరం ఒక థీమ్‌ను ప్రకటిస్తుంది. ఇటీవల సంవత్సరాల్లో ప్రధానంగా ప్రస్తావించిన అంశాలు-Freedom, Equality, Justice for All, "Dignity, Freedom & Justice, Stand Up for Human Rights". ప్రపంచ దేశాల ప్రభుత్వాలు ప్రజల హక్కుల పట్ల మరింత కట్టుబడి ఉండాలని, హక్కులను అమలు చేయడంలో పారదర్శకత అవసరమని ఈ దినోత్సవం గుర్తు చేస్తుంది. భారతదేశంలో మానవ హక్కుల కమిషన్ల పుట్టుపూర్వోత్తరాలు"..

భారతదేశం మానవ హక్కుల రక్షణను బలోపేతం చేయడానికి 1993లో 'Protection of Human Rights Act ను చట్టరూపంలోకి తెచ్చింది. ఈ చట్టంతో రెండు ప్రధాన సంస్థలు ఏర్పడ్డాయి. జాతీయ మానవ హక్కుల కమిషన్ (NHRC): రాష్ట్ర మానవ హక్కుల కమిషన్లు (SHRCs): ఇవి ప్రభుత్వానికి లోబడని స్వతంత్ర విచారణ సంస్థలు. సివిల్ కోర్టుల తరహా అధికారాలు వీటికి ఉంటాయి. పౌరుల గోసలను స్వయంగా విచారణ చేసి, అవసరమైతే ప్రభుత్వానికి కఠిన సిఫారసులు చేయగల శక్తి వీటి వద్ద ఉంది.

**కమిషన్ల ప్రధాన లక్ష్యాలు, ఆశయాలు..**

- హక్కులు ఉల్లంఘించ బడకుండా పౌరులను రక్షించడం.
- ప్రభుత్వ వ్యవస్థలో బాధ్యతా స్ఫూర్తి పెంచడం.
- అధికార దుర్వినియోగాన్ని అరికట్టడం.
- బాధితులకు సమయానుకూల న్యాయం అందించడం.
- ప్రజల్లో మానవ హక్కులపై అవగాహన పెంపొందించడం.
- పారదర్శక విచారణ, నిజనిర్ధారణకు కట్టుబడి ఉండడం.
- "ఎవరూ న్యాయం కోసం తలవంచకూడదు" అనే ఆశయం ఆధారంగానే కమిషన్లు పనిచేస్తాయి..
- ఎలాంటి అంశాలపై ఫిర్యాదు చేయవచ్చు?..
  సాధారణపౌరుడు తన హక్కులుఉల్లంఘించబడిన, ఏ సందర్భంలోనైనా వెంటనే హెచ్ఆర్సీని ఆశ్రయించవచ్చు. ముఖ్యంగా-పోలీస్ చిత్రహింసలు, బూటకపు ఎన్‌కౌంటర్లు. అక్రమ నిర్బంధాలు, కస్టడీ మరణాలు.బాలకార్మికులు, వెట్టి చాకిరి, అంటరానితనం.వైద్య సేవల నిరాకరణ,ఆకలితో బాధపడేవారు.ఆదివాసీ హక్కుల ఉల్లంఘన, భూఆక్రమణలు. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం వల్ల జరిగిన నష్టం. తాగునీరు, విద్యుత్తు లాంటి మౌలిక సౌకర్యాల నిరాకరణ. లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు, వృద్ధులపై నిర్లక్ష్యం. లంచం కోసం ఇబ్బంది పెట్టడం. సామూహిక భూముల కబ్జాలు. ఇవి అన్నీ మానవ హక్కులఉల్లంఘనలుగా పరిగణించబడతాయి. కమిషన్ పరిధిలోకి వస్తాయి.




**ఫిర్యాదు ఎలా చేయాలి?**

- హెచ్ఆర్సీకి ఫిర్యాదు చేయడం చాలా సులభం..సాదా పోస్ట్‌కార్డు చాలు తెలుగులో రాసినా పూర్తిగా ఆమోదిస్తారు, ఎలాంటి రుసుము అవసరం లేదు.కమిషన్ స్వయంగా సాక్షులను పిలవవచ్చు. పత్రాలు సమర్పించమని ప్రభుత్వ అధికారులను ఆదేశించవచ్చు.
- మీడియా కథనాలను సుమోటాగా విచారణకు తీసుకోవచ్చు హక్కుల ఉల్లంఘన నిర్ధారణ అయితే, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి ఆదేశాలుబాధితులకు పరిహారం చెల్లించాలని సిఫారసు తదుపరి ఇలాంటి సంఘటనలు జరగకుండా చూస్తుంది..
- తెలుగు రాష్ట్రాల హెచ్ఆర్సీ చిరునామాలు: తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ గృహకల్ప కాంప్లెక్స్, ఎంజే రోడ్,గాంధీభవన్ ఎదురు, నాంపల్లి, హైదరాబాద్-500001.
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్:డోర్ నం. 76/114, రాగమ-మయూరి ఫైడ్ కాంప్లెక్స్, 2nd APSP క్యాంప్ పోస్ట్, డీమార్ట్ వెనుక, బళ్లారి చౌరస్తా, నిర్మల్ నగర్, కర్నూలు-518003.
- అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఒక స్పష్టమైన సందేశం మనం గుర్తుంచుకోవాలి, హక్కులు పౌరుడి శ్వాస. అవి ఎక్కడైనా భంగం కలిగినా, కుదేలైనా న్యాయానికి తలుపులు మూసుకు పోలేదు. హెచ్ఆర్సీ అనే రక్షణ కవచం ఉందని గుర్తుంచు కోండి .ప్రతి ప్రభుత్వ బాధ్యత..

హక్కులను రక్షించే విధానాలను బలోపేతం చేయడం.ప్రతి పౌరుడి బాధ్యత,తన హక్కులపై అవగాహన పెంపొందించు కోవడం.మన హక్కుల రక్షణ-మన బలం.మన బలం-మానవ హక్కుల కమిషన్.



మేకిరి దామోదర్
సామాజిక విశ్లేషకులు
జిల్లా: వరంగల్
ఫోన్ : 9573 666650

# ఇండిగో విమానాల సంక్షోభం

## కారణాలు, ప్రతిస్పందన, విమర్శలు




భారతదేశంలో విమాన సంస్థల రంగం అకస్మాత్తుగా గందరగోళంలో పడింది. దేశంలోనే అతిపెద్ద విమాన సంస్థగా పేరుగాంచిన ఇండిగో ఎయిర్లైన్స్, 2025 డిసెంబర్ మొదటి వారంలో వెడల్పుగా విమానాలు రద్దు చేయడం, విమానాలు ఆలస్యం చేయడం వల్ల ప్రయాణికులను బాధించింది. ఈ పరిణామాల వల్ల లక్షలాది మంది ప్రయాణికులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయారు. ఢిల్లీ, ముంబై, బెంగళూరు వంటి ప్రధాన విమానాశ్రయాల్లో గలబా నెలకొంది. ఈ సంఘటన ఇండిగోకు 20 సంవత్సరాల చరిత్రలో అతిపెద్ద సంక్షోభంగా నిలిచింది.

**సమస్యలకు కారణాలు: కొత్త నియమాలు, నిర్వహణ లోపాలు**

ఈ సంక్షోభానికి ప్రధాన కారణం సివిల్ ఏవియేషన్ ప్రధాన నిర్దేశక కార్యాలయం (డీజీసీఏ) జారీ చేసిన కొత్త విమాన డ్యూటీ సమయ పరిమితి (ఎఫ్డీటీఎల్) నియమాలు. 2025 నవంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చిన ఈ నియమాలు పైలట్లు, క్రూ సభ్యుల విశ్రాంతిని మరింత కఠినంగా మార్చాయి. ముఖ్యంగా, వారానికి 48 గంటల తప్పనిసరి విశ్రాంతి, వ్యక్తిగత సెలవు రోజులు విశ్రాంతిగా లెక్కించకూడదు. రాత్రి విమాన ప్రయాణానికి (రాత్రి 12 నుంచి ఉదయం 6:50 వరకు) డ్యూటీ గంటలు పరిమితం చేయబడ్డాయి. ఇండిగో ఈ మార్పులకు సరిగ్గా సిద్ధం కాలేదు. పైలట్ల కొరత, శీతాకాలపు విమానాల షెడ్యూల్ ఒత్తిడి వల్ల సిబ్బంది నిర్వహణ విఫలమైంది. సివిల్ ఏవియేషన్ మంత్రి రామ్ మోహన్ నాయిడు ప్రకారం, ఇతర విమాన సంస్థలు (ఎయిర్ ఇండియా, స్పైస్జెట్) ఆరు నెలల ముందుగానే సర్దుబాటు చేసుకున్నాయి, కానీ ఇండిగో మాత్రం ఆలస్యం చేసింది. జూన్-జూలై నుంచి హెచ్చరికలు ఇచ్చినా, కొత్త పైలట్లను నియమించడం, విమాన సిబ్బంది షెడ్యూల్ సర్దుబాటు ఆలస్యమైంది. ఫలితంగా, డిసెంబర్ 3 నుంచి 1,000కి పైగా విమానాలు రద్దు అయ్యాయి. ఇది దేశవ్యాప్తంగా ప్రయాణికులను, వ్యాపారస్తులను, ప్రముఖులను కలవరపరిచింది.

**మీడియా వార్తలు - విస్తృత కవరేజీ, ప్రయాణికుల బాధలు:**

మీడియా ఈ సంఘటనను 'జాతీయ సంక్షోభం'గా వర్ణించింది. 'ఇండియా టుడే' ప్రకారం, మూడో రోజులో 600కి పైగా విమానాలు రద్దు అవుతున్నాయి, ఢిల్లీ విమానాశ్రయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అన్ని బయలుదేరే విమానాలు ఆపివేయబడ్డాయి. 'హిందుస్తాన్ టైమ్స్'లో, ఐదో రోజు 800కి పైగా విమానాలు రద్దు, విమాన టిక్కెట్ల ధరలు దుబాయ్, థాయ్లాండ్ మార్గాల కంటే ఎక్కువగా పెరిగాయని రాశారు. 'ది హిందూ'లో, రాహుల్ గాంధీ విమర్శలు, ఏకస్వామ్య (మోనోపలీ) విధానంపై చర్చ జరిగింది. 'యుఎస్ న్యూస్'లో, 1,000కి పైగా విమానాలు రద్దు, పైలట్ కొరతను ప్రస్తావించారు. 'టైమ్స్ ఆఫ్ ఇండియా'లో మంత్రి నాయిడు వ్యాఖ్యలు, సిబ్బంది నిర్వహణ లోపాలపై దృష్టి పెట్టారు. 'ఎన్డీటీవీ'లో, మంత్రి "చర్యలు తప్పకుండా జరుగుతాయి" అని చెప్పారు. 'ఎకనామిక్ టైమ్స్'లో, విపక్షాలు కేంద్ర ప్రభుత్వాన్ని 'తప్పుగా నిర్వహించడం' గా ఆరోపించాయి. 'సీబీఎస్టీవీ18'లో, పార్లమెంటులో చర్చ, ఏకస్వామ్యంపై చర్చ జరిగింది. మీడియా ప్రయాణికుల కథలు, వృద్ధులు, ప్రత్యేక అవసరాలున్నవారి ఇబ్బందులను ప్రస్తావించింది. యూట్యూబ్లో మంత్రి ఇంటర్వ్యూలు, గందరగోళ దృశ్యాలు వేగంగా వ్యాపించాయి. ఈ కవరేజీ ప్రభుత్వాన్ని చర్యలు తీసుకోవడానికి ఒత్తిడి తెస్తుంది.

**ప్రభుత్వ ప్రతిస్పందన: పరిశోధన, ఉపశమన చర్యలు:**

ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుంది. డీజీసీఏ ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఇండిగోకు 24 గంటల్లోగా కారణాలు తెలపమని నోటీసు జారీ చేశారు. మంత్రి నాయి డు, ఇతర అధికారులు ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్తో సమావేశమై, పరిస్థితి సమీక్షించా రు. ఇండిగోకు ఫిబ్రవరి 10, 2026 వరకు కొత్త నియమాల నుంచి మినహా యింపు ఇచ్చారు. ప్రయాణికులకు డిసెంబర్ 7 నాటికి డబ్బు వాపసు, 48 గంటల్లో సామాను అందించే ఆదేశాలు జారీ చేశారు. విమాన టిక్కెట్ల ధరలు పెరగకుండా పరిమితి విధించారు: 500 కి.మీ. మార్గాలకు ₹7,000, 1,000-1,500 కి.మీ.కు ₹15,000 వరకు. అదనపు రైళ్లు నడపడం ద్వారా, చిక్కుకుపోయిన ప్రయాణికులకు ఉపశమనం ఇచ్చారు. ఇండిగోకు కొన్ని ప్రధాన విమానాలను రద్దు చేయమని, విమానాశ్రయాల్లో వారి వసతు లు తగ్గించమని చేశారు. మంత్రి "భద్రతపై రాజీ లేదు, బాధ్యులను శిక్షిస్తాము" అని స్పష్టం చేశారు. ఈ చర్యలతో పరిస్థితి మెరుగుపడుతోందని అంచనా.

**విపక్షాల విమర్శలు: ఏకస్వామ్య విధానం, ప్రభుత్వ వైఫల్యం.**

విపక్షాలు ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించాయి. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇది ప్రభుత్వం యొక్క ఏకస్వామ్య విధానం వల్ల వచ్చిందని ఆరోపించారు. "అన్యాయమైన ఏకస్వామ్యాలకు బదులుగా న్యాయమైన పోటీ అవసరం" అని, విధాన వైఫల్యాల భారం సాధారణ ప్రయాణికులపై పడుతోందని చెప్పారు. కాంగ్రెస్ నాయకుడు కె.సి. వేణుగోపాల్ "ప్రభుత్వం నిద్రపోతోంది" అని, జెట్ ఎయిర్వేస్, గో ఎయిర్ లాంటి సంస్థలు కూలిపోవడం, ఎయిర్ ఇండియా విలీనంతో రెండు సంస్థల ఏకస్వామ్యం (డ్యూయోపలీ) సృష్టించడాన్ని ఆరోపించారు. ఇతర నాయకులు మార్కెట్ శక్తి కొద్ది మందికే కేంద్రీకరించడం, దేశంలో చాలా వ్యాపారాలు కొద్ది మంది చేతుల్లో ఉండడం ప్రజాస్వామ్యానికి, ఆర్థిక వ్యవస్థకు హానికరం అని విమర్శించారు. పార్లమెంటులో 'జీరో అవర్' సమయంలో ఈ విమర్శలు చర్చకు వచ్చాయి.

**భవిష్యత్తు పాఠాలు:**

ఈ ఇండిగో సంక్షోభం భారత విమానయాన రంగంలోని బలహీనతలను బయటపెట్టింది. ఏకస్వామ్య ధోరణులు, నియంత్రణ చర్యలు, కార్పొరేట్ దురాశ వల్ల ప్రయాణికులు బాధపడ్డారు. ప్రభుత్వ చర్యలు తాత్కాలిక ఉపశమనం ఇచ్చినా, దీర్ఘకాలిక సంస్కరణలు అవసరం. పోటీని పెంచడం, భద్రతపై దృష్టి పెట్టడం, ప్రయాణికుల హక్కులను బలోపేతం చేయడం ద్వారా మాత్రమే ఇలాంటి సంక్షోభాలు నివారించవచ్చు. ఈ సంఘటన ఆర్థిక వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి ఒక సవాలుగా మారింది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# మానసిక సంఘర్షణకు అక్షర దర్పణం

**"మేడిపండు కథా సంపుటి" పుస్తక సమీక్ష**

రాచమళ్ళ ఉపేంద్ర గారు రచించిన "మేడిపండు" కథల సంపుటి, శ్రమజీవుల జీవన విధానంలోని మానసిక సంఘర్షణకు అక్షర దర్పణం.

డెబ్బై ఐదు వసంతాల స్వతంత్ర భారతంలో అభివృద్ధికి నోచుకోని మారుమూల ప్రాంతాల నిరుపేదల కష్టాల ముఖచిత్రమే ఈ సంపుటి.

సమాజాన్ని అక్షరాల్లో నిగ్గదీసిన కవి అంతర్మథనం ఈ కథలు. ఓట్లు అడుక్కుంటూ వీధి వీధి తిరిగిన నాయకుడు నేడు కోట్ల ధనం దండుకుంటుండు. తరతరాలకు తరగని సంపదలను వెనకేసుకుంటుండు. కానీ ఓట్లు వేసిన సామాన్యులు మాత్రం తమ నుదుటిపై రాతలను నిందించుకుంటూ వెట్టిచాకిరీ చేస్తూ మగ్గిపోతుంటారు. దవాఖానాల చుట్టూ తిరుగుతుంటారు. దీనికి కారణమేమిటి? బాధ్యులెవ్వరు? అనే సమాధానం కోసం సంధించిన అక్షరాలే ఈ సంపుటిలోని కథలు. ఆర్థిక అసమానతలను చూస్తూనే, కన్నీళ్లు తూడ్చుకుంటూ... రేపటి వెలుగుల కోసం నిరీక్షిస్తూ కాలం గడుపుదామా? అనే ప్రశ్న ప్రతి పాఠకుని హృదయాన్ని సూటిగా తాకేలా రచనలను సంధించిన కథల సంకలనం మేడిపండు.

**ఎదను తడిమేస్తున్న కథనాలు**

శ్రమజీవుల దీనగాథలు, సమాజంలోని వాస్తవిక సంఘటనలను కథలుగా మలిచి అందించగల బహునేర్పరి రాచమళ్ళ ఉపేందర్ గారు. అనేక సాహిత్య సంస్థలు నిర్వహించిన కథల పోటీల్లో ఉత్తమ కథల విభాగంలో ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. "అక్షరాల తోవ" అనే సాహిత్య వేదిక సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వహిస్తూనే, వర్ధమాన కవులను ప్రోత్సహిస్తున్నారు. తనలోని భావాలను నలుగురిలో పంచుకునే ఈ కవి, కథా రచయిత, వ్యాసకర్త... ఇలా అనేకానేక రంగాలలోనూ రాణిస్తున్నారు.

రాచమళ్ళ ఉపేందర్ గారి మస్తిష్క మధనం నుండి పురుడు పోసుకున్న కథల సంపుటి ఈ "మేడిపండు."

మేడిపండులా కనిపించే సమాజంలో అంతరంగా దాగిన అనేక సమస్యలను తనదైన శైలిలో, కవి కోణంతో చాలా దగ్గరిగా, నిశితంగా పరిశీలిస్తూ అక్షరీకరించారు. సగటు సామాన్యుని జీవన విధానం కళ్లకు కట్టినట్లుగా వివరిస్తూ మనకు అందించిన కథల అక్షయపాత్ర ఈ సంపుటి.

ఒక కథ చదివిన తరువాత, ఆ కథలోని పాత్రలు మనతో కొన్ని రోజులు ప్రయాణించాలి. అటువంటి కథలను, పాత్రలను సృష్టించి, సమాజంలోని వాస్తవ సంఘటనలో వాటిని ప్రతిష్ఠించిన కథల మణిహారమే మేడిపండు.

కథ యొక్క లక్షణాలను పరిశీలిస్తే, కథకు ప్రారంభం ఎంత ముఖ్యమో ముగింపుకు అంతకంటే ప్రాముఖ్యత ఉంటుంది. రెండింటినీ సమన్వయ పరిచే మధ్యస్థ కథనం పాఠకుల్ని ముందుకు పరుగులు పెట్టించాలి. ఊహకందని ముగింపును పాఠకుడు కోరుకుంటాడు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని సంపుటిలో రచయిత చాలా వైవిధ్యమైన ఇతివృత్తాలను ఎన్నుకుని, కథా రచయితగా తనను తాను నిరూపించుకున్నారు.

**ఇక్కడ మనం వేమన పద్యం గుర్తు చేసుకుందాం:**

మేడిపండు చూడ మేలిమైయుండు
పొట్టవిప్పి చూడ పురుగులుండు...

కానీ ఈ మేడిపండు సంపుటి మొదటి పేజీ నుండి చివరి పేజీలవరకు మధ్యతరగతికి చెందిన మనిషి జీవన విధానం, తను ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిని పరిష్కరించడానికి సహకరించే కుటుంబ బంధాలు... ఇలా చెప్పుకోవడానికి ఎన్నో అంశాలు మనకు కనిపిస్తూ పలకరిస్తుంటాయి.

**కన్నీటి ప్రవాహం**

"కన్నీటి ప్రవాహం" కథ చదువుతుంటే నాకు సిరివెన్నెల సీతారామశాస్త్రి గారి "అర్ధశతాబ్దపు అజ్ఞానాన్ని స్వాతంత్రమందామా, దానికి స్వర్ణోత్సవాలు చేద్దామా" అనే పాట గుర్తుకు వస్తుంది. ఎన్ని పంచవర్ష ప్రణాళికలను వేసినా మారని పేదవాని జీవన విధానం చూస్తుంటే, మనం సాధించిన ప్రగతి ఎక్కడ? అనే ప్రశ్న ప్రతి క్షణం వెంటాడుతుంది.

"మనం అభివృద్ధి పథంలో దూసుకు పోతున్నాం" అని వేదికపై రాజకీయ నాయకులు చెప్తుంటారు. కానీ ఇలాంటి సంఘటనలు ఎదురైనప్పుడు మనం అభివృద్ధి సాధించామని చెప్పుకునే ధైర్యం, తెగువ లేదా నిజాయితీ మనలో ఉందా? అలా ఉంటే ఇంకా మారుమూల ప్రాంతాల్లో రవాణా, వైద్య, విద్యా సౌకర్యాలు లేకుండా బ్రతుకుతున్న అనేక జీవితాలకు వెలుగు ఎందుకు అందడం లేదు? అని ప్రశ్నిస్తే, మనం సమాధానం తడుముకోవలసిన పరిస్థితి నెలకొంది నేడు."కన్నీటి ప్రవాహం" కథ ఒక వాస్తవిక సంఘటనే. ఇప్పటికీ మారుమూల ప్రాంతాల్లో, ఏజెన్సీ ఏరియాల్లో ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉంటాయి. మార్పు రాకపోవడానికి కారణం ఎవ్వరు? అందులో నా పాత్ర ఎంత? మార్పు తీసుకు రాలేకపోతున్న నేటి వ్యవస్థలోని యంత్రాంగం చేత పని చేయించుకోలేని మన నిస్సహాయతను కాదనగలమా? ఇలా వెంటాడే ప్రశ్నల కు సమాధానం మనం తప్పక వెతకాలి అనిపిస్తుంది ఈ కథ చదువుతుంటే.

**నాన్నా...! మన ఇంటికెల్దామా?**

"నాన్నా ...! మన ఇంటికెల్దామా?" అనే కథ గురించి ఇక్కడ చర్చించక తప్పదు. యావత్ ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన మహమ్మారి కరోనా. దాని ప్రభావంతో ఎన్ని లక్షల కుటుంబాలు బలైపోయాయో? ఎందరు నిర్భాగ్యులు ఆత్మహత్యలు చేసుకున్నారో? ఎన్ని వేల మృతదేహాలకు కనీస దహన సంస్కారాలు నోచుకోలేదో? నేటికీ లెక్కతేలలేదు.

అంతటి విపత్కర పరిస్థితుల్లో జీవనాధారం కోసం వలస వెళ్ళిన కాన్షీరాం కుటుంబం, సొంతగూటికి చేరలేక, పొరుగు రాష్ట్రాల్లో ఉండిపోలేక, జీవన్మరణ పోరాటంలో తన కన్న కూతుర్ని కోల్పోయిన విధానం ప్రతి పాఠకుని హృదయాన్ని ద్రవింపచేసేలా సాగుతుంది. ముగింపును విషాదభరితంగా ముగించినా, చివరగా సంధించిన ప్రశ్న ప్రతి ఒక్కరూ ఆత్మ పరిశీలన చేసుకోవాలి అనేంతగా ఎదను తాకుతుంది.

"పసి ప్రాణం తీసిందెవ్వరు...???
ఈ పాపంలో తమ పాత్ర లేదని చెప్పగల యోగ్యుడు ఎవ్వరు?..."

సమాధానం మనకే వదిలేసాడు రచయిత. కొన్ని రోజులు వరకు ఈ ప్రశ్న మనల్ని వెంటాడుతూనే ఉంటుంది. అదే కథ గొప్పతనం.

మరో కథ "మేడిపండు". సంకలనం ఆయువుపట్టు ఈ కథనమే. సమాజంలో దోపిడీ వర్గాన్ని కొమ్ముకాసే ప్రభుత్వ, పాలక వర్గాలు, వ్యవస్థను ఎలా భ్రష్టు పట్టిస్తాయో తెలిపిన కథ. దోచేవాడు ఒకడు, దండన భరించే వాడు మరొకడు. సామాన్యుని చెంతకు చేరని చట్టాలు, ఉన్నవాడికే ఊడిగం చేస్తూ, సామాన్యుని నడ్డి విరిచేస్తున్నాయి. నేటి పాలక వర్గానికి నిదర్శనం ఈ కథనం. సామాన్యునికి న్యాయం జరిగేది ఎన్నడో? అనే ప్రశ్నకు బీజం ఈ కథ. ఉన్నత కుటుంబాల ఇళ్లలో జరిగే దారుణాలకు, జీవనాధారం కోసం కూలి పని చేసుకునే అమాయకులు ఎలా బలి అవుతారో వివరించిన కథనం."శివంగి" కథ వ్యవస్థలో మార్పు రాదు, మార్పు తీసుకువచ్చే ప్రయత్నం మనతోనే మొదలవ్వాలనే సందేశాన్ని నిలుపుకున్న కథ. నిరక్షరాస్యతను అడ్డుపెట్టుకుని, ధనవంతులు సామాన్యుల్ని దోచుకోవాలని చూసే ఇతివృత్తంగా తీసుకుని రాసిన అద్భుతమైన కథనం శివంగి. భర్తను, కన్న కొడుకును కోల్పోయి, జీవనాధారం కోసం చిన్న హోటల్ పెట్టుకు జీవించే చుక్కమ్మ. తన స్థలాన్ని మోసంతో ఆక్రమించుకోవాలని చూసే భూస్వాములపై తిరుగుబాటు చేసి తన జీవనాధారం దక్కించుకున్న విధానం ఎందరికో ఆదర్శంగా నిలుస్తుంది.

చుక్కమ్మతో మొదలైన తిరుగుబాటు, మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపే దిశగా సాగుతుంది.

పుస్తక పరిచయ కర్త:
సాహిత్యరత్న రాము కోలా,
కవి, కథారచయిత, వ్యాసకర్త
దెందుకూరు, ఖమ్మం జిల్లా
సెల్: 9849001201.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, డిసెంబర్ 8 (జనంసాక్షి) :** అబద్ధాల పాలనతో బిఆర్ఎస్ పార్టీ 10 సంవత్సరాలు నెట్టుకొచ్చిందని అభివృద్ధి పాలన కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తాండూరు మండలం సంగెంకాలాన్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భాగ్య లక్ష్మికి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి పక్ష నాయకులకు రెండేళ్లుగా ప్రజలు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో సంక్రాతి పండుగకు గంగిరెద్దుల వాళ్ళు వచ్చినట్టు గ్రామల్లోకి వస్తున్నారు. రెండేళ్ల ప్రజాపాలన ఒక్క వైపు, పదేళ్ల రాక్షస పాలన ఒక్క వైపు ఉందన్నారు. ప్రజలకు అభివృద్ధి, అందుబాటు అనే నినాదంతో రెండేళ్లుగా తాండూర్‌లో పాలన సాగుతుందన్నారు. ఏలాంటి పైరవి లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు, అభివృద్ధి నిధులతో పాటు ఎమ్మెల్యేగా యువతకు విద్య, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగుతుందని వెల్లడించారు. ఎమ్మెల్యేగా నువ్వు ఇళ్ళు కట్టుకున్నావ్ కానీ, తాండూర్ ప్రజలకు ఒక్క ఇళ్ళు అయినా ఇచ్చినవా అని ప్రశ్నించారు.. యువతకు చెడు వ్యాసనలకు అలవాటు చేశాడు తప్ప, ఒక్కరికైన ఉద్యోగం ఇచ్చిండా అని తెలిపారు.. గ్రామ పంచాయతీ ఎన్నికల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 25 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం చేసిన ఘనత మా ప్రభుత్వానిదేనన్నారు. గతంలో ఎన్నికలు వచ్చాయంటే గ్రామల్లో వర్గపోరుతో విభేదాలు సృష్టించారు. ఎమ్మెల్యేగా రెచ్చగొట్టడం, కేసులు చేయడం నాకు రాదు, తాండూర్ నియోజకవర్గ అభివృద్ధే నా లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి విద్యార్థులు ప్రతి ఒక్కరూ వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి నుషిత



**గద్వాల నడిగడ్డ, డిసెంబర్ 8 (జనం సాక్షి) :** పదవ తరగతి విద్యార్థులు ప్రతి ఒక్కరూ 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని, ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి నుషిత అధికారులను ఆదేశించారు. సోమవారం గద్వాల పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతి గృహాన్ని జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అందుతున్న భోజనం, వంటగది పరిస్థితులు, బాత్‌రూమ్‌లు, వసతి గృహ పరిసరాల శుభ్రతను పరిశీలించి, అవసరమైన సూచనలు చేశారు. విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులను ఆదేశించారు. ప్రతి నెల మెడికల్ క్యాంప్ నిర్వహించి, విద్యార్థినులకు అవసరమైన మందులు అందించాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి, హాస్టల్ వసతులు, విద్యార్థినుల చదువు పరిస్థితుల గురించి వారికి తెలియజేయాలని ఆదేశించారు. విద్యార్థినులు చదువు మధ్యలో మానుకుని ఊరికి వెళ్లకుండా చూడటం వసతి గృహ అధికారుల బాధ్యత అని చెప్పారు. 10వ తరగతి విద్యార్థినుల చదువు గురించి కూడా వివరంగా తెలుసుకున్నారు. ట్యూటర్లు బోధిస్తున్న విధానం, విద్యార్థినుల ప్రగతి గురించి ఆరా తీసి, ఈ విద్యాసంవత్సరంలో అందరూ ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. అనంతరం రికార్డులు మరియు వసతి గృహ గదులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 51వ జూనియర్స్ కబడ్డీ బాయ్స్ రాష్ట్రస్థాయి విజేత వనపర్తి జిల్లా జట్టు



**వీపనగండ్ల, డిసెంబర్ 9 (జనం సాక్షి) :** ఈ నెల 5, 6, 7 తేదీలలో మహబూబ్నగర్ జిల్లాలో జరిగినటువంటి తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 51 వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో వనపర్తి జిల్లా కబడ్డీ అసోసియేషన్ జూనియర్ బాలుర జట్టు విజయ్ కేతనం ఎగరవేసింది. ఏడు సంవత్సరాల తర్వాత మళ్లీ జూనియర్స్ విభాగంలో బాలురు ప్రథమ స్థానంలో నిలిచిందని అసోసియేషన్ సభ్యులు అన్నారు. వనపర్తి జిల్లా కబడ్డీ జట్టు ప్రతి మ్యాచ్ ఉత్కంఠ భరితంగా హెూరాహెూరిన పోరాడి ఫైనల్ మ్యాచ్ హైదరాబాద్ జట్టు తో ఉత్కంఠ భరితంగా తలపడి ప్రథమ స్థానంలో నిలిచింది అన్నారు. వనపర్తి జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ పద్మజా రెడ్డి, అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, ఒలంపిక్ అసోసియేషన్ జనరల్ కార్యదర్శి ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కురుమూర్తి గౌడ్, వనపర్తి జిల్లా కబడ్డీ అసోసియేషన్ జనరల్ కార్యదర్శి ఎం.కురుమయ్య, కోశాధికారి ఆర్. గోపాలం, ఉపాధ్యక్షులు దామోదర్, తిరుపతయ్య, కిషోర్, వెంకటయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ మధు, వెంకట్రాములు జాయింట్ సెక్రెటరీ చంద్రశేఖర్ గౌడ్, నాగరాజు, వెంకటేష్, అశోక్ అసోసియేషన్ సభ్యులు జట్టు క్రీడాకారులను అభినందించారు. భవిష్యత్తులో ఎన్నో విజయాలు సాధించాలని అన్నారు.

## ఐబీపీఎల్ విన్నర్ ముంబై స్మాషర్స్




**ఖైరతాబాద్, డిసెంబర్ 8 (జనం సాక్షి) :** ఇండియన్ పికిల్‌బాల్ లీగ్(ఐబీపీఎల్) లో ముంబై స్మాషర్స్ విజేతగా నిలిచింది. గ్రాండ్ ఫైనల్‌లో స్మా షర్స్ అద్భుత విజయాన్ని నమోదు చేసింది. టైమ్స్ గ్రూప్ ఆధ్వర్యంలో, భారత యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ గుర్తింపుతో జరిగిన ఈ లీగ్ టైటిల్ పోరులో ముంబై జట్టు 5-1 తేడాతో హైదరాబాద్ రాయల్స్‌ను చిత్తు చేసింది. పార్ల మెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సమ క్షంలో కేడీ జాదవ్ ఇండోర్ హాల్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో ముంబై తమ సత్తా చాటింది. నిర్ణయా త్మకమైన గ్రాండ్ ర్యాలీలో కూడా ముంబై 21-14 స్కోరుతో గెలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ విజయంపై టైమ్స్ గ్రూప్ ఎండీ వినీత్ జైన్ హర్షం వ్యక్తం చేస్తూ పికిల్‌బాల్‌కు ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తోందని పేర్కొన్నారు. లీగ్ ఆద్యంతం అద్భు తంగా రాణించిన క్వాంగ్ డుయోంగ్ పురుషుల విభాగంలో మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్(ఎంవీపీ) బెస్ట్ సింగిల్స్ ప్లేయర్‌గా నిలవగా, మేగన్ ఫడ్జ్ మహిళల ఎంవీపీ అవార్డును దక్కించుకున్నారు.

## అర్హులైన ప్రతీ పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం

- మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్



**శామీర్‌పేట్, డిసెంబర్ 8 (జనంసాక్షి) :** కేశవరంలో లబ్ధిదారురాలు గుడిసె స్వప్నకి మంజూరు అయిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి కావడంతో సోమవారం గృహప్రవేశ కార్య క్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్ ఆధ్వర్యంలో మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలతో పేదవారి కళ్ళల్లో ఆనందం చూస్తున్నామని ఈ రోజు మేడ్చల్ ఇంచార్జ్ డీసీసీ అధ్యక్షులు తోట కూర వజ్రెష్ యాదవ్ కృషితో ఈ గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తు న్నానని కాంగ్రెస్ ప్రభుత్వం అంటే పేదల ప్రభుత్వం అని, సంక్షేమ పథకాల అమలు కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యం అని అన్నారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగన్నాథం, బాలకృష్ణ, మాజీ సర్పంచ్ బాల నరసింహ, బస్వారెడ్డి, వెంకట్ రెడ్డి, లక్ష్మణ్, బొమ్మలపల్లి వెంకటేష్, మల్లేష్ యాదవ్, గ్రామ అధ్యక్షుడు శేఖర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మహమ్మద్ యూసుఫ్, రామ స్వామి, నారాయణపూర్ అధ్యక్షులు మహేష్, మరియు ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## నవోదయ మోడల్ పరీక్షల్లో ప్రతిభ చాటాలి



**తాండూరు, డిసెంబర్ 8 (జనంసాక్షి) :** గత 100 రోజుల నుండి విద్యార్థులకు సాయంత్రం వేళలో ఉచిత శిక్షణ నవోదయ కోచింగ్ అందించిన శ్రీ రామకృష్ణ సేవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం భాష్యం జూనియర్ కళాశాలలో ఉదయం 11:30 నుంచి 1:30 వరకు నిర్వహించిన మోడల్ నవోదయ పరీక్షకు 61 మంది విద్యార్థులు హాజరైనట్లు రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు బాలకృష్ణ నిర్వాహకులు కృష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మోడల్ పరీక్షల్లో ప్రతిభా చాటి అధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమానికి రామకృష్ణ మఠం బావ ప్రచార రాష్ట్ర కన్వీనర్ సూర్య ప్రకాష్ పాల్గొని మాట్లాడుతూ స్వామి వివేకానందుని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు చక్కగా పరీక్ష రాసి నవోదయ సీట్ సంపాదించాలని సూచించారు. అదేవిధంగా తాండూర్ కు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఉచితంగా కోచింగ్ అందించిన శాంతప్ప, వీరేశం గౌడ్ ,ఆంజనేయులు ,రవీందర్ వెంకట్ స్వామిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ సేవాసమితి అధ్యక్షులు బాలకృష్ణ ,గౌరవ అధ్యక్షులు గాజుల బసవరాజ్, నిర్వాహకులు తలారి కృష్ణయ్య, కమిటీ సభ్యులు మోహన్ రెడ్డి నరహరి శ్రీనివాస్ రెడ్డి కేవిఎం వెంకట్ భాష్యం జనరల్ కళాశాల కరస్పాండ్ రమేష్, జోగి వెంకటేష్‌తో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## జగద్గిరిగుట్ట డివిజన్‌ను అన్ని రంగాలలో అభివృద్ధిపరుస్తాం



**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 8 (జనం సాక్షి) :** జగద్గిరిగుట్ట డివిజన్ ను అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తానని డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని కూనమాలక్ష్మీ నగర్ లో ఆరు లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తాను కార్పొరేటర్ గా ఎన్నికైన నాటినుండి డివిజన్ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలను వెచ్చించి అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా మౌలిక వసతుల కల్పనలో రాజీ పడకుండా పనులను చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ నాయకులు పాపయ్య గౌడ్, వెంకటేష్, మహంకాళి, దుర్గయ్య, శ్రీనివాస్, శివ, కె.వి రాజు, బస్తి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ముసాయిదా విత్తన బిల్లు చట్టంను రద్దు చెయ్యాలి

- రాష్ట్ర రైతు సంఘం కోశాధికారి డిజి నరేందర్ ప్రసాద్




**శామీర్‌పేట్, డిసెంబర్ 8 (జనంసాక్షి) :** సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ పిలుపులో భాగంగా విద్యుత్ సవరణ బిల్లు చట్టం 2025 ను వ్యతిరేకిస్తూ నిరసన తెలుపుతూ ప్రతులను కాల్చి వేశారు. సోమవారం రోజు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మల నరసింహ అధ్యక్షతన షామీర్పేట మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందర నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి డీ.జీ.నరేందర్ ప్రసాద్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.హెచ్ దశరథ్, జిల్లా గౌరవ అధ్యక్షులు సామల వెంకట్ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు, రాష్ట్ర నాయకులు రాష్ట్ర నాయకులు డి.జి.సాయిలు గౌడ్, రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు బాలన్న గారి రాజిరెడ్డి, స్థానిక రైతు దొంతర బోయిన భూమయ్య, పి.లక్ష్మణ్, ఎస్ సురేష్, ఎం.కొండయ్య ఎన్.చైతన్య. సుధాగోని శ్రీనివాస్ గౌడ్, మహిళా నాయకురాలు మనమ్మ, గాయత్రి, సంఘ సభ్యులు రైతు సంఘం జెండాలతో ప్లేకార్డు లతో నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పేదవారి సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, డిసెంబరు 8 (జనంసాక్షి) :** పేదవారి సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో సద్దుల ఈశ్వరమ్మ ప్రభుత్వం తరుపున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంతో వారు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద వారి కలలను నిజం చేయడానికి ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదన్నారు. ప్రతి నిరుపేద ఆడబిడ్డకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నిరుపేద కుటుంబానికి రూ.5 లక్షలతో ఇదిరమ్మ ఇండ్లను నిర్మించుకోవడానికి అవకాశం కల్పించిందన్నారు. అనంతరం రూ.10 లక్షల నిధులతో నూతనంగా నిర్మించబోయే సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే యాదయ్య శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణ రెడ్డి, చేవెళ్ల, ముడిమ్యాల సొసైటీ చైర్మన్ లు దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాప్ రెడ్డి, మల్గారి జనార్దన్ రెడ్డి, ఎస్.బల్వంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రవీందర్ రెడ్డి, మర్పల్లి క్రిష్ణా రెడ్డి, మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మల్గారి కార్తిక్ రెడ్డి, అధికారులు, మాజీప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాలనీల మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి



**అల్వాల్, డిసెంబర్ 8 (జనంసాక్షి) :** అల్వాల్ సర్కిల్ మచ్చబొల్లారం డివిజన్ పరిధిలో కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ చొరవతో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా రోడ్లు, డ్రెయినేజ్, లైటింగ్ వంటి సదుపాయాలపై ఆయన ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఈ క్రమంలో బాలాజీ ఎన్‌క్లేవ్‌లో రూ.35.5 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయగా, లక్ష్మి ఎన్‌క్లేవ్ ఫేజ్-2లో (సంజీవ్ రెడ్డి గార్డెన్స్ సమీపంలో) రూ.25 లక్షల అంచనా వ్యయంతో, అంజనాపురి కాలనీలో (సెలెక్ట్ టాకీస్ సమీపంలో) రూ.23 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ రోడ్డు పనులు పూర్తయితే కాలనీవాసుల రాకపోకలు మరింత సులభతరం అవుతాయని తెలిపారు. అభివృద్ధి పనుల నిధుల మంజూరులో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కీలకంగా కృషి చేశారని పేర్కొన్నారు. అదే సమయంలో ఈరోజు నిర్వహించిన డా. బి.ఆర్. అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి కార్పొరేటర్ నివాళులు అర్పించారు. పర్యటనలో భాగంగా కాలనీ పార్కును సందర్శించిన ఆయన, అక్కడ లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే కాలనీల్లో డ్రెయినేజ్ ఓవర్‌ఫ్లో సమస్యపై జలమండలి అధికారులతో మాట్లాడి, తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, కాలనీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించండి

- ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి



**ఖిల్లా ఘనపురం, డిసెంబర్ 8 (జనం సాక్షి) :** మొదటి విడత స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికల భాగంగా సోమవారం మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి స్థానిక మండల నాయకులతో కలసి ప్రచారం లో పాల్గొన్నారు. దొంతికుంటతండా మానాజీపేట్, గట్టుకడిపల్లి, ఆగారం, వెంకటాంపల్లి, మల్కిమియన్పల్లి, సల్కెకెలాపూర్, మామిడిమడ, తాండలు, పర్వతాపుర్, షాపూర్ గ్రామాలలో పర్యటించి కాంగ్రెస్ పార్టీ బలపరచిన అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కొరరు అనంతరం మండల కేంద్రం లో ఏర్పాటు చేసిన సమావేశం లో ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి మాట్లాడుతూ ఘనపురం గ్రామం నుండి బరిలో ఉన్న సర్పంచ్ అభ్యర్థి ఆగారం పద్మమ్మ ఉంగరం గుర్తేకే ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని గ్రామ అభివృద్ధికికి నిరంతరం పాటుపడే వ్యక్తులకు ప్రజలు ఆశీస్సులు ఉండాలి అని పద్మమ్మను సర్పంచ్ ను చెయ్యండి గ్రామ అభివృద్ధికీ ఎం కావాలన్నా ప్రతేక నిధుల ద్వారా గ్రామ అభివృద్ధి కీ సమాకురస్తానని తెలిపారు. మాట్లాడుతూ గత ప్రభుత్వం లో అంధకారం ఉన్న తెలంగాణ రాష్ట్రన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత ఎన్నో మార్పులు వచ్చాయి అని అర్హులైన వారికీ రేషన్ కార్డులు ఇచ్చాము, ఇందిరమ్మ ఇల్లు ఇచ్చాము, త్వరలోనే మండల కేంద్రానికి వంద ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తాం అని సర్పంచ్ బరిలో ఉన్న ఆగారం పద్మమ్మను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్ కుమార్, ఆగారం పద్మమ్మ ప్రకాష్, వెంకట్రావు, క్యామా వెంకటయ్య, గంజాయి రమేష్, సింగలవిండో వైస్ చెర్మన్ రాజు, మునుగాలా బాబు, యాదయ్య, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
09 డిసెంబర్ 2025

## పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని సందర్శించిన మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్



**టేక్మాల్, డిసెంబర్ 8 (జనం సాక్షి) :** టేక్మాల్ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీన పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో విధులు నిర్వహించే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ల ఓటింగ్ ఏర్పాట్లను పరిశీలించి సమర్థ నిర్వహణకు తగు సూచనలు సలహాలు అందించారు. ఎన్నికల విధులు నిర్వహించేవారు,సర్వీస్ ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ను ఉపయోగించుకోవాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలో ఎలాంటి అసౌకర్యాలు కలిగించకుండా పోస్టల్ బ్యాలెట్ కోసం వచ్చే వారిని ప్రశాంతమైన వాతావరణంలో పోస్టల్ బ్యాలెట్ జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో తులసి రామ్, ఎంపీడీవో రియా జోదిన్,అధికారుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకం

- పోలింగ్ విధులను సమర్థవంతంగా నిర్వహించాలి
- జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పి. ప్రావీణ్య

**సంగారెడ్డి, డిసెంబర్ 8 (జనం సాక్షి) :** ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర అత్యంత కీలకమైనదని,పోలింగ్ విధులను ప్రిసైడింగ్ అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు. సదాశివపేట మండలం మద్దికుంట చౌరస్తాలోని కింగ్స్ ఫంక్షన్ హాల్‌లో మొదటి దశ పంచాయితీ ఎన్నికలకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారులకు రెండవ విడత శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ తరగతులను సందర్శించిన కలెక్టర్, ఈ సందర్భంగా ప్రిసైడింగ్ అధికారులకు పోలింగ్ విధులకు సంబంధించి కీలకమైన పలు సూచనలు చేసారు. పోలింగ్ ప్రక్రియలో పీ.ఓలు క్రియాశీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందని అన్నారు. నిబంధనలు పక్కాగా పాటిస్తూ పోలింగ్ ప్రక్రియను సాఫీగా నిర్వహించాలని, ఏ చిన్న తప్పిదానికి ఆస్కారం కల్పించకూడదని చెప్పారు. సమయ పాలనను పాటిస్తూ, సకాలంలో నిర్దేశించిన పోలింగ్ కేంద్రాలకు



చేరుకోవాలని అన్నారు. మొదటి విడత పోలింగ్ ఈ నెల 11న జరుగనున్న దృష్ట్యా, 10వ తేదీ నిర్ణీత సమయంలోపు డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకుని, పోలింగ్ మెటీరియల్ ను తీసుకోవాలన్నారు. చెక్ లిస్టుకు అనుగుణంగా బ్యాలెట్ పత్రాలు, ఇతర సామాగ్రి ఉందా లేదా అన్నది క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ స్టేషన్ కు చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను ముందస్తుగా చక్కబెట్టుకోవాలని కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు. సీటింగ్ అరేంజ్ మెంట్, సీక్రెట్ ఓటింగ్ కంపార్ట్మెంట్ వంటి వాటిని నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఓటింగ్ విషయంలో గోప్యత నూటికి నూరు శాతం అమలు జరిగేలా చూడాలన్నారు. ఓటరు జాబితాను అనుసరిస్తూ ఓటర్లను నిర్ధారించి, వారు ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలాన్నారు. అనుమతి ఉన్న వారిని మాత్రమే పోలింగ్ కేంద్రాల లోపలికి అనుమతించాలన్నారు. ఎన్నికల సంఘం రూపొందించిన హ్యాండ్‌బుక్‌ను ప్రతీ పీఓ క్షుణ్ణంగా చదివి స్పష్టమైన అవగాహన ఏర్పరచుకోవాలని, పోలింగ్ విధుల సందర్భంగా అన్ని నిబంధనలను పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు సాఫీగా జరిగి గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా పూర్తయ్యేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో శిక్షణ తరగతుల నోడల్ అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, తహసిల్దార్ బాల్ రాజ్, ఎంపీడీవో లక్ష్మి, ప్రిసైడింగ్ అధికారులు, మాస్టర్ ట్రైనర్, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మొదటి దశలో జరగనున్న ఎన్నికలకు సంబంధించి గుమ్మడిదల, హత్నూర, కంది, కొండాపూర్, పటాన్చెరు, సంగారెడ్డి మండలాల ప్రిసైడింగ్ అధికారులకు కూడా రెండవ విడత శిక్షణ కార్యక్రమం ఆయా మండల కేంద్రాలలో నిర్వహించారు.

# గ్రామపంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

**రాజాపూర్, డిసెంబర్ 8 (జనంసాక్షి) :** గ్రామపంచాయతీ మొదటి విడత ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. రాజాపూర్, నవాపేట్ మండలాలలో ప్రిసైడింగ్ అధికారులకు(పి.ఓ)లకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలను సోమవారం జిల్లా కలెక్టర్ పర్యవేక్షించారు. శిక్షణలో పాల్గొన్న పిఓ లను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు ప్రకారం ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల దగ్గర ఎన్నికల సామగ్రి తీసుకునేటప్పుడు బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు ఇతర ఎన్నికల సామాగ్రి సరిగ్గా ఉందా లేదా అని ఒకటికి రెండు సార్లు సరిచూసుకోవాలని అన్నారు. బ్యాలెట్ బాక్స్ లు సరిగ్గా పని చేస్తున్నాయా లేదా, బ్యాలెట్ పేపర్లు అన్ని సరిగ్గా ఉన్నాయా, ఏవైనా చినిగి ఉన్నాయా, సీరియల్ నంబర్లు సరిగ్గా ఉన్నాయా లేవా చూసుకోవాలని



అన్నారు. పిఓలు బ్యాలెట్ పేపర్ అకౌంట్ ను సరిగ్గా నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియ మధ్యాహ్నం ఒంటిగంటకు ముగుస్తుంది కనుక, పి ఓ లు వెంటనే బ్యాలెట్ బాక్స్‌ను సరిగ్గా సీల్ చేసి సంబంధిత రిటర్నింగ్ అధికారులకు అందించాలని అన్నారు. అదే రోజు మధ్యాహ్నం రెండు గంటలకు ఓట్ల లెక్కింపు(కౌంటింగ్) ప్రక్రియ మొదలవుతుందని అన్నారు. కౌంటింగ్ ప్రక్రియ ముగియగానే గెలిచిన అభ్యర్థులకు ధ్రువపత్రాలు (సర్టిఫికెట్లు) జారీ చేసి అదే రోజు ఉప సర్పంచ్ ఎన్నికలు కూడా నిర్వహించాలని ఆమె తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థుల గెలుపు/ఓటములకు ఒక్క ఓటు కూడా చాలా ముఖ్యంగా పరిగణిస్తారు కాబట్టి పిఓలు అత్యంత జాగ్రత్తగా, పారదర్శకంగా ఎన్నికల నియమావళిని పాటిస్తూ, ఎటువంటి తప్పులు దొర్లకొండ ప్రశాంతంగా నిర్వహించాలని ఆదేశించారు. రాజాపూర్ ఎం.పి.డి.ఓ కార్యాలయం లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్ ను కలెక్టర్ సందర్శించారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ను వినియోగించుకోవాలని అన్నారు. కలెక్టర్‌తో పాటు ఎం.పి.డి.ఓ,తహశీల్దార్ అధికారులు పాల్గొన్నారు.

## భద్రతా చర్యల కోసం ఫ్లాగ్ మార్చ్



**సంగారెడ్డి, డిసెంబర్ 8 (జనం సాక్షి) :** గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా సోమవారం సంగారెడ్డి జిల్లాలోని కంది, ఇస్మిల్ ఖాన్ పేట్ గ్రామాలలో భద్రత చర్యల లో భాగం గా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు సంగారెడ్డి రూరల్ సీఐ క్రాంతి కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డి డి.ఎస్.పి సత్తయ్య ఆదేశాల మేరకు రెండు గ్రామాలలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగిందన్నారు. పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ తెలిపారు కార్యక్రమంలో సంగారెడ్డి రూరల్ ఎస్సై మధుసూదన్ రెడ్డి,హారిక , రఫియుద్దీ, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు షీ టీమ్ అవగాహన కార్యక్రమం




**నారాయణపేట, డిసెంబర్ 8 (జనం సాక్షి) :** నారాయణపేటమండలంలోని కొల్లంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థినుల భద్రతపై షి టీమ్ పోలీసులు అవగాహన కల్పించారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, మహిళా వేధింపులు, రహదారి భద్రతపై అవగాహన, సోషల్ మీడియా దుర్వినియోగం,సైబర్ క్రైమ్‌ల నుండి ఎలా రక్షించుకోవాలి, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, 112, 1098, షీ టీమ్ నంబర్ 8712670398 కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.పాఠశాలకు వచ్చి పోయే సమయంలో ఎవరైనా వేధిస్తే బాలికలు తమ సమస్యలను ధైర్యంగా వెల్లడించి పోలీసుల సహాయం పొందడంపై సూచనలు అందించారు. విద్యార్థినులలో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే కాక, పాఠశాల పరిసరాల్లో భద్రతను కాపాడటమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని షీ టీమ్ పోలీసులు బాలరాజు, చేనప్ప, కవిత, జ్యోతి లు తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇంటింటి ప్రచారంలో తాటికుంట సర్పంచ్ అభ్యర్థి నేత్రావతి

**మల్దకల్, డిసెంబర్ 8 (జనంసాక్షి) :** స్థానికంగా అందుబాటులో ఉండి ప్రజాసేవయే లక్ష్యంగా గ్రామ ప్రజలందరికీ సహకారంతో తాటికుంట సర్పంచ్ అభ్యర్థిగా గ్రామ పంచాయతీ సర్పంచ్ బరిలో నిలబడ్డానని సోమవారం తాటికుంట గ్రామంలో ఇంటింటా ప్రచారంలో భాగంగా ఎన్నికలలో తనను ఆశీర్వదించి దీవించాలి అని కోరారు.తాను సర్పంచ్‌గా గెలవగానే గ్రామంలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థ సీసీ రోడ్లను గ్రామాభివృద్ధికి పాటుపడతానన్నారు. చిన్ననాటి నుంచి ప్రజాసేవలో తన కుటుంబం ఉందని గ్రామంలో మంచి చెడులకు అందుబాటులో ఉండి గ్రామ ప్రజలకు సేవ చేసుకుంటానని గ్రామస్తులు అందరూ ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.కాంగ్రెస్ నాయకుడు తాటికుంట రామచంద్రారెడ్డి సహకారాలతో గ్రామాభివృద్ధికి తోడుపాటు అందిస్తానన్నారు.ఈ కార్యక్రమంలోవార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, మహిళలుతదితరులు పాల్గొన్నారు.



# చేగుంట రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు వెంటనే ప్రారంభించాలి

- తూప్రాన్ ఆర్డిఓ జయచంద్ర రెడ్డి

**తూప్రాన్, డిసెంబర్ 8 (జనం సాక్షి) :** చెగుంట మండలంలో నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి అధికారులకు సూచించారు. తూప్రాన్ ఆర్డీవో కార్యాలయంలో కార్యాలయంలో ఆర్ అండ్ బి ట్రాన్స్కో అటవీ శాఖ మిషన్ భగీరథ పోలీస్ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పోలీసు శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫారెస్ట్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులకు అవసరమైన చెట్ల తొలగింపు విషయంలో, అవసరమైన వ్యయాన్ని రైల్వే శాఖ భరించాలి అని తెలిపారు. దీనికి అనుగుణంగా రైల్వే అధికారి చర్యలు తీసుకొని వెంటనే పని ప్రారంభించాలని సూచించారు. మిషన్ భగీరథ ఆర్‌ఓబి పనుల ప్రాంతంలో ఉన్న వాటర్ పైప్‌లైన్ విషయంలో, మిషన్ భగీరథ రైల్వే అధికారులతో కలిసి సంయుక్త తనికి నిర్వహించాలని చెప్పారు. పైప్‌లైన్‌ను సురక్షితంగా మూసివేయడం, పనులు జరుగుతున్న సమయంలో ఎటువంటి



అంతరాయం లేదా సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆయన ఆదేశించారు. విద్యుత్తు శాఖ నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ ధృవాల స్తంభాలను తొలగించి, అవసరమైన చోట సిట్టింగ్ చేసి స్తంభాలను పాతలని పనులు వేగవంతం చేయాలని చెప్పారు. వాహనదారులకు ఇబ్బందులు కలవకుండా రోడ్డు డైవర్షన్ చేయాలని చెప్పారు. పనుల్లో ఆలస్యం జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పోలీసు శాఖ నిర్మాణ పనుల సమయంలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా, అవసరమైన చోట ట్రాఫిక్ డైవర్స్ చేయాలని చేయాలని అమలు చేయాలని ఆయన సూచించారు కారులు స్థలాన్ని సందర్శించి ప్రత్యామ్నాయ మార్గాలు సూచించాల్సిందిగా ఆదేశించారు. ఈ సమావేశం లో తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్ తూప్రాన్, ఈ ఈ వేణు కుమార, శ్రీనివాస్ విజయ్ రైల్వే అధికారులు సమీర్ కుమార్ దివ్య శ్రీ, మిషన్ భగీరథ ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణపై శిక్షణ

**నారాయణపేట జిల్లా బ్యూరో, డిసెంబర్ 8 (జనం సాక్షి) :** నారాయణ పేట జిల్లాలో మూడో విడత ఎన్నికలు జరిగే మక్తల్, ఊట్కూర్, నర్వ, మాగనూరు, కృష్ణా మండలాలలోని గ్రామపంచా యతీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ, ఏకగ్రీవ ఎన్ని కల ఫలితాలు, పోస్టల్ బ్యాలెట్ పేపర్లు, పోస్టల్ బ్యాలెట్ జారీ, వినియోగం పై సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు, స్టేజ్-1 స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారులు, జోనల్ అధికారులతో శిక్షణ నిర్వహించారు. శిక్షణా కార్యకమాన్ని జిల్లా ఎన్నికల అధికారి / జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పర్యవేక్షించారు. శిక్షణ సందర్భంగా స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్ మాట్లాడు తూఎన్నికల నిర్వహణలో ఏ చిన్న పొరపాటు కూడా తీవ్రమైన సమస్యలకు దారి తీసే అవకాశం ఉన్నందున, నామినేషన్ల ఉపసంహరణ, ఏకగ్రీవ ఎన్నికల ఫలితాల వెల్లడి, బ్యాలెట్ పేపర్ల పంపి ణీ, పోస్టల్ బ్యాలెట్‌ల జారీ, వినియోగం అత్యంత శ్రద్ధతో, పారదర్శకంగా నిర్వహించా లని ఆయన తెలిపారు.మూడో విడత ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియను మంగళవారం మధ్యాహ్నం 3 గంటల లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే సింగిల్ నామినేషన్ దాఖలైన వార్డుల, గ్రామపంచాయతీల ఫలితాలను జిల్లా ఎన్నికల అధికారి / జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఎన్ వో సీ ఇచ్చిన తర్వాత ప్రకటించాలని, అలాగే నామినేషన్లు ఉప సంహరణ తర్వాత కూడా ఒకే సర్పంచి అభ్యర్థి బరిలో ఉంటే నామినేషన్లు ఉపసంహరించుకున్న అభ్యర్థులు ఎలాంటి అంగ,ధన బలం ప్రలోభాలు తమపై లేవని ఆయా అభ్యర్థులతో డిక్లరేషన్ తీసుకుని ఎన్నికల నియమ నిబంధనలను అనుసరించి ఏకగ్రీవం చేయాలని, అందుకు కూడా నోడల్, కమిటి మెంబర్లు, జిల్లా ఎన్నికల అధికారి అనుమతి ఇచ్చిన తర్వాతే ప్రకటించాల్సి ఉంటుందని అదనపు కలెక్టర్ తెలిపారు. నామినేషన్ ల ఉపసంహరణ తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా, గుర్తుల కేటాయింపు ప్రక్రియను వెంటనే పూర్తి చేసి తహశీల్దార్ల కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఒకవేళ సర్పంచి, వార్డుల అభ్యర్థుల స్థానాలు మొత్తం ఏకగ్రీవం అయితే ఉప సర్పంచి ఎన్నిక కూడా అందరూ వార్డు సభ్యులకు సర్టిఫికెట్ ఇవ్వక ముందే చేయాల్సి ఉంటుందన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటన తర్వాత ఆర్ వో లు ఇండెంట్ పంపిస్తే జిల్లా కేంద్రం నుంచి పోలింగ్ కు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లను ఆయా మండలాల ఎంపీడీవో లు మండల కేంద్రాలకు తీసుకు వస్తారని ఆయన తెలిపారు. ఇక పోస్టల్ బ్యాలెట్ జారీ, వినియోగం గురించి తెలుపుతూ. రక్షణ దళాల్లో పనిచేస్తున్న సర్వీస్ ఓటర్ల పోస్టల్ బ్యాలెట్లు తప్పనిసరిగా పంపాలని ఆదేశించారు. అయితే, సర్వీస్ ఓటర్ల జాబితాను ముందుగా సంపాదించి, గ్రామపంచాయతీ వారీగా, వార్డు వారీగా వర్గీకరించాలని నోడల్ అధికారులకు ఆయన సూచించారు. వారి ప్రస్తుత పని స్థలం చిరునామాలను సేకరించి సంబంధిత స్టేజ్-1 ఆర్ ఓ లకి పంపాలని ఆదేశించారు. ఎన్నికల డ్యూటీలో ఉన్న ఉద్యోగులు మరియు ప్రీవెంటివ్ డిటెన్షన్ ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్లు జారీ చేయాలంటే ఫాం-14 ద్వారా ముందస్తు నమోదు తప్పనిసరి ఆయన స్పష్టం చేశారు. ఈ



ఫాం-14 సమర్పించిన వారికే పోస్టల్ బ్యాలెట్లు ఇవ్వాలని అధికారులకు సూచించారు.ఎన్నికల డ్యూటీలో ఉన్న ఉద్యోగులు సులభంగా ఓటు వేయడానికి ప్రతి మండలంలో ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. పోస్టల్ బ్యాలెట్‌ల జారీ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తగా పనిచేయాలని, ఏమైనా సందేహాలు ఉంటే ఎన్నికల హ్యాండ్‌బుక్‌ను పూర్తిగా చదివి అనుసరించాలని పునర్ఘాటించారు. ప్రత్యక్షంగా ఓటు వేయలేని వారి ఓటు హక్కును రక్షించే ఈ కీలక ప్రక్రియను ఎటువంటి పొరపాట్లు చేయకుండా నిర్వహించడం ప్రతి అధికారికి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. బరిలో నిలిచిన అభ్యర్థుల కు గుర్తుల కేటాయింపులో తెలుగు అక్షర మాల (ఆల్ఫాబెటికల్) ఆధారంగా కేటాయించాలని, ఈ ప్రక్రియలోనూ ఎలాంటి చిన్న పొరపాటు కూడా జరగకుండా అధికారులు నిషితంగా పర్యవేక్షణ చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల వ్యయ పరిశీలకులు డిఆర్డిఓ మొగులప్ప, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రెడ్డి, ఆయా మండలాల తహసీల్దార్లు, స్టేజ్ 1, 2 రిటర్నింగ్ అధికారులు, ఇతర ఎలక్షన్ అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

**మొగుడంపల్లి, డిసెంబర్ 8 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి ఎండీ కుత్బుదిన్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలో 35 సంవత్సరాలు ప్రజల సమస్యల గురించి పోరాడిన వ్యక్తి అని అన్నారు. నా వంతు కృషి చేయాలన్న ఉదేశ్యం తో సర్పంచ్ అభ్యర్థి గా "ఉంగరం" గుర్తుతో మీ ముందుకు వస్తునన్నాని మీడియా సమావేశం లో అన్నారు.కాంగ్రెస్ పార్టీ ప్రచారం హెూరాహెూరీగా కొనసాగుతోంది. గ్రామ అభివృద్ధి కోసం కేవలం కాంగ్రెస్ పార్టీనే నిజమైన ప్రత్యామ్నాయం అని గ్రామ నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజలకు వివరించారు. అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని వాళ్లు హామీ ఇచ్చారు. గ్రామ ప్రజల ఆశలు, ఆవశ్యకతలను తీర్చే విధంగా పథకాలు అమలు చేయడమే తమ లక్ష్యమని అభ్యర్థులు పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీ ప్రచారాన్ని వేగవంతం చేసింది. గ్రామంలోని ప్రతి వాడ,తండా ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారంలో పాల్గొంటున్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, పార్టీ వైఖరిని ప్రజలకు వివరించారు. గ్రామ అభివృద్ధి, పారదర్శక పాలన, శుద్ధి నీరు, రహదారి సౌకర్యాలు, విద్యుఆరోగ్య రంగాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని నాయకులు తెలిపారు. ఈ సందర్బంగా ప్రజలు కూడా తమ సమస్యలను నాయకులకు తెలియజేశారు.రాబోయే ఎన్నికల్లో గ్రామ అభివృద్ధిని కోరుకునే ఓటరు 'ఉంగరము' గుర్తుకు ఓటు వేసి గెలిపించగలరని కోరారు.



# భారతీయ సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పాలి..




**నిర్మల్ బ్యూరో, డిసెంబర్ 08 (జనంసాక్షి) :** భారతీయ సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పాలని సంస్కార భారతి తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి జెపి నిరంజన్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్కే కన్వెన్షన్ హాల్‌లో సంస్కార భారతీ ఆధ్వర్యంలో నాట్య మయూరి పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంస్కార భారతీ సంస్థ సభ్యులు, చిన్నారులు, వారి కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాతూ పంచ పరివర్తన్ సూత్రాలను అనుసరించి కళల మాధ్యమంగా భారతీయ సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పాలని, చిన్నప్పటి నుంచే చిన్నారులలో కళల ద్వారా దేశభక్తి, భారతీయ సంస్కృతీ ఔన్నత్యం నింపాలని పేర్కొన్నారు. అనంతరం చిన్నారుల అద్భుత నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. ప్రదర్శనలు ముగిశాక ప్రతిభ కనపరిచిన చిన్నారులకు నాట్య మయూరి పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్కార భారతీ జిల్లా అధ్యక్షులు నాగరాజు, డాక్టర్ కృష్ణంరాజు, డాక్టర్ చంద్రిక, మంచిరాల నాగభూషణం, సభ్యులు నవ్య, పోలీస్ భీమేష్, మాధురి రాజు, బన్నీ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, డిసెంబర్ 8 (జనంసాక్షి) :** గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లను చేస్తున్నామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, సంబంధిత అధికారులతో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికలు నిర్వహించే అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు తక్షణమే పూర్తి చేయాల ని అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి లోటుపాట్లు కలగకూ డదని అన్నారు. ఆన్లైన్ మాధ్యమం ద్వారా సమావేశంలో పాల్గొన్న తహసిల్దారులు, ఎంపీడీవోలకు మరొకసారి ఎన్నికల నిర్వహణ విధివిధానాలపై సూచనలు చేశారు. ఎన్నికల నిర్వహణలో జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఎన్నికల సిబ్బంది, సామాగ్రి తరలింపునకు సరిపడినన్ని వాహనాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ సమావేశం లో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఏఎస్పీ ఉపేంద్ర రెడ్డి, డిపిఓ శ్రీనివాస్, డీఈవో భోజన్న, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల మార్గదర్శకాలు తప్పక పాటించాలి


- జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్
- రెండవ విడత పోలింగ్ సన్నద్ధతపై అధికారులకు శిక్షణ



**ములుగు ప్రతినిధి, డిసెంబర్ 08(జనంసాక్షి) :** రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు డిసెంబర్ 14 న సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో, పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు (పీఓలు, ఏపీఓలు) సోమవారం జెడ్ పి హెచ్ ఎస్ మల్లంపల్లి, జెడ్ పి హెచ్ ఎస్ ములుగు, జెడ్ పి హెచ్ ఎస్ లలో వేరు వేరుగా ఎన్నికల నిర్వహణపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా కేంద్రాలను జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్ సందర్శించి, ఎన్నికల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమ నిబంధనలు మరియు మార్గదర్శకాలను అధికారులు తప్పకుండా పాటించాలని ఆయన సూచించారు. నిష్పక్షపాతంగా ఎన్నికల ప్రక్రియ యొక్క నియమ నిబంధనలు క్షుణ్ణంగా తెలుసుకుని, ఎలాంటి పక్షపాతం లేకుండా పారదర్శకంగా మరియు నిష్పక్షపాతంగా సేవలు అందించాలని ఆయన అధికారులకు సూచించారు. మూడు విడతలుగా జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రెండవ విడత పోలింగ్ ఈ నెల 14న జరగనుంది. ఈ పోలింగ్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరుకొని సదుపాయాలను పరిశీలించుకోవాలని, ఓటింగ్ కంపార్ట్ మెంట్, సిటింగ్ ఏర్పాట్లు తదితర వాటిని నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలన్నారు. బ్యాలెట్ పత్రాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని, పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన గుర్తులతో పాటు "నోటా" సింబల్ ను కూడా తప్పనిసరిగా సరిచూసుకోవాలని అన్నారు. ఎలాంటి గందరగోళానికి తావులేకుండా సజావుగా ఎన్నికల నిర్వహణ బాధ్యతలను నిర్వర్తించాలని ఆయన అన్నారు. అనంతరం ఎంపిడిఓ వెంకటాపూర్ కార్యాలయం లో బ్యాలెట్ పేపర్ లను జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్శనలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఎంపిడిఓ లు, ఎంపిఓ లు, ఆర్ఓ లు, ఏఆర్ఓ లు, పిఓలు, ఏపిఓ లు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్‌గా నేరుగా సేవ చేసే గొప్ప బాధ్యత

- ఏకగ్రీవ సర్పంచ్ నిర్ణయం ప్రజాస్వామ్యంలో మంచి సాంప్రదాయం
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- భూపాలపల్లిలో ఏకగ్రీవ కాంగ్రెస్ సర్పంచ్ లకు సన్మానం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** గ్రామాలల్లో సర్పంచ్ పదవి ప్రజలకు నేరుగా సేవ చేసే గొప్ప బాధ్యత అని, ఏకగ్రీవ సర్పంచ్ నిర్ణయం ప్రజాస్వామ్యంలో మంచి సాంప్రదాయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సోమవారం భూపాలపల్లి మంజూరునగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మొదటి, రెండో విడత సర్పంచ్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన 18 గ్రామాల కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ లకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ తో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ లందరికీ ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షుడు శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన సర్పంచ్ లు గ్రామాలల్లో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టి పారదర్శక పరిపాలనతో గ్రామాభివృద్ధికి సేవ చేయాలన్నారు. గ్రామ ప్రజల ఐక్యతతో, అభివృద్ధి లక్ష్యంతో ఏకగ్రీవంగా సర్పంచ్ లను ఎన్నుకోవడం సంతోషమన్నారు. ఈ నిర్ణయం గ్రామ సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తుందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టి పారదర్శక పరిపాలనతో గ్రామాభివృద్ధికి సేవ చేయాలని సూచించారు. గ్రామాల్లో మౌలిక వసతులు, రహదారులు, తాగు నీరు, విద్యా, ఆరోగ్య రంగాల్లో సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించేందుకు సర్పంచ్‌లు కీలక పాత్ర పోషించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేతో మండలాల వారిగా సర్పంచ్ లు గ్రూపు ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

### ఏకగ్రీవ కాంగ్రెస్ సర్పంచ్ లు వీరే

తొట్ల తిరుపతి యాదవ్(బాలయ్యపల్లి), జక్కుల మానస – సాంబయ్య(ఇజ్జయ్యపల్లి), జెల్ల రాము(చెంచుపల్లి), కొల్గూరి రాజేశ్వర్ రావు(గూడెపల్లి), భూతం రజిత రమేష్(కొత్తపల్లి(బీ)), గుల్ల స్వప్న తిరుపతి(రేపాక), విడిదినేని శ్రీలత అశోక్(బుద్ధారం), కుమ్మరి సాంబయ్య(గుడిపాడు), బద్దం రామిరెడ్డి(బద్దంపల్లి), బొడ్డు తిరుపతి(వెలిశాల), వ్యాసనవేణి శ్రీలేఖ సతీష్ రావు(పెద్దంపల్లి), కొడారి అశోక్ (ఏలేటిరామయ్యపల్లి), లావుడ్య రవీందర్ నాయక్(పాశిగడ్డ తండా), ఇంగిలి రాజేందర్(ముచినిపర్తి), ఎర్రబెల్లి రాజేశ్వరరావు (బావుసింగ్ పల్లి, చిట్యాల), మంతా మనోహర్(చైన్ పాక), ఓరుగంటి రజిత – బాబురావు(శ్యామ్ నగర్), పొనగంటి ముత్తమ్మ(బావూసింగ్ పల్లి, భూపాలపల్లి) తదితరులు ఇప్పటివరకు ఏకగ్రీవ సర్పంచ్ లుగా సర్పంచ్ లందరూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులే కావడం గమనార్హం.

# నిబంధనలు అతిక్రమించి వాహనం నడిపితే చర్యలు

- ట్రాఫిక్ అదనపు డిసిపి ప్రభాకర్ రావు



**వరంగల్ బ్యూరో, డిసెంబర్ 08 (జనం సాక్షి) :** వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి వాహనం నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ట్రాఫిక్ అదనపు డిసిపి తెలిపారు. ట్రై సిటీ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వాహనదారులకు ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో అదనపు డిసిపి ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు కౌన్సలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహన దారులను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ మీ కుటుంబ యోగ క్షేమాలను దృష్టిలో పెట్టుకొని మద్యం సేవించి వాహనం నడపటం ప్రమాదకరమని. ఇలా మద్యం సేవించి వాహనం నడపటం ద్వారా జరిగే రోడ్డు ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని. అలాగే మైనర్లకు వాహనాలు అందజేయవద్దని, అలా చేస్తే వాహన యజమానిపై కేసు నమోదు బడుతుందని, వాహన దారులు తప్పక హెల్మెట్ ధరించడంతో పాటు లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు కలిగి వుండాలని. ముఖ్యంగా వాహనంపై ప్రయాణించే సమయం లో సెల్ ఫోన్ మాట్లాడవద్దని అదనపు డిసిపి వాహనదారులకు సూచించారు. ఈ కార్యక్రమం లో ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఇన్స్ స్పెక్టర్ శ్రీనివాస్ తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైన గురుకుల విద్యార్థిని నందిని



**వరంగల్ ఈస్ట్, డిసెంబర్ 08 (జనం సాక్షి) :** అంతర్ విశ్వవిద్యాలయ టేబుల్ టెన్నిస్ పోటీలు విశాఖపట్నంలోని గీతం యూనివర్సిటీలో ఈనెల 09 నుండి 11 వరకు జరుగనున్నాయి. ఈ పోటీలో సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రి వరంగల్ తూర్పు కళాశాల నుండి ఎం.నందిని ఎంపీసీ సెకండ్ ఇయర్ సెలెక్ట్ కావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డా.రాధిక వ్యాయామ అధ్యాపకురాలు డా .పద్మ మరియు అధ్యాపకులందరూ నందిని ని అభినందించారు. టేబుల్ టెన్నిస్ పోటీలలో చక్కని ప్రతిభ కనబరచాలని ఈ సందర్భంగా వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# భైంసాలో దారుణ హత్య

- అనుమానంతో యువతిని గొంతు కోసిన ప్రియుడు
- మృతదేహం వద్దే కూర్చున్న కిరాతకుడు



**భైంసా డిసెంబర్ 08 (జనం సాక్షి) :** భైంసా పట్టణంలో సోమవారం ఉదయం చోటు చేసుకున్న అమానుష హత్య స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. భైంసా నిర్మల్ జాతీయ రహదారి సంతోషిమాత ఆలయ సమీపంలో ఉన్న టీ పాయింట్ వద్ద 27 ఏళ్ల యువతి అశ్విని గొంతు కోసి అత్యంత దారుణంగా హత్యకు గురైంది. స్థానికుల సమాచారం మేరకు కుంసేరా గ్రామానికి చెందిన అశ్వినికి గతంలో వివాహం కాగా ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్తతో విడాకుల అనంతరం కుటుంబానికి దూరంగా భైంసా పట్టణంలో నివసిస్తూ జీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యంలో అంబేద్కర్ నగర్‌కు చెందిన నాగేశ్‌తో పరిచయం ఏర్పడి, ఇద్దరూ కలిసి నివసించడం ప్రారంభించారు. జీవనోపాధి కోసం అశ్విని సంతోషిమాత ఆలయ సమీపంలో టీ పాయింట్ నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తోంది. ఈ క్రమంలో ఆమెకు మరొకరితో సంబంధం ఉందనే అనుమానంతో సోమవారం ఉదయం నాగేశ్ ఆమెతో తీవ్రంగా వాగ్వాదానికి దిగాడు. గొడవ తీవ్రస్థాయికి చేరడంతో కోపంతో నాగేశ్ కత్తితో అశ్వినిపై దాడి చేసి అతి కిరాతకంగా హత్య చేశాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం, హత్య అనంతరం కూడా నిందితుడు మృతదేహం పక్కనే కూర్చుని ఉండడం స్థానికులను దిగ్భ్రాంతికి గురి చేసింది. సంఘటనకు సంబంధించి సమాచారం అందుకున్న వెంటనే భైంసా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడు నాగేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై భైంసా సీఐ గోపీనాథ్ మాట్లాడుతూ నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలి

- సైకాలజిస్ట్ డాక్టర్ శివపురం రాధా



**వరంగల్ ఈస్ట్, డిసెంబర్ 08 (జనం సాక్షి) :** ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సామాజిక సేవ ద్వారా వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలనీ సైకాలజిస్ట్ డాక్టర్. శివపురం రాధ సూచించారు. ఏఎస్ఎం మహిళ డిగ్రీ పిజి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుకుమారి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు వాణిశ్రీ, స్వాతి నేతృత్వంలో ఖిలా వరంగల్ మధ్య కోటలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరం ఆదివారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి డాక్టర్ రాధ ముఖ్యఅతిథిగా హాజరై వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవడానికి కావలసిన పలు సూచనలు చేశారు. విద్యార్థులు చదువుతోపాటు సేవాభావం కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్–ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వాణిశ్రీ, స్వాతి, అధ్యాపకులు సుమలత, శ్రీవేణి, సరిత, హారిక పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత



**హనుమకొండ ప్రతినిధి, డిసెంబర్ 8 (జనంసాక్షి):** సెంట్రల్ జోన్ డీసీపీ శ్రీమతి ధారా కవిత సుబేదారి పోలీస్ స్టేషన్‌ను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసర ప్రాంతాల శుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును పరిశీలించారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రజలతో సిబ్బంది వ్యవహరించే తీరు, స్పందన వేగం, మహిళాపిల్లల ఫిర్యాదులపై తీసుకుంటున్న చర్యలను కూడా వివరంగా సమీక్షించారు. డీసీపీ ప్రజల్లో నేరాల నివారణపై అవగాహన పెంచే దిశగా పోలీస్ సిబ్బంది మరింత చురుకుగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా మారక ద్రవ్యాల దుర్వినియోగం, సైబర్ మోసాలు, ఆన్‌లైన్ ఫ్రాడ్‌లు వంటి నేరాలపై గ్రామ స్థాయి వరకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను విస్తరించాలని ఆదేశించారు. యువతలో డ్రగ్స్ పెరుగుతున్న ప్రమాదం గురించి ప్రత్యేకంగా చర్చిస్తూ విద్యాసంస్థలు కాలేజీలు పబ్లిక్ ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎస్సై లు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి

- జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా ఎస్పీ పలు ఫిర్యాదులను స్వీకరించారు. బాధితుల సమస్యలను వివరంగా తెలుసుకొని, సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డే ద్వారా పోలీస్ శాఖను ప్రజలకు మరింత చేరువ చేస్తుందని, అదే తమ లక్ష్యమని తెలిపారు. స్టేషన్‌లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి, వినతులను నమోదు చేసి, క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించేలా సూచనలు జారీ చేశామని పేర్కొన్నారు. బాధితులకు త్వరితగతిన న్యాయం చేయడం కోసం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యతగా పనిచేస్తున్నట్లు ఎస్పీ స్పష్టంచేశారు.

# తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** అంగరంగ వైభవంగా తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవ కార్యక్రమాన్ని చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆర్ అండ్ బి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డిసెంబర్ 9న అధికారికంగా నిర్వహించే తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం 10 గంటలకు ఐడిఓసి కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) నిబంధనలు అమల్లో ఉన్న నేపథ్యంలో నిబంధనలు పాటిస్తూ ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్ బి ఈఈ రమేష్, డీఈ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

### మిల్లెట్ ఆహార పదార్థాల స్టాల్ పరిశీలన

ఐడిఓసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన చెల్పూర్ మిల్లెట్ ఆహార పదార్థాల స్టాలును జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టాల్ నిర్వహకులు ఉమాదేవి, లావణ్యలను ఆహార పదార్థాలు విక్రయాలు ప్రస్తుత స్థితి, వినియోగదారుల స్పందన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిల్లెట్ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉన్న నేపథ్యంలో, ఉత్పత్తి నాణ్యతను మరింత మెరుగుపరచడంతో పాటు మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, వ్యాపార అభివృద్ధికి కృషి చేయాలని ఆయన సూచించారు. స్వచ్ఛమైన ఆహారం ఆరోగ్యకర జీవనం లక్ష్యంగా మిల్లెట్ ఉత్పత్తులను మరింత మందికి చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
09 డిసెంబర్ 2025

# రూ.1 కోటి 11 లక్షల గంజాయి పట్టివేత

- **వాహన తనిఖీల్లో 222 కేజీలు స్వాధీనం**
- **నలుగురితో పాటు పలువురిపై కేసు నమోదు**

**భద్రాచలం, డిసెంబర్ 8 (జనంసాక్షి) :** భద్రాచలం చెక్పోస్ట్ వద్ద పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో భాగంగా రూ.1 కోటి 11 లక్షల 43,300 విలువ గల 222 కేజీల 966 గ్రాములు గంజాయితో పాటు నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, గంజాయి విక్రయించిన వారిని, కొనుగోలు చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్పి రోహిత్ రాజ్ తెలిపారు. స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో గంజాయి పట్టివేతపై పూర్తి వివరాలు ఎస్ పి రోహిత్ రాజ్ వెల్లడించారు. ఎస్సై సతీష్ కుమార్ తన సిబ్బందితో ఆదివారం రాత్రి కూనవరం రోడ్లోని ఆర్టిఏ చెక్ పోస్టు సమీపంలో వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అశోక్ లైలాండ్ వాహనంలో నలుగురు వ్యక్తులు వస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు రోడ్డుపై ఉండటాన్ని గమనించిన వారు వాహనాన్ని వెనుకకు మళ్లించి తిప్పుకుని పారిపోయే ప్రయత్నం చేశారు. దీంతో ఒక్కసారిగా అప్రమత్తమైన ఎస్సై తన సిబ్బందితో వాహనాన్ని కొంతదూరం వరకు వెంటాడి పట్టుకున్నారు. ఆ వాహనాన్ని తిరిగి ఆర్టీవో చెకు పోస్టు వద్దకు తీసుకొచ్చి తనిఖీ చేయగా 110 ఎండు గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. పట్టుబడిన 222.966 కేజీల గంజాయి విలువ రూ.1 కోటి 11 లక్షల 43,300 గా ఉంటుంది. గంజాయినీ స్వాదీనం చేసుకుని నలుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకుని విచారించగా పలువురి పేర్లు కూడా బహిర్గతమయ్యాయి. పట్టుబడిన వారితో పాటు విక్రయించిన వారు, కొనుగోలు చేసేందుకు సిద్ధపడ్డ వారిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్పి వెల్లడించారు. పట్టుబడిన నలుగురిలో ఏపిలోని మోతిగూడెంకు చెందిన కూరపాటి బుచ్చయ్య, కలుముల రమేష్, హైదరాబాద్‌కు చెందిన



షేక్ షఫీ ఉద్దీన్, మహ్మద్ మోసిన్ లు ఉన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు సుమారు రూ.30 కోట్ల విలువగల 6 వేల కేజీల గంజాయిని స్వాదీనం చేసుకుని ఇద్దరిపై పీడీ యాక్టు నమోదు చేసి రిమాండ్ కు పంపినట్లు, మరి కొందరిపై పీడీ యాక్టు నమోదు చేసేందుకు జాబితా సిద్ధం చేసినట్లు ఎస్పి వెల్లడించారు. భారీ మొత్తంలో గంజాయిని పట్టుకున్న ఎస్సై సతీష్ తో పాటు సిబ్బందిని ఎస్పి అభినందించారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఎస్పి విక్రాంత్ కుమార్ సింగ్, పట్టణ సి ఐ నాగరాజు తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలి

- **జిల్లా డిఎస్పి ప్రసన్న కుమార్**



**నూతనకల్, డిసెంబర్ 8 (జనం సాక్షి) :** స్థానిక ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ఎలాంటి అలజడులు సృష్టించినా కఠిన చర్యలు తప్పవని సూర్యాపేట డిఎస్పి ప్రసన్నకుమార్ హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని వెంకేపల్లి, తాళ్ళ సింగారం గ్రామంలో గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలలో ముందస్తుగా ఎలాంటి గొడవలు జరగకుండా ఉండాలని కవాతు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల నియమావళిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని ఎలాంటి అల్లర్లు సృష్టించినా,ఎన్నికల నియమాలని ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు.అన్ని గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రజలు సహకరించాలని అన్నారు.ఈ కవాతులో తుంగతుర్తి సీఐ నరసింహారావు, ఎస్సై నాగరాజు,పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## చీకటితో ప్రమాదాల బారిన ప్రజలు

- **కోదాడ - జడ్చర్ల జాతీయ రహదారిపై వెలుగులేవి..?**
- **అంధకారంలో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారి**



**దేవరకొండ, డిసెంబర్ 8 (జనం సాక్షి) :** కోదాడ – జడ్చర్ల జాతీయ రహదారిపై దేవరకొండ పట్టణంలోని పెద్ద దర్గా నుండి పాత పెట్రోల్ బంక్ వరకు రహదారిపై వరుసకట్టి గత కొన్ని నెలల నుండి హైమాస్ట్ లైట్లు వెలగకపోవడంతో చీకటితో ప్రమాదం పొంచి ఉందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. గడిచిన రెండు సంవత్సరాలలో దర్గా వద్ద ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయిన సంఘటన అందరికీ విదితమే. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి హైమస్ట్ లైట్లు వెలిగేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. నిత్యం చీకటిగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, నిత్యం ఈ రోడ్డు వెంబడి హైదరాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, వంటి సదరు ప్రాంతాలకు వెళ్తారని, ఇక్కడే రోడ్డుపై డివైడర్ ఉందని పైగా చీకటి ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు.

# ప్రజల కోసం పనిచేసే నాయకులకు ఓటెయ్యాలి

- **నిజమైన ప్రజా సేవకులను ఎన్నుకోవాలి**
- **పది వార్డులో సిపిఎం పార్టీ అభ్యర్థులు ఏకగ్రీవం**
- **వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తుల అభ్యర్థులను గెలిపించాలి**
- **విలేకరుల సమావేశంలో జూలకంటి రంగారెడ్డి**

**మిర్యాలగూడ, డిసెంబర్ 8 (జనం సాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్లు ఆలోచించి పని చేసే నాయకులకు ఓటు వేయాలని, నిజమైన ప్రజా సేవకులను ఎన్నుకోవాలని, వామపక్ష ప్రజాతంత్ర లోక శక్తుల అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిత్యం ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేస్తూ సమస్యల పరిష్కారం కోసం అధికారులు ప్రజాప్రతినిధుల పై ఒత్తిడీ తీసుకొస్తూ గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం పాటు పడే నాయకులను ఎన్నుకోవాలన్నారు. నిస్వార్థంగా ప్రజాసేవ చేసే ఆలోచన కేవలం వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తుల అభ్యర్థులకు మాత్రమే ఉంటుందని అలాంటి వారిని ప్రజాపతినిధులుగా ఎన్నుకుంటే సమస్యలు పరిష్కారం కావడంతో పాటు గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సమస్యలు నిర్వీర్యం కాకుండా గ్రామాల అభివృద్ధికి



అవసరమైన సంక్షేమం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గ్రామాల ప్రతిష్ట పెంచే సిపిఎం పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో 16 గ్రామ పంచాయతీలలో సర్పంచులకు 150 పైగా వార్డు మెంబర్లకు పోటీ చేస్తున్నామని తెలిపారు. ఇందులో 10 వార్డులు సిపిఎం పార్టీ అభ్యర్థులు ఏకగ్రీవమైనట్లు తెలిపారు. ఎక్కువ చోట్ల ఒంటరిగానే పోటీ చేస్తున్నామని కొన్ని చోట్ల పొత్తులు పెట్టుకున్నామని తెలిపారు. ప్రస్తుతం ప్రచారం సాగుతుందని ప్రజల నుండి సానుకూల వాతావరణం ఉందని చెప్పారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు పాదూరి శశిధర్ రెడ్డి, వినోద్ నాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, నాయకులు గోవింద్ రెడ్డి, దయానంద్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలు బంద్



**ఖమ్మం, డిసెంబర్ 8 (జనం సాక్షి) :** డిసెంబర్ 11,14,17 తేదీలలో జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని ఆయా మండలల్లో మద్యం విక్రయాలను నిలిపివేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. డిసెంబర్ 11 న జరిగే ఎన్నికలకు డిసెంబర్ 9 వ తేదీన సాయంత్రం 5:00 గంటల నుండి డిసెంబర్ 11న ఎన్నికలు ముగిసి, ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడించే వరకు ఆయా మండలల్లో మద్యం విక్రయాలను నిలిపివేయాలన్నారు. (కొణిజర్ల,రఘునాథపాలెం, వైరా, బోనకల్, చింతకాని, మధిర, ఎర్రుపాలెం) అదేవిదంగా డిసెంబర్ 14 న జరిగే ఎన్నికలకు డిసెంబర్ 12 వ తేదీన సాయంత్రం 5:00 గంటల నుండి డిసెంబర్ 14న ఎన్నికలు ముగిసి, ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడించే వరకు ఆయా మండలల్లో మద్యం విక్రయాలను నిలిపివేయాలి.

## ఐటీసీ కర్మాగారంలో టీపీఎం విధానాన్ని పరిశీలించిన కలెక్టర్



**బూర్గంపహాడ్, డిసెంబర్ 8 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- ఐటీసీ కర్మాగారాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం తనిఖీ చేశారు. యూనిట్ మేనేజ్మెంట్, ప్లాంట్లో అమలుచేస్తున్న ఆధునిక భద్రతా ప్రమాణాలు, ఎనర్జీ ఎఫిషియెన్సీ చర్యలు, యంత్రాల పనితీరును మెరుగుపర్చడంతో పాటు బ్రేక్ డౌన్లు తగ్గించేందుకు చేపట్టిన టీపీఎం(టోటల్ ప్రొడెక్టివ్ మెయింటినెన్స్) విధానం గురించి కలెక్టర్ ఐటీసీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ప్రాసెస్ కంట్రోల్ వ్యవస్థలు ఉత్పత్తి ప్రతి దశలో ఎలా ఖచ్చితత్వం, నాణ్యత, ఆపరేషనల్ నమ్మకాన్ని నిర్ధారిస్తున్నాయో యాజమాన్యం ప్రజెంటేషన్ రూపంలో కలెక్టర్కు తెలిపింది. పేపర్, బోర్డు తయారీ ప్రక్రియలో వినియోగిస్తున్న ఆధునిక యంత్రాలు, ఆటోమేషన్ టెక్నాలజీ, పర్యావరణ హిత తయారీ విధానాలను పరిశీలించిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్తో పాటు ఐటీసీ యూనిట్ హెడ్ శైలేందర్కుమార్సింగ్, పేపర్బోర్డు హెడ్ రాంబాబు, హ్యూమన్ రిసోర్సెస్ హెడ్ శ్యామ్కిరణ్, అడ్మిన్ హెడ్ చెంగల్రావు, సీనియర్ మేనేజ్మెంట్ ప్రతినిధులు ఉన్నారు.

# సీపీఐ అభ్యర్థి మందడపు రాణిని గెలిపించండి



**మధిర, డిసెంబర్ 8 (జనంసాక్షి) :** మండల పరిధిలోని మల్లారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సిపిఐ అభ్యర్థిని మందడపు రాణిని అఖండ మెజార్టీతో గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రజలను అభ్యర్థించారు. సోమవారం గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు , జిల్లా నేతలతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటి ప్రచారంలో పాల్గొని మందడపు రాణిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గతంలో మల్లారం ఎంపీటీసీగా గ్రామ అభివృద్ధికి సిపిఐ జిల్లా నాయకులు అమరజీవి కామ్రేడ్ మందడపు నాగేశ్వరావు సేవలను కొనియాడారు. కాంగ్రెస్ బలపరిచిన సిపిఐ అభ్యర్థిని గెలిస్తేనే గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. గ్రామ అభివృద్ధికి భర్త అడుగుజాడల్లో నడుస్తూ సర్పంచ్ గా పోటీ చేస్తున్న మందడపు రాణి గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, మధిర మండల కార్యదర్శి ఓట్ల కొండలరావు, ఇతర జిల్లా నాయకులు మండల నాయకులు, కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అందించే పథకాలే అభ్యర్థుల విజయానికి పునాదులు

- **ఎమ్మెల్యే జారె**



**అశ్వరావుపేట, డిసెంబర్ 8 (జనంసాక్షి) :** అశ్వారావుపేట ఈ నెల 14వ తేదీన జరగనున్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థుల విజయాన్ని లక్ష్యంగా పెట్టుకుని గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మండల వ్యాప్తంగా వివిధ గ్రామపంచాయతీలను సందర్శించారు ప్రతి గ్రామంలో జరిగిన ప్రత్యేక సమావేశాలలో ప్రజలకు నాయకులకు కార్యకర్తలకు ఎన్నికలలో విజయం కోసం అనుసరించాల్సిన ముఖ్యమైన వ్యూహాలను వివరించారు. గ్రామీణాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, రెండు లక్షల లక్షల రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల గృహ వినియోగ ఉచిత విద్యుత్, వ్యవసాయ ఉచిత విద్యుత్, మహిళలకు ఫ్రీ బస్ సర్వీస్, సెంటర్ లైటింగ్ వ్యవస్థ, సీసీ రోడ్లు, సిసి డ్రైనేజీలు, బిటి రహదారులు, పంట పొలాలకు గ్రావెల్ రోడ్లు, నియోజకవర్గ వ్యాప్తంగా హైమాస్ట్ లైటింగ్ వ్యవస్థ, విద్యా ప్రమాణాల మెరుగుదలకు మౌలిక వసతుల కల్పన, సన్న బియ్యం, ఆరోగ్యశ్రీ 5 లక్షల నుంచి 10 లక్షల కు పెంపు, వైద్యరంగంపై ప్రత్యేక చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం ఉచిత వైద్యం, చెరువుల పునరుద్ధరణ వంటి సంక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రతి ఇంటికి చేరేలా కార్యకర్తలు తీసుకెళ్లాలన్నారు కాంగ్రెస్ అందించే పథకాలను అభ్యర్థులు విజయానికి పునాదులుగా మార్చుకోవాలని నాయకులకు సూచించారు.

# ప్రభుత్వానుకూల ఓటుతోనే అభివృద్ధి సాధ్యం

- **పదేళ్లు ఏం చేయలేని వారు ఇప్పుడేం చేస్తారు**
- **పూనెం కృష్ణ గెలుపుతో సమగ్రాభివృద్ధి**
- **మాజీ ఎంఎల్సీ బాలసాని**

**భద్రాచలం, డిసెంబర్ 8 (జనంసాక్షి) :** స్థానిక ఎన్నికల ఫలితాలు ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటే ఆ ప్రాంతాలు అభివృద్ధి పథంలో సాగుతాయని, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి పూనెం కృష్ణకు ఓటు వేసి గెలిపించడం ద్వారా భద్రాచల సమగ్రాభివృద్ధి జరుగుతుందని మాజీ ఎంఎల్సి బాలసాని లక్ష్మీ నారాయణ అన్నారు. సోమవారం స్థానిక కెకె ఫంక్షన్ హాల్లో జరిగిన విలేకరుల సమావేశంలో స్థానిక ఎంఎల్ఏ డా. తెల్లం వెంకట్రావుతో కలిసి ఆయన మాట్లాడారు. తమను గెలిపిస్తే అది చేస్తాం ఇది చేస్తాం అంటూ కొందరు చెబుతున్నారని, కానీ పదేళ్ల పాటు వాళ్ల పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏ మాత్రం భద్రాచలాన్ని అభివృద్ధి పరిచారో చూపించాలని ప్రశ్నించారు. కేసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాముని కళ్యాణానికి తలంబ్రాలు పట్టు వస్త్రాలు తేలేక పోయారని, మొదట్లో రూ.100 కోట్లు, వరదల సమయంలో వచ్చి రూ.1000 కోట్లు ఇస్తానని చెప్పి ఒక్క పైసా కూడా ఇవ్వలేదని యద్దేవా చేశారు. పదేళ్లపాటు గ్రామ పంచాయితీ ఎన్నికలు నిర్వహించడంలో ఆ నాటి ప్రభుత్వం విఫలమైందని, పైగా భద్రాచలం గ్రామ పంచాయితీని మూడు ముక్కలుగా చేసే కుట్ర చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సర్పంచ్ అభ్యర్థి పూనెం మాట్లాడుతూ భద్రాచలంలో పేరుకుపోయిన ప్రతీ సమస్య తెలుసని, వాటిని పూర్తిగా పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళిక తమ వద్ద ఉందని, తమకు ఓటు వేసి గెలిపించడం ద్వారా ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకునేందుకు వీలుంటుందని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్



నాయకులు బుడగం శ్రీనివాస్, బోగాల శ్రీనివాస్ రెడ్డి, చింతిర్యాల రవికుమార్, కొండిశెట్టి కృష్ణమూర్తి, భీమవరపు వెంకటరెడ్డి, జిందాతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఎలివేటెడ్ షెడ్ల వల్ల జీవాల్లో అంటు రోగాలు నివారించవచ్చు



**చంద్రుగొండ, డిసెంబర్ 8 (జనం సాక్షి) :** ఎలివేటెడ్ షెడ్ల వల్ల జీవాల్లో అంటురోగాలు నివారించవచ్చు అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు.మద్దూకూరు గ్రామం లో రైతు తలారి రవి ఏర్పాటు చేసిన ఎలివేటెడ్ మేకలు,గొర్రెల పెంపక షెడ్‌ను పరిశీలించారు . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎలివేటెడ్ షెడ్ విధానం పశుసంవర్థక రంగంలో ఆధునిక, శాస్త్రీయ పద్ధతి అని, ఈ విధానం ద్వారా జీవుల్లో అంటు వ్యాధులు గణనీయంగా తగ్గుతాయని అన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లల మరణాల శాతం ఈ విధానంతో స్పష్టంగా తగ్గడం శుభపరిణామమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్య, పశుసంవర్థక శాఖ అధికారి డా. వెంకటేశ్వర్లు, మండల పశుసంవర్థక అధికారి డాక్టర్ ఎంవి సంతోష్, రెవెన్యూ అధికారి సంధ్యారాణి, రైతు తలారి రవి మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

# ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

- **జిల్లా ఎస్పీ కే నరసింహ**

**పెన్‌పహాడ్, డిసెంబర్ 8 (జనం సాక్షి) :** అభ్యర్థులు నియంత్రణలో ఉండి ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా నిబంధనల ప్రకారం ప్రచారం నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ కే నరసింహ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదిక లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ ఈనెల 14న జరిగే సర్పంచ్ ఎన్నికలలో అభ్యర్థులకు ఎన్నికల నియమావళి పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా అభ్యర్థులు పరిమితికి మించి డబ్బులు ఖర్చు పెట్టవద్దని ప్రతి దానికి ఎన్నికల పరిశీలకులు గమనిస్తారని సూచించారు. అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా గ్రామాలలో ప్రచారం చేసే సమయంలో




వ్యక్తిగత విమర్శలు చేసుకోవద్దని, ఎలాంటి గొడవలు సృష్టించుకోవద్దని ఆయన సూచన చేశారు. ఎన్నికల రోజున పోలింగ్ కేంద్రంలో ఏజెంటుగా పని చేసేవారు నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని, ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించొద్దని తెలిపారు. ఎన్నికలు జరిగే పోలింగ్ కేంద్రంల వద్ద 100 మీటర్ల పరిధి, 200 మీటర్ల పరిధి ఆంక్షలు అమలులో ఉంటాయని, ఇట్టి ఆంక్షలకు తగినట్టుగా నడుచుకోవాలని అన్నారు. ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలకు అనుమతులు లేవని, బాణసంచ పేల్చడం డి జే లు ఉపయోగించడం నిషేధం అని అన్నారు. ఎన్నికల సమయంలో సమస్యలు సృష్టించే వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి రౌడీ సీట్ కేస్ నమోదు చేస్తామని, పీడీ యాక్ట్ కేసులు సైతం అమలు చేసి జీవితాంతం జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి ప్రసన్నకుమార్, సిఐ రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, తహసిల్దార్ లాలునాయక్, ఎంపీడీవో జానయ్య, ఎస్సై గోపికృష్ణ, వివిధ శాఖల అధికారులు అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.




# రూ.7 లక్షల కోట్లు ఆవిరి

## ఎస్‌బీఐ ఉద్యోగులకు జాక్‌పాట్

**న్యూఢిల్లీ:** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తన ఉద్యోగుల వసతి అవసరాలను తీర్చడానికి ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్)లో భారీ బల్క్ హౌసింగ్ కొనుగోలుకు సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రణాళికలో భాగంగా బ్యాంక్ దాదాపు రూ.294 కోట్లు (పన్నులు మినహాయించి) వెచ్చించి, అపార్ట్‌మెంట్లలో మొత్తం 200 2 బీహెచ్‌కే ఫ్లాట్లను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. దాంతో ఇటీవలి సంవత్సరాల్లో ముంబై రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో ఇది అతిపెద్ద సంస్థాగత నిర్ణయాల్లో ఒకటిగా నిలిచింది.




ఎస్‌బీఐ ఇటీవల జారీ చేసిన టెండర్ పత్రాల ప్రకారం భారతదేశంలో అత్యంత ఖరీదైన హౌసింగ్ మార్కెట్‌లో ముంబయి ఒకటి. దాంతో అక్కడి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఎస్‌బీఐ తెలిపింది. ఎస్‌బీఐ ఈ వ్యూహాత్మక బల్క్ కొనుగోలును నాలుగు క్లస్టర్లుగా విస్తరించింది. సెంట్రల్ శివారు ప్రాంతాలు (సియోన్ నుంచి ఘాట్‌కోపర్ వరకు). పశ్చిమ శివారు ప్రాంతాలు (అంధేరి నుంచి బోరివలి వరకు). థానే-కళ్యాణ్ బెల్ట్. నవీ ముంబై కారిడార్ (ఖర్ఘర్ నుంచి పన్వేల్ వరకు) విభజించింది. ప్రతి క్లస్టర్‌లో 50 యూనిట్ల చొప్పున మొత్తం 200 2-బీహెచ్‌కే అపార్ట్‌మెంట్లు కొనుగోలు చేయనుంది. ప్రతి అపార్ట్‌మెంట్ కార్పెట్ ఏరియా సుమారు 600 చదరపు అడుగులు (55.74 చదరపు మీటర్లు) ఉండాలని ఎస్‌బీఐ నిర్ణయించింది. కొనుగోలు చేసే ప్రాపర్టీ ప్రాజెక్ట్ 5 ఏళ్లలోపుదై ఉండాలి. మహారెరా కంప్లీషన్ సర్టిఫికేట్ (రాఅ)తో మహారెరా రిజిస్టర్ అయి ఉండాలి. ప్రతి ఫ్లాట్‌కు ఒక కారు పార్కింగ్, ఒక ద్విచక్ర వాహనం పార్కింగ్ చొప్పున మొత్తం 400 పార్కింగ్ స్లాట్‌లు తప్పనిసరి ఉండాలని చెప్పింది. లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఒఐఎ) జారీ చేసిన తేదీ నుంచి 6 నెలల్లోగా (180 రోజులు) లావాదేవీని పూర్తి చేయాలని బ్యాంక్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ బల్క్ కొనుగోలు ద్వారా ఉద్యోగులకు ముంబైలో పెరుగుతున్న ఆస్తి ధరలతో సంబంధం లేకుండా స్థిరమైన, తక్కువ ఖర్చుతో కూడిన నివాసాలు అందించాలని బ్యాంక్ చూస్తోంది. సిబ్బంది సంక్షేమం, గృహ అవసరాలను తీర్చడానికి ప్రభుత్వ రంగ సంస్థలు, ముఖ్యంగా బ్యాంకింగ్ రంగం (ఉదాహరణకు, యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్) రెంటల్ లేదా లీజు ఏర్పాట్ల కంటే నేరుగా రెడీ-టు-మూవ్ గృహాలను కొనుగోలు చేసే ధోరణి పెరుగుతున్నట్లు ఈ చర్య స్పష్టం చేస్తోంది.

## తారుమారైన బంగారం, వెండి ధరలు..

**దేశంలో బంగారం, వెండి ధరలు తారుమారయ్యాయి. మళ్లీ పెరుగుదల వైపు పయనించాయి. ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు మదుపరులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరలలో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఆదివారంతో పోలిస్తే సోమవారం బంగారం ధరలు పెరిగాయి. అలాగే వెండి ధరలు కూడా ఎగిశాయి.**

## భారీ నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. విదేశీ మదుపర్ల అమ్మకాలు, రూపాయి బలహీనత కారణంగా ప్రధాన షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలూ భారీగా (దాదాపు 2 శాతం) పతనమయ్యాయి. దీనికితోడు యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్ల ప్రకటన నేపథ్యంలో మదుపర్లలో అప్రమత్తత కనిపించింది. దీంతో ఓ దశలో సెన్సెక్స్ 800 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ మళ్లీ 26వేల మార్కు దిగువకు చేరింది. బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.7 లక్షల కోట్లపైనే ఆవిరై రూ.463 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 85,624.84 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 85,712.37) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 84,875.59 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 609.68 పాయింట్ల నష్టంతో 85,102.69 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 225.90 పాయింట్ల నష్టంతో 25,960.55 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.09గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ మినహా మిగిలిన షేర్లూ నష్టాల్లో ముగిశాయి. బీఈఎల్, ఎటెర్నల్, ట్రెంట్, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్ ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 63 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4208 డాలర్ల వద్ద కొనసాగుతోంది.




**కారణాలు ఇవీ..**

అమెరికా ఫెడరల్ రిజర్వ్ డిసెంబర్ 10న వడ్డీ రేట్లపై తన నిర్ణయాన్ని ప్రకటించనుంది. ఈసారి 25 బేసిస్ పాయింట్ల మేర కోత ఉండొచ్చని అనలిస్టులు అంచనా వేస్తున్నారు. అందుకు విరుద్ధంగా నిర్ణయం వెలువడితే స్టాక్ మార్కెట్‌పై ఒత్తిడి పడుతుందన్న కారణంతో రిటైల్ ఇన్వెస్టర్లు అమ్మకాలకు దిగినట్లు తెలుస్తోంది. భారత ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్ల అమ్మకాలు కొనసాగుతున్నాయి. ఒక్క డిసెంబర్ 5నే రూ.439 కోట్లను ఉపసంహరించుకోగా.. డిసెంబర్‌లో ఇప్పటి వరకు రూ.6,584 కోట్ల విలువైన స్టాక్స్‌ను విక్రయించారు. రూపాయి విలువ పతనం కూడా మన మార్కెట్లపై ప్రభావం చూపింది. పెరుగుతున్న క్రూడాయిల్ ధరలు, విదేశీ నిధులు తరలిపోవడం వంటి కారణాలతో డాలరుతో పోలిస్తే రూ.90 పైనే ట్రేడవుతోంది. సుదీర్ఘకాలంపాటు ఇదే పతనం కొనసాగితే మన ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. భారత్- అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై ఇప్పటి వరకు ఎలాంటి పురోగతీ లేకపోవడమూ మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. మరోవైపు జపాన్ ప్రభుత్వ బాండ్లపై రాబడి సరికొత్త గరిష్ఠాలకు చేరింది. దీంతో యెన్ క్యారీట్రేడ్ తిరోగమన బాట పడుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. జపాన్‌లో బాండ్లపై రాబడి పెరుగుదల వల్ల భారత్ వంటి వర్ధమాన దేశాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని అనలిస్టులు పేర్కొంటున్నారు.

## భారత్-ఇజ్రాయెల్ భాగస్వామ్యంలో కొత్త కంపెనీ

**న్యూఢిల్లీ:** భారతీయ సంస్థ ఏజీటీసీ బయోటెక్, ఇజ్రాయెల్‌కు చెందిన లగ్జంబర్గ్ ఇండస్ట్రీస్ సంయుక్తంగా సెమియోఫోర్ లిమిటెడ్ అనే కొత్త కంపెనీని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించాయి. 50:50 వాటాలతో ఏర్పాటైన ఈ జాయింట్ వెంచర్ ద్వారా 18 అధునాతన ఫెరోమోన్, సెమియోకెమికల్ ఆధారిత పంట సంరక్షణ టెక్నాలజీలను ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్యీకరించనున్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా భారతదేశంలో అభివృద్ధి చెందిన సెమియోకెమికల్ టెక్నాలజీ తొలిసారిగా ఇజ్రాయెల్‌కు లైసెన్స్ అవుతున్నది. దీన్ని రెండు దేశాల మధ్య శాస్త్రీయ సహకారానికి మైలురాయిగా భావిస్తున్నారు. పంటలపై రసాయన అవశేషాలు లేకుండా, తేనెటీగలకు హానికరం కాని, వాతావరణానుకూల పద్ధతిలో పురుగు నియంత్రణను సాధించడమే ఈ సాంకేతికాల ప్రధాన లక్ష్యం. దీంతో రసాయన పురుగుమందుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. సెమియోఫోర్ భారత్, ఇజ్రాయెల్, బ్రెజిల్, ఆస్ట్రేలియా, ఆఫ్రికా వంటి మార్కెట్లలో నియంత్రణ అనుమతులు, మౌలిక వసతులు, మార్కెటింగ్ కోసం 10 మిలియన్ అమెరికా డాలర్లు పెట్టుబడి పెట్టనుంది. ద్రాక్ష, యాపిల్, పత్తి, మొక్కజొన్న వంటి పలు పంటలను లక్ష్యంగా చేసుకున్న ఈ ఉత్పత్తుల ద్వారా ప్రతి ఉత్పత్తి 75-100 మిలియన్ డాలర్ల వరకు ఆదాయం రాబట్టే అవకాశం ఉందని కంపెనీలు ప్రకటించాయి.




# నెలకు రూ.8,600

**ఇన్‌స్టాలేషన్ రూ.34000 • భారత్‌లో స్టార్‌లింక్ ధరలు ఖరారు**

**న్యూఢిల్లీ:** ఎలాన్ మస్క్ నేతృత్వంలోని అంతరిక్ష సాంకేతిక సంస్థ స్పేస్ఎక్స్ భారతదేశంలో ప్రారంభించనున్న శాటిలైట్ ఇంటర్నెట్ సర్వీసుల ధరలను అధికారికంగా ప్రకటించింది. సాంప్రదాయ బ్రాడ్‌బ్యాండ్ మౌలిక సదుపాయాలు పరిమితంగా ఉన్న ప్రాంతాల్లో కనెక్టివిటీని పెంచడానికి ఈ సర్వీసులు ప్రారంభిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. శాటిలైట్ ద్వారా నేరుగా హై-స్పీడ్ ఇంటర్నెట్‌ను అందించే ఈ ప్రీమియం సేవను భారతదేశ మార్కెట్లో త్వరలో మొదలు పెట్టనున్నారు.

**ధరల వివరాలు:**

నెలవారీ సబ్‌స్క్రిప్షన్ ఫీజు: రూ.8,600. ఇది ప్రతి నెల సేవలను అందిస్తున్నందుకు వినియోగదారులు చెల్లించే రుసుం. వన్-టైమ్ హార్డ్‌వేర్ కిట్ ఖర్చు: రూ.34,000. ఇది తొలిసారిగా చెల్లించాల్సిన పరికరాల ధర.




హార్డ్‌వేర్ కిట్‌లో ఏముంటాయి?

రూ.34,000 వన్-టైమ్ ఖర్చుతో వచ్చే ఈ కిట్‌లో శాటిలైట్ డిష్, వై-ఫై రౌటర్, పవర్ సప్లై, కేబుల్స్, మౌంటింగ్ ట్రైపాడ్ ఉంటాయి. దీనిని ఇన్‌స్టాల్ చేసిన తర్వాత వినియోగదారులు స్టార్‌లింక్ లో-ఎర్త్ ఆర్బిట్ ఉపగ్రహాల సముదాయానికి కనెక్ట్ అవుతారు. దీనివల్ల మారుమూల ప్రాంతాల్లో ఇంటర్నెట్ సదుపాయం పొందవచ్చు.

మారుమూల ప్రాంతాలే లక్ష్యం..

భారతదేశంలో గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో మెరుగైన కనెక్టివిటీ అందించేందుకు ఇది ఎంతో తోడ్పడుతుంది. ఫైబర్ లేదా మొబైల్ నెట్‌వర్క్‌లు బలహీనంగా ఉన్న చోట ఇంటర్నెట్ యాక్సెస్ అందించడం ద్వారా డిజిటల్ సర్వీసులు మెరుగుపరవచ్చు. మారుమూల ప్రాంతాల్లోని చిన్న వ్యాపారాలు డిజిటల్ సాధనాలను యాక్సెస్ చేయడానికి వీలు కల్పించవచ్చు. వెనుకబడిన కమ్యూనిటీలకు ఆన్‌లైన్ విద్యను తీసుకురావడం ద్వారా విద్యా అవకాశాలను మెరుగవుతాయి.

మార్కెట్ సవాళ్లు

సాధారణంగా భారతదేశంలో సాంప్రదాయ బ్రాడ్‌బ్యాండ్ సేవలు నెలకు రూ.500 నుంచి రూ.1,500 మధ్య ఉన్నాయి. ఈ నేపథ్యంలో స్టార్‌లింక్ నెలకు రూ.8,600 ధర వసూలు చేయడంతో ఎంతమేరకు సబ్‌స్క్రైబర్లు వస్తారనేది చూడాల్సి ఉంది.

# నైట్ క్లబ్బుల్లో మరణ శాసనాలు

**అంతులేని నిర్లక్ష్యంతో సాధారణ పౌరులు బలి**





**న్యూఢిల్లీ:** నిత్య జీవితంలో రోజువారీ పనులతో అలసిపోయి సరదాగా గడపడానికి నైట్‌క్లబ్‌లకు వెళితే ప్రాణాలు పోగొట్టుకోవాల్సి వస్తోంది. గోవా నైట్‌క్లబ్బులో 25 మంది మరణించడం సంచలనం సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా నైట్‌క్లబ్బుల్లో ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. కాలక్షేపం, వినోదం, విశ్రాంతి కోసం వచ్చిన పర్యాటకులు విగత జీవులుగా మారారు. 2015 అక్టోబర్: రొమేనియా దేశంలోని బుకారెస్ట్ కలెక్టివ్ నైట్‌క్లబ్‌లో అగ్నిప్రమాదం జరగడంతో 64 మంది మృతి. 2016 డిసెంబర్: అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉన్న ఘోస్ట్‌షిప్ క్లబ్‌లో మంటలు చెలరేగడంతో 36 మంది బలి. 2022 జనవరి: ఆఫ్రికా దేశం కామెరూన్‌లోని యావోన్డే నైట్‌క్లబ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 16 మంది మృతి. 2022 జనవరి: ఇండోనేషియాలో వెస్ట్‌పపువా ప్రావిన్స్‌లో సోరోంగ్ నైట్‌క్లబ్‌లో మంటలు. తుదిశ్వాస విడిచిన 19 మంది టూరిస్టులు. 2022 ఆగస్టు: థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లోని మౌంటైన్ బీ క్లబ్‌లో షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు. 23 మంది అగ్నికి ఆహుతి. 2023 అక్టోబర్: స్పెయిన్‌లోని మర్సియాలో నైట్‌క్లబ్ కాంప్లెక్స్‌లో అగ్ని ప్రమాదం. 13 మంది మృతి. 2024 ఏప్రిల్: టర్కీలోని ఇస్తాంబుల్‌లో మస్కరేడ్ నైట్‌క్లబ్‌లో చెలరేగిన మంటలు. 29 మంది అక్కడికక్కడే మృతి. 2025 మార్చి: ఉత్తర మాసిడోనియాలోని నైట్‌క్లబ్‌లో బాణాసంచా కాలుస్తుండగా మంటలు అంటుకోవడంతో 62 మంది మృతి.

# పరిమితి దాటితే కొరడానే!



**న్యూఢిల్లీ:** దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థను మరింత పారదర్శకంగా మార్చే ప్రయత్నంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నగదు లావాదేవీలపై కఠినమైన కొత్త నిబంధనలు అమలు చేయనుంది. ఈ మార్పులు వ్యక్తులు కానీ, వ్యాపార సంస్థలు కానీ నిర్వహించే రోజువారీ నగదు ప్రవాహంపై గణనీయమైన ప్రభావం చూపనున్నాయి. కొత్త నిబంధనల ప్రకారం, లెక్కల్లో చూపని నగదుపై జరిమానాలు, సర్‌ఛార్జీలు, సెస్సులు కలిసి మొత్తం 84% వరకు పన్ను భారం పడే అవకాశం ఉందని ఇన్వెస్ట్మెంట్ బ్యాంకర్ సార్థక్ అహుజా లింక్డ్‌ఇన్ పోస్ట్‌లో వెల్లడించారు. అహుజా పేర్కొన్నట్లుగా, ఆదాయపు పన్ను శాఖ సోదాలు లేదా స్వాధీనం సందర్భాల్లో వ్యక్తి వద్ద లెక్కలు లేని నగదు పట్టుబడితే ఈ అధిక పన్ను రేటు వర్తిస్తుంది. ప్రభుత్వం తీసుకువస్తున్న కొత్త మార్పుల నేపథ్యంలో ఇటు వ్యక్తులతోపాటు వ్యాపార సంస్థలు నగదు వినియోగంపై మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

**కొత్త నిబంధనలు ఇవే..**

కొత్త నియమాల ప్రకారం, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు పెద్ద మొత్తాల నగదు లావాదేవీలను నిశితంగా పర్యవేక్షించనున్నాయి. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ. 10 లక్షలకు పైగా నగదు ఉపసంహరణ జరిగితే, బ్యాంకులు ఆ వివరాలను ఆదాయపు పన్ను శాఖకు నివేదిస్తాయి. రూ. 20 లక్షలకు పైగా ఉపసంహరణ జరిగితే, బ్యాంకులు తక్షణమే టీడీఎస్ కట్ చేస్తాయి. తరచుగా పెద్ద మొత్తాల నగదు ఉపసంహరణలు జరిగితే, వాటి మూలం అనుమానాస్పదంగా కనిపిస్తే, ఆదాయపు పన్ను శాఖ సోదాలు లేదా జప్తు చర్యలు కూడా ప్రారంభించవచ్చు.

**వీటికి 100% జరిమానా తప్పదు**


కొన్ని ప్రత్యేక నగదు లావాదేవీలపై ఇకపై 100 శాతం జరిమానా వర్తించనుంది. అటువంటి లావాదేవీలు ఇవే.. స్థిరాస్తి విక్రయం సమయంలో రూ. 20,000 కంటే ఎక్కువ నగదు స్వీకరిస్తే, ఆ మొత్తంపైనే 100% జరిమానా ఉంటుంది. ఒకే రోజులో ఒక కస్టమర్ నుండి రూ. 2 లక్షలకు పైగా నగదు అందుకుంటే ఆ మొత్తంపైనే జరిమానా విధిస్తారు. వ్యక్తులు నగదు రూపంలో రుణాలు పొందడం ఇకపై పూర్తిగా నిషేధం. దీనిని ఉల్లంఘిస్తే రుణ మొత్తం అంతటిపై 100% జరిమానా పడుతుంది. ఈ జాగ్రత్తలు అవసరం ప్రభుత్వం కట్టుదిట్టమైన నగదు నియంత్రణ వ్యవస్థను నెలకొల్పుతున్న నేపథ్యంలో ఈ జాగ్రత్తలు అవసరం పెద్ద మొత్తాల నగదు లావాదేవీలు తప్పకుండా బ్యాంకింగ్ ఛానళ్ల ద్వారా జరపాలి. నగదు రసీదులు స్పష్టమైన ఆధారాలతో ఉండాలి. అక్రమ, లెక్కల్లో లేని నగదు ఖచ్చితంగా గణనీయమైన పన్ను భారం, జరిమానాలు తెచ్చిపెడుతుంది.

## ఇండిగో గందరగోళం.. అత్యసవర చర్చ కుదరదు

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఇండిగో విమానాల రద్దుపై న్యాయ జోక్యం కోరుతూ దాఖలైన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించడానికి సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. పరిస్థితులను గమనించి, దానిని పరిష్కరించడానికి కేంద్రం చర్యలు తీసుకుందని పేర్కొంది. లక్షలాది మంది వివిధ విమానాశ్రయాల్లో చిక్కుకుపోయారనే వాస్తవాన్ని తాము గమనించామని సుప్రీంకోర్టు తెలిపింది. ఇది చాలా తీవ్రమైన అంశం. లక్షలాది మంది విమానాశ్రయాల్లో చిక్కుకుపోయారు. భారత ప్రభుత్వం సకాలంలో చర్య తీసుకుని ఈ సమస్యను గుర్తించిందని మాకు తెలుసు. ప్రజలకు ఆరోగ్య సమస్యలు మరియు ఇతర ముఖ్యమైన సమస్యలు ఉంటాయని తెలుసని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్య బాగ్చితో కూడిన ధర్మాసనం పేర్కొంది. గత కొన్ని రోజులుగా పలు ఇండిగో విమానాలు రద్దయ్యాయని, దీంతో పలువురు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఒక న్యాయవాది కోర్టుకు తెలిపారు. విమానాల రద్దు గురించి ప్రయాణికులకు తెలియజేయబడదు అని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా 95 విమానాశ్రయాల్లో సుమారు 2,500 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయని, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇండిగో సంక్షోభం ఏడవ రోజుకి చేరుకుంది. సోమవారం ఢిల్లీ, బెంగళూరు విమానాశ్రయాల నుండి 250కి పైగా ఇండిగో విమానాలు రద్దయాయ్యాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. అలాగే బెంగళూరు విమానాశ్రయం 117 సేవలను రద్దు చేసినట్లు తెలిపింది. దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన ఇండిగో సంక్షోభంపై విచారణ జరపటానికి భారత అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు తిరస్కరించింది.

## బిజినెస్ ట్రిప్ అని చెప్పి.. ప్రియురాలితో దొరికిపోయాడు!

**న్యూఢిల్లీ:** ఇంట్లో భార్య ఉండగానే గాల్‌ఫ్రెండ్‌తో కలిసి థాయిలాండ్ టూరుకు వెళ్లిన ప్రబుద్ధుడొకరు ఊహించని రీతిలో దొరికిపోయాడు. భార్యతో బిజినెస్ టూర్ అని చెప్పి రహస్య స్నేహితురాలితో షికారుకెళ్లిన అతగాడిని అనూహ్యంగా ప్రకృతి పట్టించింది. ఏంటి నమ్మడం లేదా? అయితే నేరుగా స్టోరీలోకి వెళ్లిపోదాం పదండి. మలేసియాకు చెందిన ఓ వ్యక్తి ఇటీవల తన సహోద్యోగులతో కలిసి బిజినెస్ ట్రిప్ వెళుతున్నట్టు భార్యతో చెప్పి థాయిలాండ్ వెళ్లాడు. దక్షిణ థాయిలాండ్‌లోని అతిపెద్ద నగరమైన హాట్ యాయ్‌కు వెళ్లినట్టు భార్యకు తెలిపాడు. కడుపుతో ఉన్న భార్యకు ఎప్పటికప్పుడు తన ప్రయాణానికి సంబంధించిన అప్‌డేట్స్ ఇస్తుండేవాడు. దీంతో ఆమెకు ఎటువంటి అనుమానం కలగలేదు. ఇక్కడి వరకు అంతా బాగానే మేనేజ్ చేశాడు. కానీ తర్వాత కథ అడ్డం తిరిగింది. ప్రకృతి కన్నెర్ర చేయడంతో తర్వాత పరిస్థితి ఒక్కసారిగా మారిపోయిందని సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ వెల్లడించింది. ఊహించని విధంగా భారీ వర్షాలు థాయిలాండ్‌ను అతలాకుతలం చేశాయి. కుండపోత వర్షాలతో దక్షిణ హాట్ యాయ్ నగరంతో పాటు 12 ప్రావిన్సులలో భారీ వరదలు సంభవించాయి. 80 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, 30 లక్షల మంది వరకు నిరాశ్రయులయ్యారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న మలేసియా మహిళ ఒకరిని సదరు భర్తగారి భార్య సాయం కోసం అభ్యర్థించింది. వరదల్లో చిక్కు కున్న తన భర్తను కాపాడాలని కోరింది. అతడికి సంబంధించిన వివరాలు కూడా తెలిపింది. ఆమె అభ్యర్థనతో భర్తను కాపాడేందుకు అతడు బస చేసిన హోటల్‌కు వెళ్లిన మలేసియా మహిళకు వింత అనుభవం ఎదురైంది. మనో డు ఉన్నది సహోద్యోగులతో కాదని, గాల్‌ఫ్రెండ్‌తో అన్న విషయం బయటప డింది. నాలుగు రోజులుగా వారిద్దరూ ఒకే గదిలో ఉన్నట్టు గుర్తించారు.



**భార్యలూ జాగ్రత్త..**

సదరు మహిళ ఈ విషయాన్ని అతడి భార్యకు చెప్పలేదు. ఎందుకంటే ఆమె గర్భిణి, పైగా తండ్రి రాకకోసం ఆమె ముగ్గురు పిల్లలు ఎదురు చూస్తున్నారు. తనకెదురైన అనుభవాన్ని సోషల్ మీడియా ద్వారా బయట ప్రపంచానికి తెలియజేసింది. భర్తలను గుడ్డిగా నమ్మే భార్యలను అప్రమత్తం చేయడానికే ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేసినట్టు వివరించారామె. "జాగ్రత్తగా ఉండండి. మన భర్తలను గుడ్డిగా నమ్మవద్దు" అని ఆమె పేర్కొంది.

భార్యకు చెప్పాల్సిందే..

ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో చర్చకు దారితీసింది. భర్త బాగోతం గురించి భార్యకు చెప్పాల్సిందేనని పలువురు నెటిజనులు కామెంట్ చేశారు. కొంతమంది మాత్రం.. భార్య కుటుంబ సభ్యుడికో, స్నేహితులకో తెలియజేయాలని సూచించారు. ఇలాంటి వాళ్లకు తగిన శాస్తి చేయాలని మరికొందరు ఫైర్ అయ్యారు. చూడాలి మనోడి పరిస్థితి ఏంటో!

## ఐఏఎస్‌లకు కేడర్ల కేటాయింపు

ఢిల్లీ: ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ (ఐఏఎస్)కు ఎంపికైన వారికి కేంద్ర ప్రభుత్వం కేడర్ కేటాయించింది. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ 2024 సైకిల్‌లో ఐఏఎస్ సాధించిన వారి కేడర్ కేటాయింపు జాబితా విడుదలైంది. సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వ శాఖ ఈమేరకు జాబితాను విడుదల చేసింది. ఫస్ట్ ర్యాంకర్ శక్తి దూబే (రాష్ట్రజీనెబితి ఆబీఎవం) తన సొంత రాష్ట్రం ఉత్తరప్రదేశ్‌ను తన కేడర్‌గా పొందారు. హరియాణాకు చెందిన రెండో ర్యాంకర్ హర్షిత గోయల్.. గుజరాత్ కేడర్‌కు ఎంపికయ్యారు. మహారాష్ట్రకు చెందిన మూడో ర్యాంకర్ డోంగ్రే అర్చిత్ పరాగ్.. కర్ణాటక కేడర్ దక్కించుకున్నారు. నాలుగో ర్యాంకర్ షా మార్గి చిరాగ్(గుజరాత్), ఐదో ర్యాంకర్ ఆకాష్ గార్గ్ (ఢిల్లీ) సొంత రాష్ట్రాల్లో కేడర్ పొందారు. టాప్ 10 ర్యాంకర్లలో ఆరుగురు తమ సొంత రాష్ట్ర కేడర్ దక్కించుకున్నారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈ ఏడాది ఏప్రిల్ 22న సివిల్ సర్వీసెస్ పరీక్ష తుది ఫలితాలను ప్రకటించింది.




1,009 మంది అభ్యర్థులు వివిధ సర్వీసులకు ఎంపికయ్యారు. వీరిలో 725 మంది పురుషులు, 284 మంది మహిళలు ఉన్నారు. యూపీఎస్‌ఈ 2024 ఫలితాల్లో యూపీకి చెందిన శక్తి దూబే మొదటి స్థానం సాధించారు. టాప్ 5 ర్యాంకర్లలో ముగ్గురు మహిళలు ఉండడం విశేషం. టాప్ 25లో 14 మంది పురుషులు, 11 మంది మహిళలు ఉన్నారు.

## ఇండిగో విమానం.. ఎగరక ముందే వణికించింది!

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా విమానాల జాప్యాలు, రద్దులతో విమానయాన సంస్థ ఇండిగో తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ తరుణంలో ఇండిగో విమానంలో చోటు చేసుకున్న అనూహ్య సంఘటన ప్రయాణికులను వణికించింది. సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బెంగళూరు-వడోదర మార్గంలో ఉన్న ఇండిగో విమానం టేకాఫ్‌కి సిద్ధమవుతున్న సమయంలో ఒక పావురం అకస్మాత్తుగా క్యాబిన్‌లోకి ప్రవేశించింది. దీంతో ప్రయాణికులు, సిబ్బంది కొద్దిసేపు గందరగోళానికి గురయ్యారు. వైరల్ వీడియోలో, పావురం విమానం నుండి బయటపడటానికి ప్రయత్నిస్తూనే ప్రయాణికుల తలల మీదుగా ఎగురుతూ కనిపిస్తుంది. సిబ్బంది, కొంతమంది ప్రయాణికులు దానిని బయటకు పంపించేందుకు ప్రయత్నించినా పావురం విమానం లోపలే తిరుగుతూనే ఉంది. ఈ దృశ్యాన్ని ఒక డిజిటల్ క్రియేటర్ రికార్డ్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయగా, ఆ వీడియో వెంటనే వైరల్ అయింది.




"విమానంలో ఆశ్చర్యకర అతిథి నవ్వుల నడుమ సరదా క్షణం. పూర్తిగా ఆనందించాను" అని తన పోస్టులో పేర్కొన్నారు. వైరల్ అయిన ఈ ఘటన సోషల్ మీడియా యూజర్లను ఆకట్టుకుంది. పలువురు తమ కామెంట్లతో స్పందించారు. "అది బర్డింగ్ పాస్ తీసుకుందేమో!" అని ఒకరు హాస్యభరితంగా వ్యాఖ్యానించగా "ప్రయాణంలో అదనపు తోడు" అని కామెంట్ చేశారు. "ఇండిగో టైమ్ ఇటీవల అస్సలు బాలేదు" అని మరొకరు ప్రతిస్పందించారు.



భూదాత మనవడు, కాంగ్రెస్ నాయకుడు కే. రాంజీ రాథోడ్ మాట్లాడుతూ "కొత్తగా ఎన్నికయ్యే సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధి జరగాలి. కాలనీ పేరు భీంలా నాయక్ నగర్‌గా మారాలి. డ్రైనేజీ సమస్య తక్షణమే పరిష్కారం కావాలి" అని డిమాండ్ చేశారు.



# పేరు గొప్ప.. ఊరు దిబ్బే!

## వాణిజ్య పట్టణానికి సమీప గిరిజన తండా

- 150 ఏళ్ల చరిత్ర గల ఆంతారం తండా
- ప్రత్యేక పంచాయితీ వచ్చి 7 ఏళ్లైంది.. అభివృద్ధి మాత్రం ఆమడ దూరం
- రేషన్ కోసం బురద రోడ్డు దాటి ఒక కిలోమీటరు నడవాల్సిన దుస్థితి
- 35 ఏళ్లుగా డ్రైనేజీ లేక మగ్గిపోతున్న కొత్త కాలనీ..
- భీంలా నాయక్ పేరు పెట్టాలని డిమాండ్
- మున్సిపల్ విస్తరణలో ప్రతిపాదిత గ్రామం



గ్రామ ప్రధాన కార్యదర్శి, యూత్ కాంగ్రెస్ నాయకుడు కే. విక్రం రాథోడ్ మాట్లాడుతూ "గ్రామ అభివృద్ధికి సహకరిస్తాం.. కానీ కాలనీ అభివృద్ధిని విస్మరిస్తే ప్రశ్నిస్తాం" అని హెచ్చరించారు.

**తాండూరు, డిసెంబర్ 8 (జనం సాక్షి):**
వికారాబాద్ జిల్లా తాండూరు మండలంలోని ఆంతారం తండా గ్రామం.. వాణిజ్య పట్టణమైన తాండూరుకు కేవలం కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉండి కూడా అభివృద్ధి పరంగా ఇంకా ఆమడ దూరంలోనే ఉంది. నూట యాభై ఏళ్లకు పైగా ఘన చరిత్ర కలిగిన ఈ గిరిజన తండా రెండు దశాబ్దాల క్రితం వరకు కట్టెలు, బీడి ఆకులు, చింత చిగురు, సీతాఫలాలు, పశువుల గ్రాసం అమ్ముకుని జీవనం సాగించేది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వ్యవసాయ రంగంలో సాంకేతికత పెరగడం, ప్రభుత్వాలు పెట్టుబడి సాయం అందించడంతో గిరిజనులు పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడ్డారు. పంటలు లేని రోజుల్లో ముంబై, హైదరాబాద్ నగరాలకు వలస కూలీలుగా వెళ్తున్నారు. వ్యక్తిగతంగా కొంత అభివృద్ధి సాధించినా గ్రామ స్థాయి అభివృద్ధి మాత్రం ఇంకా కలల దశలోనే ఉంది.
2018లో కేసీఆర్ ప్రభుత్వం గిరిజన తండాలను ప్రత్యేక పంచాయితీలుగా ప్రకటించగా ఆంతారం తండాకు కూడా ప్రత్యేక పంచాయితీ హోదా వచ్చింది. అంతకు ముందు అంతరం గ్రామ పంచాయితీకి అనుబంధ గ్రామంగా ఉండేది.
2006లో ఇదే గ్రామానికి చెందిన రామచందర్ అంతరం సర్పంచిగా ఎన్నికయ్యారు. ప్రత్యేక పంచాయితీ ఏర్పడిన తర్వాత ఆయన భార్య సావిత్రిబాయి ఏకగ్రీవంగా సర్పంచ్ అయ్యారు. "అనుబంధ గ్రామంగా ఉన్నప్పుడు అభివృద్ధి చేయలేము.. ప్రత్యేక పంచాయితీ అయితే చేస్తాం" అని హామీ ఇచ్చారు. గ్రామస్తులు నమ్మి ఏకగ్రీవం చేశారు. కానీ ఆ హామీలు ఇప్పటివరకు కాగితంపైనే మిగిలాయి.
నేటికీ రేషన్ తీసుకోవాలంటే వర్షాకాలంలో బురద రోడ్డు దాటి ఒక కిలోమీటరు నడిచి వెళ్లాల్సిన దుస్థితి ఉంది. గ్రామంలో రేషన్ డీలర్ లేరు. ఇక గ్రామంలోని 'కొత్త కాలనీ' పరిస్థితి మరింత దయనీయం. 1989లో అప్పటి అటవీ శాఖ మంత్రి స్వర్గీయ చందూ మహారాజ్ ఆధ్వర్యంలో 36 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఒక ఎకరం స్థలాన్ని స్వర్గీయ భీంలా నాయక్ భూదానం చేశారు. కానీ 35 ఏళ్లు గడుస్తున్నా ఆ కాలనీలో డ్రైనేజీ సమస్య తీరలేదు. నలభై కుటుంబాలు, సుమారు 150 మంది ఓటర్లు నివసిస్తున్న ఈ కాలనీపై రాజకీయ నాయకులు, స్థానిక పెద్దలు ఆర్థిక-రాజకీయ బలం ఉందనే కారణంతో వివక్ష చూపుతున్నారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
ఇప్పటికైనా స్థానిక శాసనసభ్యుడు బయ్యని మనోహర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని డ్రైనేజీ సమస్యను తీర్చాలని, భూదాత భీంలా నాయక్ పేరును కాలనీకి పెట్టాలని, గ్రామంలో రేషన్ డీలర్ నియమించాలని కాలనీ వాసులు, గ్రామస్తులు కోరుతున్నారు.



## అనంతపల్లిలో అక్రమ మద్యం పట్టివేత బోయినపల్లి పోలీసుల ఆకస్మిక తనిఖీ

**బోయిన్ పల్లి డిసెంబర్ 08 (జనం సాక్షి)**
రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం అనంతపల్లి గ్రామంలో అక్రమ మద్యం నిల్వ ఉంచుతున్నాడన్న విశ్వసనీయ సమాచారం మేరకు, పర్శ వేణు కుమార్ ఇంట్లో బోయినపల్లి ఎస్ఐ ఎన్ రమకాంత్ సిబ్బందితో కలిసి ప్రత్యేక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో రూ. 4,400 విలువ గల అక్రమ మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్వాధీనం చేసిన మద్యాన్ని బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించి, మద్యం అక్రమంగా నిల్వ చేసిన పర్శ వేణుకుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ ఎన్ రమ కాంత్ తెలిపారు. అక్రమ మద్యం వ్యాపారంపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.

## కాంగ్రెస్‌లో చేరిన రుద్రవరం ఏకగ్రీవ వార్డు సభ్యులు, పలువురు నాయకులు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి డిసెంబర్ 8(జనంసాక్షి) :** వేములవాడ అర్బన్ మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన పలువురు నాయకులు,ఇటీవల ఏకగ్రీవం అయిన వార్డు సభ్యులు మహేష్,సంపత్ లు సుమారు 25 మంది సోమవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు చూసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు.
ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు కేటాయించిన గుర్తులపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. పార్టీ బలపరచిన అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ రుద్రవరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలుపే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనకయ్య, సర్పంచ్ అభ్యర్థి గాలి పెల్లి సువర్ణ స్వామి గౌడ్, కత్తి కనకయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికల విధులు కట్టుదిట్టంగా నిర్వహించాలి

- రెండవ విడత పోలింగ్ జరిగే మండలాల్లో పర్యటించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**గోదావరిఖని, జనంసాక్షి :**
పంచాయతీ ఎన్నికల విధులను కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష రెండవ విడత పోలింగ్ జరిగే జూలపల్లి, ధర్మారం,అంతర్గాం,పాలకుర్తి మండలాల్లోని ఎంపీడీవో కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ పాలకుర్తి మండలంలో ఏర్పాటుచేసిన రిక్రియేషన్ క్లబ్ సందర్శించారు.పంచాయతీ ఎన్నికల సంబంధించి డిసెంబర్ 9న పోలింగ్ సిబ్బంది శిక్షణ కార్యక్రమం కట్టుదిట్టంగా నిర్వహించాలని, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎంపిడివో కార్యాలయం వద్ద ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకునే సమయంలో తమ వెంట ఫారం-14, ఎలక్షన్ డ్యూటీ ఆర్డర్ ప్రజలు తీసుకుని రావాలని, రెండవ విడత పోలింగ్ సిబ్బంది డిసెంబర్ 9న తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. బ్యాలెట్ పత్రాల ముద్రణ పంపిణీ నిబంధన ప్రకారం సక్రమంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఎంపీడీవోలు, ఎంపిఓలు,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ వంద సంవత్సరాల ఉత్సవాలను
# విజయవంతం చేయండి

- ఇంటింటికి సీపీఐ కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు వెళ్ళండి
- రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని డివిజన్లలో సీపీఐ పోటీ చేస్తుంది
- సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం




**గోదావరిఖని, జనంసాక్షి :** రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో రామగుండంలోని అన్ని డివిజన్లలో సిపిఐ పోటీ చేస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు.సోమవారం స్థానిక భాస్కరరావు భవన్లో జరిగిన సిపిఐ రామగుండం నగర సమితి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రామగుండం కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లలో ఉన్న సమస్యలను తీసుకొని ఆయా డివిజన్లలోని ప్రజలను కలుపుకొని పోరాటాలు నిర్వహించాలని తద్వారా రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజల ఆదరణ లభిస్తుందని,ఆ దిశగా సిపిఐ ముందుకుసాగాలని అన్నారు అదేవిధంగా భారతదేశంలో సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని జనవరి 18న ఖమ్మంలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయుటకు పారిశ్రామిక ప్రాంతమైన గోదావరిఖని నుండి అధిక సంఖ్యలో క్యాడర్ తరలి రావాలని ఆయన కోరారు.ఖమ్మంలో జరిగే ఉత్సవాలకు దాదాపు 42 దేశాల కమ్యూనిస్టు యువకులు యువకులు యోధులు హాజరుకానున్నారని ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీ బలోపేతం అవుతుందని భారత దేశంలో కూడా అన్ని కమ్యూనిస్టు పార్టీలో ఏకమై ఒకే తాటిపైకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మావోయిస్ట్ పార్టీపై సాగిస్తున్న దమనకాండను వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.తాళ్ళ పెల్లి మల్లయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోసిక మోహన్, గౌతం గోవర్ధన్, నగర కార్యదర్శి కె.కనకరాజ్, యూనియన్ కేంద్ర ఉప ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మడ్డి ఎల్లాగౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం తదితరులు మాట్లాడారు.అనంతరం నూతనంగా 15 మంది నగర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.
ఈ సమావేశంలో సిపిఐ నాయకులు మడికొండ ఓదెమ్మ, మాటేటి శంకర్, తోడుపునూరి రమేష్ కుమార్, అసల రమ శనిగరపు చంద్రశేఖర్, మార్కాపురి సూర్య, రేణుకుంట్ల ప్రీతం, సంకె అశోక్, సిరిసిల్ల మల్లేష్, గంగారాపు చంద్రయ్య,పడాల కనక రాజ్,దుబాసి రేణుక, అబ్దుల్ కరీం, ఎర్రల రాజయ్య, గోడిసెల నరేష్, ఏంఏ గౌస్, ఉప్పులేటి తిరుపతి,జగన్, అసాల నవీన్, శివ, సుధీర్, భూమయ్య, సాగర్, నాని రెడపాక లక్ష్మణ్, జెర్రిపోతుల దేవయ్య, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులు కట్టుదిట్టంగా నిర్వహించాలి

- పోలింగ్ సామాగ్రి డిపాజిట్ చేసే వరకు ఆర్వోలదే బాధ్యత
- డిసెంబర్ 9న రెండో విడత, డిసెంబర్ 12న మూడో విడత పోలింగ్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్
- పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రిటర్నింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమావేశం



**పెద్దపల్లి,డిసెంబర్ 08(జనంసాక్షి) :** పంచాయతీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. సోమవారం సాయంత్రం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సాధారణ ఎన్నికల పరిశీలకుడు అనుగు నరసింహారెడ్డితో కలిసి రిటర్నింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.డిసెంబర్ 9న రెండో విడత, 12న మూడో విడత ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం తప్పనిసరిగా కల్పించాలని, ఆ రోజుల్లో రిటర్నింగ్ అధికారులు ఎంపీడీవో కార్యాలయం వద్ద తప్పకుండా అందుబాటులో ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇప్పటికే డిసెంబర్ 6న జరిగిన మొదటి విడత పోస్టల్ బ్యాలెట్‌లో సుమారు 68 శాతం ఓటింగ్ నమోదైందని తెలిపారు.ప్రతి మండలంలోని ఎంపీడీవో కార్యాలయాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని, అక్కడ సర్పంచ్-వార్డు సభ్యుల బ్యాలెట్ పేపర్లతో రిటర్నింగ్ అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఫారం-14, ఎన్నికల విధి ఆర్డర్ కాపీ తీసుకొచ్చిన సిబ్బంది పేర్లు ఓటరు జాబితాలో ధృవీకరించి వెంటనే పోస్టల్ బ్యాలెట్ జారీ చేయాలని, బ్యాలెట్ పేపర్ వెనుక రిటర్నింగ్ అధికారి సంతకం తప్పనిసరని సూచించారు.ఎన్నికల నియమని బంధనలపై రిటర్నింగ్ అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని, లేకపోతే సిబ్బంది నుంచి సక్రమంగా పని తీసుకోలేమని కలెక్టర్ హెచ్చరించారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు పోలింగ్ బృందాలు సమయానికి చేరుకున్నారో లేదో వ్యక్తిగతంగా చెక్ చేయాలని, ఆలస్యం జరగకుండా ఫాలోఅప్ చేయాలని స్పష్టం చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన సామగ్రి సరఫరా అయిందో లేదో ముందుగానే పరిశీలించి, అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. పోలింగ్‌కు ముందు రోజు సిబ్బంది పోలింగ్ కేంద్రాల వద్ద ఉండేలా చర్యలు తీసుకోవాలని, పోలింగ్ రోజు ఉదయమే అందరూ స్టేషన్ల వద్ద హాజరుకావాలని కలెక్టర్ నొక్కి చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్దనే స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేసి కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని తెలిపారు. కౌంటింగ్ మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభమవుతుందని, తొందరపాటు ఎంతమాత్రం వద్దని, ప్రతి ఓటు అమూల్యమైనదని గుర్తుంచుకోవాలని సూచించారు. పంచాయతీ ఎన్నికలు ముగిసిన రోజుకో రోజు ఉపసర్పంచ్ ఎన్నిక ప్రక్రియ పూర్తి చేయాలని, 50 శాతం కంటే ఎక్కువ వార్డు సభ్యులు అందుబాటులో ఉండేలా ముందుగానే సమాచారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్, కౌంటింగ్, ఉపసర్పంచ్ ఎంపిక తర్వాత ఎంపీడీవో కార్యాలయంలో సామగ్రి డిపాజిట్ చేసే వరకు రిటర్నింగ్ అధికారులు, సిబ్బంది పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. సమావేశంలో జెడ్పీ సీఈవో నరేందర్, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, డీఈవో శారద తదితర అధికారులు పాల్గొన్నారు.

## గూడెం గ్రామంలో అక్రమ మద్యం పట్టివేత :ఎస్సై గణేష్

**ముస్తాబాద్ డిసెంబర్ 8 (జనం సాక్షి) :** ముస్తాబాద్ మండల పరిధిలో అక్రమ మద్యం నిల్వలు, రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ముస్తాబాద్ ఎస్సై సిహెచ్. గణేష్ నేతృత్వంలో నిర్వహించిన తనిఖీల్లో గుడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.గుడెం గ్రామానికి చెందిన పిట్ల దేవేందర్ (30) అనే వ్యక్తి అక్రమంగా మద్యాన్ని నిల్వ చేసి విక్రయించడానికి సిద్ధంగా ఉన్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై గణేష్ బృందం దేవేందర్ నివాసంపై దాడి చేసింది.ఈ సందర్భంగా నిందితుడి వద్ద నుండి మొత్తం 9.745 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని మార్కెట్ విలువ సుమారు రూ. 8,048 ఉంటుందని అధికారులు అంచనా వేశారు. నిందితుడు దేవేందర్‌పై కేసు నమోదు చేశారు.అక్రమంగా మద్యం విక్రయించేవారిపై



కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# గుర్తులు కేటాయించింది ఎన్నికల అధికారులే...

- అధికార పార్టీపై బిఆర్ఎస్ నాయకులకులు అబండాలు వేయడం సిగ్గుచేటు
- కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి వైద్య శివప్రసాద్

**తంగళ్ళపల్లి డిసెంబర్ 08(జనం సాక్షి) :**
తంగళ్ళపల్లి సర్పంచ్ అభ్యర్థుల గుర్తులు కేటాయించడంలో అవకతవకలు జరిగాయని జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయడం వల్లనే మండల కేంద్రంలోని సర్పంచ్ అభ్యర్థుల గుర్తులు తారుమారు అయ్యాయి. దీనిపై కొందరు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, సర్పంచ్ అభ్యర్థి అంకారపు రవీందర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని మాట్లాడడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వైద్య శివప్రసాద్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అన్నారు. గత ఐదు పర్యాయాలు సర్పంచ్ గా పోటీ చేసినప్పుడు అతనికి ఏ విధంగా గుర్తు కేటాయించబడిందో అదేవిధంగా అధికారులు కేటాయించడం జరిగిందని తెలిపారు. గతంలో అంకారపు రవీందర్ పోటీ చేసిన సమయంలో ఇదే విధంగా టెక్నికల్ సమస్య తలెత్తినప్పుడు ఇంటి పేరులో ఉన్న అక్షరాలను బట్టి గుర్తులు నిర్ణయించడం జరుగుతుందని అన్నారు. మీకు ఉన్న అధికార దాహం గ్రామంలో ఎవరికీ లేదని మీరు ఒక్కరే ఎప్పుడు సర్పంచ్ గా కొనసాగుతారా. ఈరోజు అబద్ధాల మేనిఫెస్టో విడుదల చేసి గ్రామ ప్రజలను మోసగించేందుకు కుట్ర పన్నుతున్నాడు. ఐదు సంవత్సరాలు సర్పంచ్ గా తన భార్య కాలంలో ఈ అభివృద్ధి పనులు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. నిన్నటి రోజు నిర్వహించిన ప్రెస్ మీట్ లో ఉన్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎంతమంది అక్రమ భూ కబ్జాలు చేసి కేసుల పాలు అయినారో గుర్తు తెచ్చుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వారిపై జరుగుతున్న కేసులకు భయపడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మేము కాపాడిన ఆ వ్యక్తులే అప్పుడు అక్రమంగా భూ



కబ్జాలు చేసి సంపాదించిన డబ్బులతోనే మా పై పోటికి దిగారని వీటన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. మా కాంగ్రెస్ నాయకుల పైన కూడా కేసులు ఉన్నాయని బిఆర్ఎస్ నాయకులు చేసినటువంటి అక్రమ ఇసుక దందా భూకబ్జాలు పై పోరాటాలు చేసినందుకు మాపై అక్రమ కేసులు బనాయించారని గుర్తు చేశారు. డబ్బుతో, "అహంకారం"తో గ్రామ ప్రజలను కొనలేరని ప్రేమతో అభిమానంతో ఆ ప్రజల మన్నన్న లను పొందాలి. అందరం కలిసి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. గత పాలకులతో విసిగి వేసారిన జనం కొత్త సర్పంచ్ ని ఎన్నుకోవడానికి అడుగులు ముందుకు వేస్తున్నారని అన్నారు.ఈనెల 14న జరగనున్న స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గ్రామ ప్రజలు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సీనియర్ నాయకుడు మోర లక్ష్మీరాజం గుర్తు టీవీ రిమోట్ పై ఓటు వేసి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వైద్య శివప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగాల భూపతి, రాపల్లి ఆనందం,మోర లక్ష్మీరాజం, మచ్చ శ్రీనివాస్, సుద్దాల శ్రీనివాస్ గౌడ్, ఇటుకల మహేందర్, ఎడమల ప్రతాప్ రెడ్డి, సామల గణేష్, మోర రాజు, నగరం సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ రోజున ప్రిసైడింగ్
# అధికారుల పాత్ర కీలకం

**జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్**

**జగిత్యాల, డిసెంబర్ 08(జనం సాక్షి) :**
కొడిమ్యాల మండలం కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రిసైడింగ్ అధికారులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పరిశీలించి పలు అంశాల మీద ప్రిసైడింగ్ అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల




విధులు చాలా కీలకమైనదని, ప్రతీ అంశం పైన క్షుణ్ణంగా అవగాహన కల్పించుకొని విధులను నిర్వర్తించాలన్నారు. ఎన్నికల ముందు రోజు ఎన్నికల సామాగ్రి సేకరించడం, పూర్తి సామాగ్రి ఉందో లేదో ఎలా సరిచూసుకోవడం, ఓటర్ లిస్ట్, బ్యాలెట్ పేపర్స్ చెక్ చేసుకోవడం, బ్యాలెట్ బాక్స్ ఎలా సీల్ చేయాలి, ఛాలెంజ్ ఓటు, టెండర్ ఓటు, బ్యాలెట్ పేపర్స్ ఇవ్వడం, డైరీ నింపడం, అన్ని ఫార్మ్స్ ఎలా నింపాలి, ఏజెంట్స్ సిగ్నేచర్ ఎక్కడ తీసుకోవాలి, పోలింగ్ పూర్తి అయిన తర్వాత బ్యాలెట్ బ్యాక్ సీలింగ్, ఓట్స్ కౌంటింగ్, ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహణ, సర్పంచ్, ఉప సర్పంచ్ నియామక పత్రాలు ఇవ్వడం తదితర అంశాల మీద పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు వారికి ఏర్పాటు చేసిన చోటనే బస చేయాలని, అందుబాటులో ఉన్న బంధువుల ఇంటికి గాని, అభ్యర్థుల ఇంటికి గాని వెళ్లరాదని జిల్లా కలెక్టర్ తెలిపారు. పోలింగ్ ముందు రోజు నుండి కౌంటింగ్ వరకు ప్రిసైడింగ్ అధికారుల కార్యాచరణ, విధులు, బాధ్యతలు తీసుకోవలిసిన జాగ్రత్తలను పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా మాస్టర్ ట్రైనర్స్ వివరించారు. శిక్షణ జరుగుతున్న తీరును ప్రత్యక్షంగా పరిశీలించి ఎన్నికలు సజావుగా జరిగే విధంగా తగు సూచనలు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎమ్మార్వో కిరణ్ కుమార్, ఎంపీడీఓ స్వరూప తదితరులు పాల్గొన్నారు.




# ఆడపిల్ల పుడితే రూ 10 వేలు..

**సర్పంచ్ ఎన్నికల్లో అభ్యర్థి ప్రచారం**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** ఆడపిల్ల పుడితే రూ10 వేలు ఇదేదో ప్రభుత్వము అమలు చేసే పథకం కాదు... సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలంలోని ఆరేపల్లిలో సర్పంచ్ బరిలో ఉన్న ఇటిక్యాల రాజు తనను ఎన్నికల్లో గెలిపిస్తే గ్రామంలో పుట్టబోయే ప్రతి ఆడపిల్ల పేరిట రూ10 వేలు ఇస్తానని హామీ ఇస్తున్నాడు. ఈ మేరకు తను గెలిస్తే చేపట్టే ఎనిమిది హామీలను ప్రజలకు తెలుపుతూ గ్రామంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడు.మిడ్ మానేరు సమస్యలను, గ్రామ అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ సహకారంతో పూర్తి చేస్తానని ఓటర్లకు హామీ నిస్తున్నాడు.



- అధికార బలంతో ఒకరు అనధికార బలంతో మరొకరు వింత పోకడలు.
- నేరుగా గెలవలేక కొత్త ఎత్తుగడలకు దారి వెతుక్కోవడమా ?
- ప్రజాదరణతో ఏకగ్రీవమా లేక డబ్బుతో జరుగుతున్న ఏకగ్రీవమా ?
- గ్రామాల అభివృద్ధిలో ఈ వేలం పాట ఏకగ్రీవాలు దోహదపడతాయా ?
- ఒకప్పటి ఏకగ్రీవానికి, ఇప్పటి ఏకగ్రీవానికి కొట్టొచ్చినట్లు కనిపిస్తున్న తేడా !

# 'వేలం' వెర్రి తలలు వేస్తుంటే అంతర్మథనంలో ఓటరు

## ప్రజాస్వామ్యాన్ని బలహీన పరుస్తున్న సర్పంచుల ఏకగ్రీవ ఎన్నికలు దేనికి సంకేతం

**యాలాల్ డిసెంబర్ 8 (జనం సాక్షి) :** నడి శీతాకాలంలో రోమాలు నిక్కబొడుచుకున్న చలిలో కూడా అభ్యర్థులకు వేడి పుట్టించే గ్రామ రాజకీయం మొదలై అప్పుడే పదిహేను రోజులు గడిచిపోయాయి. ఈ వ్యాసం రాసే సమయానికి మొదటి విడత పోలింగ్‌కు రెండు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉంది. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఎన్నికలు అబద్ధాల పాలవుతున్నాయి. ఎన్నికల కమిషన్ నిబంధనలను తుంగలో తొక్కి ఏకగ్రీవాలు అపహాస్యంగా నాట్యం చేస్తున్నాయి. స్వాతంత్రం వచ్చి డెబ్బది యేనమిది సంవత్సరాలు గడిచిపోయాయి. స్వాతంత్రం వచ్చిన తొలినాళ్లలో గ్రామాల్లోని ప్రజలు పెద్దరికాన్ని గౌరవిస్తూ వారికి మొదటి పీఠం వేసేవారు. ఆనాటి పెద్ద మనుషులు కూడా విలువలతో కూడిన రాజకీయానికి, పెద్దరిక గౌరవాన్ని కాపాడుకోవడానికి నిబద్ధత కలిగి ఉండేవారు. అప్పటి కాలానికి అనుగుణంగా ప్రజలు కూడా ఆయా గ్రామాల పరిస్థితులను బట్టి మా గ్రామానికి ఇతను సరియైన వ్యక్తి అని గుర్తించి అందరి సమక్షంలో ఒక గ్రామస్తున్ని సర్పంచ్‌గా ఎన్నుకునే వారు. వారు కూడా వారి విలువలను కాపాడుకుంటూ గ్రామాన్ని ఆదర్శవంతంగా ఉంచేవారు. అలనాటి కాలంలో ఆ సర్పంచ్ గృహమునే గ్రామ సచివాలయ దేవాలయంగా భావించేవారు. గ్రామస్తుల పంచాయతీలు కానీ, గ్రామానికి సంబంధించిన విషయాలు కానీ సర్పంచ్ సమక్షంలో జరిగిన తర్వాత వారు ఇచ్చిన తీర్మానాలకు కట్టుబడి ఉండేవారు. మారుతున్న కాలక్రమంలో జనాభా పెరుగుదల, రాజకీయాల్లో వస్తున్న మార్పులు, కొత్త కొత్త ఎన్నికల నిబంధనలు ఆనాటి కాలాలను రూపుమాపుతూ సరికొత్త రాజకీయాలకు పునాదులు వేయడం ప్రారంభమైంది. మారిన రాజకీయాల్లో పూటకో రాజకీయ పార్టీ పుట్టుక రావడంతో పాటు పోటీతత్వం పెరగడం శరవేగంగా జరిగిపోతోంది. పెద్దరీకానికి చమర గీతం పాడి పోటీల్లో నిలిచే అభ్యర్థుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిపోవడంతో గత మధ్యస్థ కాలంలో ఏకగ్రీవాలు కొన్ని చోట్ల తప్ప అంతటా కనుమరుగైపోయాయి. గ్రామాల్లో కొన్ని సంవత్సరాల నుంచి ప్రత్యక్ష పోరుకు ఎన్నికలు పెట్టింది పేరుగా నిలిచాయి. 2020ల దశకం రోజుల్లో అనగా ప్రస్తుత రోజుల్లో ఏకగ్రీవాలకు తెరలేపి లేస్తున్న రోజులు మళ్లీ ప్రారంభమైనాయి. ఇవి వేటికి సంకేతాలు? ఆనాటి రోజుల ఏకగ్రీవాలు అయితే ముమ్మాటికీ కానేరవు. మరి ఇప్పుడు ఎందుకు ఏకగ్రీవాల సంబరాలు అనే దాని మీదనే మీమాంసతో కూడిన చర్చోపచర్చలు జరుగుతున్నాయి. రాజకీయాల్లో వస్తున్న పెను మార్పులు, ప్రలోభాలు, అభద్రతా భావాలు మళ్లీ ఏకగ్రీవానికి తెరలిపాయని చెప్పకనే చెప్పవచ్చు. రాబోయే రోజుల్లో కుంభకోణ ఏకగ్రీవాలు అన్న ఆశ్చర్యపోనవసరం లేదేమో! అధికారంలోకి వచ్చే ముందు రాజకీయ పార్టీలు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేని పరిస్థితులు తెచ్చుకుంటున్న ప్రభుత్వాలు వాటి మనుగడకు గ్రామీణ, మండల, మున్సిపల్, కార్పొరేషన్ స్థాయి ఎన్నికల పోరులో గెలవలేక గెలవాల్సిన పరిస్థితులు రావడం ప్రభుత్వాలకు పెను సవాలుగా మారిన క్రమంలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్న సంకేతాలు పంపడంతో పాటు అధికారంలోకి వచ్చిన ఏ పార్టీ అయినా ఇంతేనా అనే ధోరణి ప్రజల్లో ఏర్పడింది. ఏకగ్రీవానికి డబ్బే అర్హతనా? మరి డబ్బే ప్రామాణికమైతే డబ్బు లేని వారు సర్పంచులకు అనర్హులుగానే మిగిలిపోలేరు కదా! అన్నిటికీ ఏకగ్రీవ ప్రయత్నాలు అయినప్పుడు విద్యా, మంచి వ్యక్తిత్వం ఉండి డబ్బు లేకపోతే కూడా గెలిచే స్థితిలో ఉన్న వారి పరిస్థితి ఎలా? గ్రామాల్లో ఈనాటి పరిస్థితుల దృష్ట్యా కొంత శాతం ఓటర్లకు ఏకగ్రీవం నచ్చకపోతే వారి ఓటుకు విలువ లేకుండా పోయినట్లేనా! ఏది ఏమైనా ప్రస్తుతం జరుగుతున్న గ్రామీణ సమరంలో ఆయా నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యేలకు, మాజీ ఎమ్మెల్యేలకు ఈ ఎన్నికలు ఒక గుదిబండలా మారిన ప్రస్తుత తరుణంలో వారు తమ తమ అభ్యర్థుల గెలుపునకు శాయశక్తుల ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటించకపోగా గెలుపే పరమావధిగా బేరసారాలకు పాల్పడుతూ దారిలోకి రాకుంటే సరే అని రీతిలో భయభ్రాంతులకు గురి చేస్తున్నారనేది చర్చనీయాంశముగా మారింది. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చని క్రమంలో ఓటమి తప్పదని గ్రహించిన అధికార పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యేలకు సర్పంచుల గెలుపు బాధ్యత మరియు ఏకగ్రీవ ఎన్నిక బాధ్యతను అప్పగించిందనేది ప్రతిపక్ష పార్టీ వాదన. మరి వాస్తవంగా ఈనాటి పరిస్థితులు ఏకగ్రీవానికి గ్రామాల్లో అనుకూలతో కూడిన అనుకూల వాతావరణ పరిస్థితులు కల్పిస్తున్నారనేది నిర్వివాదాంశం. ఇప్పటివరకు జరుగుతూ వస్తున్న ఏకగ్రీవాల్లో కూడా ప్రభుత్వ వ్యతిరేకతను కాపాడుకోవడానికి డబ్బు ప్రలోభాలతో వారు చేస్తున్న ఎత్తుగడగా మెజార్టీ ప్రజలు భావిస్తున్నారని ప్రతిపక్షాల ఆరోపణ. రాష్ట్రస్థాయిలో అధికారంలో ఉన్న పార్టీ అధికారం కోల్పోగానే క్రింది స్థాయి నాయకులు అధికారంలోకి వచ్చిన పార్టీలోకి పార్టీ ఫిరాయించి మళ్లీ ఆ నాయకుల మాటనే చెలామణి అయ్యే పరిస్థితులు మారనన్ని రోజులు ఓటు వేసే ప్రతి ఓటరుకు గడ్డు కాలం ఎదుర్కొనక తప్పదు. ఈ గడ్డు కాలం పోవాలంటే పార్టీ ఫిరాయింపుల చట్టం అమలు చేసి పార్టీ మారిన వారిని పార్టీ ఫిరాయింపు చట్టం క్రింద ఇకముందు ఏ పదవికి పోటీ చేయకుండా వారిని అనర్హులుగా ప్రకటించినప్పుడే రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్య ఎన్నికలను చూడగలుగుతాము.

## ప్రజావాణి వినతులపై తక్షణ చర్యలు తీసుకోవాలి

### అదనపు కలెక్టర్ విజేందర్ రెడ్డి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 8(జనంసాక్షి) :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన 114 వినతులను అదనపు కలెక్టర్ విజేందర్ రెడ్డి, లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి స్వీకరించారు, జిల్లా ప్రజలు వివిధ సమస్యలపై సమర్పిస్తున్న అర్జీలను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిశీలించి, తక్షణ చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు, ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు నేరుగా న్యాయం చేసే వేదిక కావడంతో, ఒక్క వినతిని కూడా పెండింగ్‌లో పెట్టకుండా సందర్భానుసారంగా పరిష్కరించాలని స్పష్టం చేశారు, దరఖాస్తులపై చేపట్టిన చర్యలను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను అత్యవసరంగా క్లియర్ చేయాలని సూచించారు, అలాగే సిఎంఓ ప్రజావాణికి సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు, కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు జిల్లా నుండి భారీ స్థాయిలో పాల్గొననున్న విద్యార్థులు




**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి (జనం సాక్షి) :** తెలంగాణలో ఆవిష్కరణ, యువత సాధికారత, పరిశ్రమా ప్రగతికి ప్రతీకగా నిలిచే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 ఈ నెల 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో అంగరంగ వైభవంగా నిర్వహించబడుతున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా నుండి రానున్న పండితులు, నిపుణులను ఒక వేదికపైకి తీసుకువచ్చే ఈ సమ్మిట్‌లో చర్చా వేదికలు, అనుభవ పాఠాలశాలలు, వివిధ రంగాలకు చెందిన ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. యువతలో సృజనాత్మకతను పెంపొందించి, రాష్ట్ర విజన్-2047 సాధనకు దోహదం చేసే దిశగా ప్లీనరీ సమావేశాలు కూడా డిసెంబర్ 10 నుండి 13 వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరుగనున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశాల్లో విద్యార్థులు, సామాన్య ప్రజలు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యం అత్యంత కీలకమని, అందుకోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**జిల్లా విద్యార్థుల హాజరు వివరాలను వెల్లడించిన కలెక్టర్ మను చౌదరి**

ఈ నెల 10వ తేదీన ఘట్కేసర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల నుండి 966 మంది,ఈ నెల 13వ తేదీన ఘట్కేసర్ వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయం (వ్యవసాయ విభాగం) నుండి 200 మంది,దూలపల్లి మల్లారెడ్డి విశ్వవిద్యాలయం నుండి 200 మంది విద్యార్థులు ప్లీనరీ సమావేశాలకు హాజరుకానున్నారని తెలిపారు.సమ్మిట్ రాష్ట్ర పురోగతిలో కీలక మలుపు కానుందని, యువతలో నూతన ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానం, వ్యవస్థాపకతను పెంపొందించేందుకు ఇది విశిష్ట వేదికగా నిలుస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ చేస్తున్న గారడీని ప్రజలు నమ్మే స్థితిలో లేరు

- కాంగ్రెస్ పార్టీ నాయకులు తాండూరులో కొత్త సంస్కృతికి తెర లేపారు.
- వారికి అడ్డు వచ్చే వారిని బెదిరింపులు : మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి



**తాండూరు డిసెంబర్ 8(జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ చేస్తున్న గారడిని ప్రజలు నమ్మే స్థితిలో లేరని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం బషీరాబాద్ మండలం రెడ్డిఘనపూర్, మల్కన్ గిరి, నవల్గా గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల తరఫున ఆయా గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి పంజుగుల శ్రీశైల్ రెడ్డి తో కలిసి ఆయన పాల్గొన్నారు. 6 గ్యారెంటీలు 420 హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కి ప్రజలను మోసం చేసిన వైనాన్ని ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల స్టంట్ లో భాగమే ఇందిరమ్మ ఇండ్లు ఆరకొరకగా ఇచ్చారు. గ్రామానికి ఒకటి, రెండు ఇండ్లు ఇచ్చి ప్రజలను మభ్యపెడుతున్నారు.కాంగ్రెస్ పార్టీ చేస్తున్న గారడిని ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలిపారు.

**రెండేళ్ల పాలనలో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారు.**

420 హామీలు ఇచ్చి గద్దెనెక్కి ఇప్పుడు వాటి ఉసేత్తకుండా ప్రజలను మోసం చేశారు. పేద ప్రజల బాగు కోసం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను పాతాళానికి నెట్టేశారు. గ్రామాల్లో కరెంటు లేక, సమయానికి మంచినీటి సరఫరా కాక ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామాలకు వస్తే నిలదీయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ తాండూరులో కొత్త సంస్కృతికి తెర లేపారు.బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నర్సిరెడ్డి, సీనియర్ నాయకులు శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతమైన వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలి : డీఎస్పీ

**గంభీరావుపేట (జనం సాక్షి ):** సోమవారం గంభీరావుపేట మండలంలో కేజీ టు పీజీ నుండి ప్రధాన రహదారి గుండా తెలంగాణ స్తూపం వరకు సీఐ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పిస్తూ పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై డీఎస్పీ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల్లో పాల్గొనే సర్పంచ్ అభ్యర్థులు ఎన్నికల నియమవళిని తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రచారానికి అవసరమైన పోలీస్, తాసీల్దార్ అనుమతులు తీసుకుని ప్రచారం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్ గౌడ్ గంభీరావుపేట ఎస్సై అనిల్ కుమార్, ఎల్లారెడ్డిపేట ఎస్సై రాహుల్ రెడ్డి, పోలీస్ ఇబ్బందులు పాల్గొన్నారు.

## ఎన్‌ఎండీసీ స్టీల్ లిమిటెడ్ రికార్డు స్థాయిలో కార్యాచరణ

**నాగర్నార్, ఛత్తీస్‌గఢ్, డిసెంబర్ 8 (జనం సాక్షి) :** భారతదేశంలో అతి చిన్న ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ అయిన ఎన్‌ఎండీసీ స్టీల్ లిమిటెడ్ (ఎన్ఎస్ఎల్), నవంబర్ 2025ని దాని విలువ గొలుసు అంతటా అసాధారణమైన కార్యాచరణ మైలురాళ్లతో ముగించింది. బలమైన ప్రక్రియ స్థిరత్వం, కార్యాచరణ నైపుణ్యం మరియు పెరుగుతున్న సామర్థ్య వినియోగాన్ని ప్రదర్శిస్తూ, ఎన్ఎస్ఎల్ అనేక కీలక ఉత్పత్తి రంగాలలో దాని అత్యుత్తమ నెలవారీ పనితీరును అందించింది. నవంబర్ నెలలో, ముడి పదార్థాల నిర్వహణ వ్యవస్థ (ఆర్ఎంహెచ్ఎస్) రికార్డు విజయాలను సాధించింది. ఆ రోజు అత్యధిక వ్యాగన్ టిప్పల్ చేయబడింది అంటే నవంబర్ 21, 2025న 616 సంఖ్యలు. ఈ ప్లాంట్ అత్యధికంగా నెలవారీ బేస్ మిక్స్ ఉత్పత్తి 5,18,886 టన్నులను కూడా సాధించింది. సింటర్ ప్లాంట్‌లో, ఎన్ఎస్ఎల్ రోజు, నెలవారీ సింటర్ ఉత్పత్తి రికార్డులతో దాని పెరుగుదల పథాన్ని కొనసాగించింది, నవంబర్ 30, 2025న ఒకే రోజులో 15,590 టన్నులు, నెలలో 4,14,271 టన్నులకు చేరుకుంది, రేటింగ్ సామర్థ్య వినియోగంలో 105% కంటే ఎక్కువ పనిచేసింది. నవంబర్ 28, 2025న బ్లాస్ట్ ఫర్నేస్ 11,315 టన్నుల రికార్డు హాట్ మెటల్ ఉత్పత్తితో అద్భుతమైన సామర్థ్యాన్ని నమోదు చేసింది, ఇది రేట్ చేయబడిన సామర్థ్య వినియోగంలో 119%, నెలవారీ ఉత్పత్తి 2,80,049 టన్నులు, 101% సామర్థ్య వినియోగంను దాటింది. ముఖ్యంగా, ఎన్ఎస్ఎల్ సింటర్, ఓర్‌ను బర్డెన్‌లో



మాత్రమే ఉపయోగించడం ద్వారా టన్ను హాట్ మెటల్‌కు 519 కిలోల నెలవారీ సగటు అత్యల్ప ఇంధన రేటును సాధించింది. ఇది దేశంలోనే అత్యుత్తమమైనది మరియు హాట్ మెటల్‌కు టన్నుకు 164 కిలోల అత్యధిక నెలవారీ సగటు పీసీఐ రేటును సాధించింది. స్టీల్ మెల్టింగ్ షాప్, ఏఎంపీ థిన్ స్లాబ్ కాస్టర్-హాట్ స్ట్రిప్ మిల్స్ కూడా ఇప్పటివరకు అత్యుత్తమ పనితీరును కనబరిచాయి. ఎన్ఎస్ఎల్ 2,03,356 టన్నుల అత్యధిక నెలవారీ హెచ్ఆర్ కాయిల్ ఉత్పత్తిని, 2,09,445 టన్నుల ముడి ఉక్కు ఉత్పత్తిని, 2,15,010 టన్నుల లిక్విడ్ స్టీల్ ఉత్పత్తిని నమోదు చేసింది. సామర్థ్య వినియోగం వరుసగా 84%, 85%, 86% మించిపోయింది. ఈ ప్లాంట్ 4,799 హీట్‌ల అత్యుత్తమ కన్వర్టర్ లైనింగ్ లైఫ్‌తో కొత్త బెంచ్‌మార్క్‌ను కూడా నెలకొల్పింది. రెండు కొత్త గ్రేడ్‌లు - ఐఎస్ 2062 ఈ450 బీఆర్, ఐఎస్ 2062 ఈ350సీ విజయవంతంగా వాణిజ్య ఉత్పత్తికి మార్చబడ్డాయి. నిర్మాణం, మౌలిక సదుపాయాలు, భారీ ఇంజనీరింగ్ విభాగాల కోసం కంపెనీ ఉత్పత్తి పోర్ట్‌ఫోలియోను విస్తరించాయి.

ఆక్సిజన్ ప్లాంట్‌లో కార్యకలాపాలను ఆప్టిమైజ్ చేయడం ద్వారా ఎన్ఎస్ఎల్ దాని వ్యయ సామర్థ్యాన్ని బలోపేతం చేసింది, ఫలితంగా ఒకే ప్లాంట్ టర్న్‌డౌన్ మోడ్‌లో పనిచేయడం ద్వారా విద్యుత్ ఖర్చులో దాదాపు రూ.1.9 కోట్ల వరకు ఆదా అయింది. బ్లాస్ట్ ఫర్నేస్ (పికెజి. 05) మరియు టర్బో బ్లోవర్ (పికెజి. 10ఏ) పీజీ పరీక్షలను విజయవంతంగా పూర్తి చేయడం, ఐఎస్ 2041: 2024, ఐఎస్ 2062 ఈ450బీఆర్ లకు బీఐఎస్ లైసెన్స్‌లను పొందడం అదనపు మైలురాళ్ళు. యూనిట్లలో ఈ అసాధారణ పనితీరుపై, సిఎండి అమితవ ముఖర్జీ మాట్లాడుతూ "యూనిట్లలో స్థిరమైన రికార్డు విజయాలు మా బృందం అంకితభావం, క్రమశిక్షణ, దృఢ సంకల్పాన్ని ప్రతిబింబిస్తాయి. భారతదేశం ప్రపంచ ఉక్కు శక్తి కేంద్రంగా మారే దిశగా తన ప్రయాణాన్ని వేగవంతం చేస్తున్నందున, సాంకేతికత ఆధారిత సామర్థ్యం, పెరుగుతున్న ఉత్పత్తి పోర్ట్‌ఫోలియో, దేశ నిర్మాణం పట్ల నిబద్ధతతో భారతదేశం ఉక్కు వృద్ధి కథలో తన పాత్రను పోషించడానికి ఎన్ఎస్ఎల్ సిద్ధంగా ఉంది."

## ఓసీపీ-1లో రక్షణ పతాకం ఆవిష్కరణ

- రక్షణ పక్షోత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొనండి
- ఓసీపీ-1 ప్రాజెక్టు అధికారి ప్రవీణ్ వి పాంటింగ్



**యైటింక్లయిన్ కాలనీ డిసెంబర్ 08 (జనంసాక్షి) :** సింగరేణి సంస్థ ఆర్జీ-3 ఏరియా ఓసీపీ-1 లో రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా గని ఆవరణలో పీఓ ప్రవీణ్ వీ పాంటింగ్ రక్షణ పతాకం ఆవిష్కరించారు. సోమవారం ఓసీపీ-1 సైట్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా అన్ని గనుల్లో రక్షణ పక్షోత్సవం పేరిట ఒక్కరోజు ఒక్కోగనికి కార్పొరేట్ రక్షణ బృందం గనికి సంబంధించి విషయాలపై తనిఖీ చేసి మార్కులు కేటాయించి బహుమతులు అందజేస్తారని తెలిపారు. ఆనంతరం రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రావు పాపయ్య,బైరి రమేష్, జనార్దన్, వినాయక్, యూనియన్ నాయకులు గడ్డం తిరుపతి యాదవ్, మల్లేష్, శేఖర్, రక్షణ కమిటీ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, సాంబయ్య, వెంకటరాజం, రాజేందర్, ప్రవీణ్ రెడ్డి, బుగ్గాజీ, వేదప్రియ, మౌన్య తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఆర్ఎన్‌టీబీసీఐ మద్దతు

### సీఆర్ పీఎఫ్ గ్రూప్ సెంటర్‌కు 20 వీల్‌చైర్ల పంపిణీ



**ఖైరతాబాద్, డిసెంబర్ 08 (జనం సాక్షి) :** రెనాల్ట్ నిస్సాన్ టెక్నాలజీ, బిజినెస్ సెంటర్ ఇండియా (ఆర్ఎన్‌టీబీసీఐ), నేషనల్ సెంటర్ ఫర్ ది వ్యాంగ్ ఎంపవర్‌మెంట్(ఎన్‌సీడీఈ)లో పారా స్పోర్ట్ అవకాశాలను మెరుగు పరచడం, దివ్యాంగ్ సిబ్బందికి మొబిలిటీ యాక్సెస్‌ను మెరుగు పరచ డం లక్ష్యంగా కొత్త కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలి టీ (సీఎస్ఆర్) చొరవను ప్రారంభించినట్లు ఆర్. ఎన్.టీ.బీ.సీ.ఐ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ, జనరల్ అడ్మినిస్ట్రేషన్, ఫిజికల్ సెక్యూరిటీ హెడ్ బిను నాయర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఇండి యా కేర్స్ ఫౌండేషన్ సహకారంతో అమలు చేయ బడిన ఈ ప్రాజెక్ట్, 5 స్పోర్ట్స్ వీల్‌చైర్లు,వీల్‌చైర్ యా క్సెసిబుల్ బస్సుతో సహా 20 కస్టమైజ్డ్ మొబైల్ వీల్ చైర్‌లను సికింద్రాబాద్‌లోని సీఆర్ పీఎఫ్ గ్రూప్ సెంటర్‌కు పంపిణీ చేసినట్లు తెలిపారు.ఈ హ్యాండోవర్ వేడుకను సీఆర్ పీఎఫ్ డైరెక్టర్ జనరల్ జి.పి.సింగ్, దివ్యాంగ్ సిబ్బంది తరఫున అధికారికంగా పరికరాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో నిస్సాన్ ఇంజనీరింగ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అకిరా హంజావా, ఆర్.ఎన్.టీ.బీ.సీ.ఐ నుండి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ, అడ్మినిస్ట్రేషన్, ఫిజికల్ సెక్యూరిటీ హెడ్ బిను నాయర్, సీఆర్ పీఎఫ్ నుండి సీని యర్ నాయకులు పాల్గొన్నారు.






## గోషామహల్లో నకిలీ టూల్స్ గుట్టు రట్టు

### లబ్ధి ఎంటర్ప్రైజెస్‌పై పోలీసులు దాడి

**హైదరాబాద్, డిసెంబర్ 8 (జనం సాక్షి) :** గోషామహల్ ప్రాంతంలో యథేచ్ఛగా సాగుతున్న నకిలీ ఇండస్ట్రియల్ టూల్స్ విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన సౌత్ వెస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు, బేగంబజార్ పోలీసులతో కలిసి నిర్వహించిన దాడులలో 'లబ్ధి ఎంటర్ప్రైజెస్' దుకాణంలో నిల్వ ఉంచిన నకిలీ కాన్వీ టీసీటీ సా బ్లేడ్లను స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని పలు దుకాణాలపై ఈ దాడులు చేపట్టారు. 2019 నుంచే లబ్ధి ఎంటర్ప్రైజెస్ కాన్వీ నకిలీ ఉత్పత్తులు విక్రయిస్తున్నట్లు నిర్ధారణకు వచ్చారు. దీంతో కాన్వీ బ్రాండ్కు ఆర్థికంగా నష్టం కలగటంతో పాటు వినియోగదారుల భద్రతకు ముప్పు ఏర్పడిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై బేగంబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. వీటిని ల్యాబ్ పరీక్షలకు పంపించారు. దీని మూలాలు గుర్తించేందుకు, ఈ నెట్వర్క్‌లో ఉన్న వారిని పట్టుకునేందుకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇండస్ట్రియల్ టూల్స్ నకిలీవి కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## షాద్ నగర్ వాసికి అమెరికాలో అపూర్వమైన గౌరవం



**షాద్ నగర్, డిసెంబర్ 8 (జనం సాక్షి) :** మిచిగన్ రిపబ్లికన్ పార్టీ కో-చైర్‌గా తెలుగు వాడు అందునా తెలంగాణ ప్రాంతానికి చెందిన రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం కిషన్ నగర్ గ్రామానికి చెందిన సన్నీరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సన్నీరెడ్డి ఎన్నికను ప్రవాస భారతీయులు స్వాగతించారు. ఈ ఎన్నిక ద్వారా ఆయన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టీమ్ లో ఒకరిగా నిలిచారు. నాయకత్వ పటిమ, నిజాయితీ, ప్రజాసేవను గుర్తించిన రిపబ్లికన్ పార్టీ కో చైర్ గా ఎన్నుకొంది. అమెరికాలోని 50 రాష్ట్రాల నుంచి ఒక్కొక్కరిని కోచైర్ గా ఎన్నుకుంటారు. వీరంతా అధ్యక్షుడికి ఆయా రాష్ట్రం నుంచి తగిన సూచనలు, సలహాలు ఇస్తూ ఉంటారు. అగ్రరాజ్యంలో పార్టీ కో చైర్ గా నిలిచిన ఏకైక తెలుగు వ్యక్తిగా సన్నిరెడ్డి నిలిచారు. మిచిగన్ రాష్ట్రానికి చెందిన ఎన్ఆర్ఐ సన్నీ రెడ్డి వెయిన్ స్టేట్ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ మెంబర్ గా కూడా ఎన్నికయ్యారు. ఈ మధ్యనే ఉత్కంఠ భరితంగా సాగిన ఎన్నికల్లో తలలు పండిన అందరినీ వెనక్కి తోసి రిపబ్లికన్ పార్టీ తరపున మంచి మెజారిటీతో సన్నీరెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించారు.1994లో ఆయన వెయిన్ స్టేట్ యూనివర్సిటీ నుంచి కెమికల్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందిన ఆయన చివరకు అదే వర్సిటీలో బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ మెంబర్ ఎన్నికైన మొదటి వ్యక్తిగా నిలిచారు.అనేక సంవత్సరాలుగా మిచిగన్ రాష్ట్రంలోని విద్య,ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి తీసుకున్న నిర్ణయాలు తనను ఈ స్థాయికి తీసుకు వచ్చాయం టారు సన్నీరెడ్డి.. కాలేజ్ ట్యూషన్ కాస్ట్స్ తగ్గించి విద్యను అందరికీ అందు బాటులోకి తేవడం,విద్యను రాజకీయాలకు అతీతంగా ఉంచడం, ఆలుమిని తో కెరీర్ గైడెన్స్ సేవలను విద్యార్థులకు అందించేలా చేయడం వంటి విషయాలను వివరించి మిచిగన్ ఓటర్లను ఆయన ఆకట్టుకున్నారు. సన్నీరెడ్డికి అమెరికా తెలుగు సంఘంతో మంచి సంబంధాలున్నాయి. ప్రస్తుతం బోర్డ్ ఆఫ్ ట్రస్టీగా ఆటాకి సేవలందిస్తున్నారు. 2017 లో హూస్టన్, 2021 లో కెంటకీ, 2024 లో ఫ్లోరిడా హరికేన్ల సమయంలో అమెరికన్ రెడ్ క్రాస్ సొసైటీతో పని చేయడమే కాకుండా కావాల్సిన ఫండ్స్ రైజ్ చేశారు. ఆయనకు ట్రంప్ బృందంలో చోటు లభించడం అమెరికాలోని తెలుగువారికే కాకుండా ఇండియన్ కమ్యూనిటీ సైతం గర్వించదగిన విషయమని పలువురు ఎన్నారైలు అభిప్రాయపడ్డారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
9 డిసెంబర్ 2025

# మహిళా ఆధారిత అభివృద్ధి
# గ్లోబల్ మోడల్‌గా తెలంగాణ

- స్టార్టప్‌ల నుంచి సౌర శక్తి దాకా...కొత్త రంగాల్లో దూసుక పోతున్న మహిళా సంఘాలు
- 2047 నాటికి మహిళా శ్రామిక భాగస్వామ్యం 90 శాతం ఇది తెలంగాణ సంకల్పం
- గ్లోబల్ సమ్మిట్ వేదికగా ఆకట్టుకున్న మంత్రి సీతక్క ప్రసంగం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** "మహిళలు ఎదిగితే ఆర్థిక వ్యవస్థ ఎదుగుతుంది. మహిళలు స్వయం సంపత్తి సృష్టిస్తే అభివృద్ధి సమగ్రంగా ఉంటుంది. మహిళలు వ్యాపారాలు నడిపితే ఆర్థిక వృద్ధి స్థిరంగా ఉంటుంది. తెలంగాణ ఈ మార్పునకు నాయకత్వం వహిస్తోంది" అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. మహిళా ఆధారిత ఆవిష్కరణలతో ముందుకు సాగుతున్న తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి గాథను, భవిష్యత్తు ప్రణాళికలను తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2025 వేదికగా ఆవిష్కరించారు. ప్రపంచం నలుమూలల నుండి వచ్చిన ప్రతినిధులు, పెట్టుబడిదారులు, పారిశ్రామిక వేత్తలను ఉద్దేశించి ప్రసంగించారు. మహిళా సాధికారతలో రోల్ మోడల్ గా నిలుస్తున్న తెలంగాణ అనుభవాలను ప్రపంచంతో పంచుకోవడం ఈ సమ్మిట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సీతక్క మాట్లాడుతూ దేశంలోనే అత్యంత శక్తివంతమైన మహిళా నెట్‌వర్క్‌ను తెలంగాణ నిర్మించిందని, 65 లక్షల మహిళా స్వయం సహాయక సంఘాలు గ్రామీణ, పట్టణ ఆర్థిక వ్యవస్థలను పూర్తిగా మారుస్తున్నాయని పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా గ్రామీణ, పట్టణ పేద మహిళలు, వికలాంగులు, వృద్ధ మహిళలు, అట్టడుగు వర్గాలు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల వరకు అందరికీ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. తెలంగాణలో ఒక్క మహిళ కూడా వెనుకబడిపోకూడదనే లక్ష్యంతో పని చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. వడ్డీలేని రుణాలు, స్త్రీ నిధి, బ్యాంకుల ద్వారా భారీ స్థాయిలో అందించిన క్రెడిట్ సపోర్ట్, లక్షలాది సూక్ష్మ వ్యాపారాల నెలకొల్పడం, మహిళల కోసం జిల్లాల్లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి భవనాలు, తెలంగాణ మహిళల ఆర్థిక స్వరూపాన్ని మార్చేశాయని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టులు, హాస్పిటళ్లు, దేవాలయాలు, పర్యాటక కేంద్రాల్లో నడుస్తున్న మహిళా శక్తి కాంటీన్లు మహిళలకు స్థిరమైన ఆదాయ వనరులుగా మారాయని, పాఠశాల యూనిఫాంల తయారీ, పాఠశాల అభివృద్ధి పనుల అమలు, టీజీఎస్ఆర్టీసీకి అద్దె బస్సుల కొనుగోలు, మహిళల ఆధ్వర్యంలో నడుస్తున్న పెట్రోల్ బంకులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు మహిళలకు కొత్త ఆర్థిక వ్యాపారాలను సృష్టిస్తున్నాయని పేర్కొన్నారు. దీనికి కొనసాగింపుగా 32 జిల్లాల్లో మహిళల చేత ఏర్పాటు కాబోతున్న 64 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లు దేశంలోనే తొలి ఉదాహరణగా నిలిచాయని వెల్లడించారు. విదేశీ సంస్థలు, జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక సంస్థలతో భాగస్వామ్యం ద్వారా మహిళా సంఘాల కోసం కొత్త అవకాశాలను సృష్టిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ, పట్టణ మహిళా అభివృద్ధిని ఒకే గొడుగుకిందకు తీసుకొచ్చేందుకు సెర్ప్, మెప్మా సంస్థలను ఏకీకృతం చేయడం చారిత్రాత్మక నిర్ణయమని సీతక్క చెప్పారు. 'మహిళలు ఎదిగితే ఆర్థిక వ్యవస్థ ఎదుగుతుంది. మహిళలు స్వయం సంపత్తి సృష్టిస్తే అభివృద్ధి సమగ్రంగా ఉంటుంది. మహిళలు వ్యాపారాలు నడిపితే ఆర్థిక వృద్ధి స్థిరంగా ఉంటుంది. తెలంగాణ ఈ మార్పునకు నాయకత్వం వహిస్తోంది' అని అన్నారు. పెట్టుబడిదారులు, జాతీయ అంతర్జాతీయ పారిశ్రామిక దిగ్గజాలు తెలంగాణలో అవకాశాలు అన్వేషించాలి. తెలంగాణలో మహిళలు అవకాశాల కోసం ఎదురు చూడడం లేదు. అవకాశాలను స్వయంగా సృష్టిస్తున్నారు' అని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# మల్కాజిగిరిలో మరో రియల్టర్ హత్య



**హైదరాబాద్, డిసెంబర్8 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లో పట్టపగలే హత్యలు, దోపిడీలు, దొంగతనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీలవల పాతబస్తీలో ఓ రియల్టర్ హత్యకు గురయ్యాడు. వరుస హత్యలు, దాడులతో నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. తాజాగా మల్కాజిగిరిలో జరిగిన రియల్టర్ హత్య కలకలం రేపింది. సోమవారం ఉదయం మల్కాజిగిలోని జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న సాకేత్ కాలనీ ఫోస్టర్ బిల్లాబాంగ్ స్కూల్ సమీపంలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి దారుణ హత్యకు గురయ్యారు. వెంకటరత్నం అనే రియల్టర్‌ను దుండగులు అతి కిరాతకంగా హతమార్చారు. స్కూటీపై వెళ్తున్న వెంకటరత్నంను వెంబడించిన గుర్తుతెలియని వెక్తులు.. కత్తులతో పొడిచి తుపాకీతో కాల్చి చంపారు. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.కాగా, వెంకటరత్నంపై ధూల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ నమోదై ఉన్నట్లు గుర్తించారు. జంట హత్యల కేసులో నిందితుడిగా ఉన్నట్లు తేలింది. ఆయనను ప్రత్యర్థులే చంపి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

# గ్లోబల్ సమ్మిట్‌కు చంద్రబాబు శుభాకాంక్షలు

- ఆవిష్కరణలకు వేదిక కావాలని ఆకాంక్ష

**అమరావతి, డిసెంబర్8 (జనంసాక్షి) :** తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ఏపి సిఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. సమ్మిట్ దృష్ట్యా ట్విట్టర్ వేదికగా సీఎం చంద్రబాబు పోస్టు పెట్టారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సదస్సు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి, పురోగతికి, ఆవిష్కరణలకు వేదిక కావాలని ఆకాంక్షిస్తున్నానని పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సోమవారం నుంచి రెండు రోజులపాటు అత్యంత వైభవంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్వహిస్తోంది. అయితే, గత మూడు రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అమరావతి నివాసంలో తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కలిసిన విషయం తెలిసిందే. సందర్భంగా గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ప్రత్యేకంగా ఆహ్వానించారు. తాను తప్పకుండా వస్తానని సీఎం చంద్రబాబు చెప్పారని కోమటిరెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు హాజరు కావాల్సిఉన్నా, ముందస్తు షెడ్యూల్ కారణంగా రాలేక పోయారు. హైదరాబాద్ ఫ్యూచర్‌సిటీ వేదికగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ రెండు రోజుల పాటు ఘనంగా జరగనుంది. ఇందుకోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సమ్మిట్‌కు 44 దేశాల నుంచి 154 మంది అతిథులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆహ్వానించింది. గ్లోబల్ సమ్మిట్‌లో వివిధ అంశాలపై 27 సెషన్లలో చర్చలు జరగనున్నాయి. గ్లోబల్ సమ్మిట్‌కు ఆరు వేలమంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఓఆర్ఆర్ ఎగ్జిట్ గేటు నుంచి సమ్మిట్ వేదిక వరకు పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు చేస్తున్నారు. అతిథుల భద్రత దృష్ట్యా పోలీసులు ప్రత్యేక భద్రత చర్యలు చేపట్టారు. ఈ సమ్మిట్ ద్వారా తెలంగాణకు ఎంతో విలువైన పెట్టుబడులు వస్తాయని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది.

# మరోమారు దావోస్‌కు చంద్రబాబు

- జనవరి 19 నుంచి 23వ పర్యటన



**అమరావతి, డిసెంబర్ 8 (జనంసాక్షి) :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటన షెడ్యూల్ ఖరారైంది. వచ్చే ఏడాది జనవరి 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు దావోస్‌లో ముఖ్యమంత్రి పర్యటించనున్నారు. దావోస్ ఎకనామిక్ ఫోరం సదస్సుకు సీఎం చంద్రబాబు హాజరు కానున్నారు. చంద్రబాబు బృందంలో మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ ఉన్నారు. ఈ మేరకు సీఎం దావోస్ పర్యటన షెడ్యూల్‌ను అధికార వర్గాలు ఖరారు చేశారు. సోమవారం దావోస్ పర్యటనకు సంబంధించిన ప్రకటన విడుదల చేశారు. అయితే దావోస్ పర్యటనలో పలువురు పారిశ్రామికవేత్తలను కూడా సీఎం కలిసే అవకాశాలు ఉన్నాయి. ఏపీకి కావాల్సిన పెట్టుబడులపై పారిశ్రామిక వేత్తలతో చంద్రబాబు చర్చించే ఛాన్స్ ఉంది. ఏపీ అభివృద్ధిపై సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇందులో భాగంగానే ఇప్పటికే అమెరికాలోని డల్లాస్‌లో లోకేశ్ పర్యటిస్తున్న విషయం తెలిసిందే.

# నిర్వహణా లోపమే ఇండిగో సంక్షోభానికి కారణం

- భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితి ఉత్పన్నం కాకుండా చర్యలు
- మరిన్ని ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహించే యత్నం
- రాజ్యసభలో పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 8 (జనంసాక్షి) :** ఇండిగో నిర్వహణ వైఫల్యమే ప్రస్తుత పరిస్థితులకు దారితీసిందని పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు అన్నారు. 'ఇండిగో సంక్షోభం' నేపథ్యంలో రామ్మోహన్ నాయుడు సోమవారం పార్లమెంట్‌లో ఓ ప్రకటన చేశారు. భవిష్యత్తులో ఇతర ఎయిర్‌లైన్స్ నుంచి ఇలాంటివి పునరావృతం కాకుండా మా చర్యలు ఉండనున్నాయి. భారతదేశంలో కొత్త విమానయాన సంస్థ ప్రారంభం కావడానికి ఇదే మంచి తరుణం. పోటీ సంస్థలు ఏర్పాటయ్యేలా చర్చలు జరపనున్నాం అని మంత్రి రాజ్యసభలో మాట్లాడారు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాగానే ఇండిగో సంక్షోభంపై చర్చ జరపాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే మంత్రి స్పందించి ప్రకటన చేశారు. విమానయాన సిబ్బంది పని గంటలపై పరిమితులకు సంబంధించిన నిబంధనలను ఇండిగో సరిగా అమలుచేయకపోవడమే సర్వీసుల రద్దుకు దారితీసిందని వెల్లడించారు. ఏవియేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ సాఫ్ట్‌వేర్ ఈ అంతరాయాలకు కారణం కాదని తెలిపారు. సిబ్బందికి సంబంధించిన రోస్టరింగ్ విధానాన్ని సరిగా అమలుచేయలేదు.ఈ వైఫల్యానికి ఏఎంఎస్ఎస్ సిస్టమ్ కారణం కాదు. డిసెంబర్ ఒకటిన రోస్టరింగ్ నిబంధనలకు సంబంధించి ఇండిగోతో సమావేశం నిర్వహించాం. ఆ సంస్థ ప్రతినిధులు లేవనెత్తిన సందేహాలపై మేం స్పష్టత ఇచ్చాం. అప్పుడు వారు ఎలాంటి సమస్యలను ప్రస్తావించలేదు. ఇక సమస్యను పరిష్కరించేందుకు ఎయిర్ లైన్‌తో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం కొన్ని రోజులుగా ప్రయాణికులు ఎదుర్కొంటున్న తీవ్ర అంతరాయానికి చింతిస్తున్నాను. ఈ సమస్యను మేం తేలిగ్గా తీసుకోలేదు. ఇప్పటికే దర్యాప్తునకు ఆదేశించాం. ఇదిలాఉంటే.. ఇండిగో వ్యవహారంపై కేంద్రం ఇప్పటికే ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. కొద్దిరోజులుగా సేవల్లో అంతరాయానికి గల కారణాలను విచారించనుంది. బాధ్యులను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. మొత్తం నలుగురు సభ్యులతో కూడిన కమిటీని పౌర విమానయాన శాఖ ఏర్పాటుచేసింది. ఈ కమిటీలో డీజీసీఏ జాయింట్ డైరెక్టర్ సంజయ్ కె.బ్రహ్మనే, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అమిత్ గుప్తా, సీనియర్ ఫ్లైట్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్ కెప్టెన్ కపిల్ మాన్‌గ్లిక్, ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్ లోకేష్ రాంపాల్ ఉన్నారు. వీరు భవిష్యత్తులో ఎలాంటి అంతరాయాలు చోటుచేసుకోకుండా కొన్ని సిఫార్సులు కూడా చేయనున్నారు.

# ఢిల్లీ విమానాశ్రయంలో భారీగా గంజాయి పట్టివేత

- అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.15 కోట్ల విలువ



**న్యూఢిల్లీ, డిసెంబర్8 (జనంసాక్షి) :** దేశ రాజధాని ఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు సోమవారం భారీగా విదేశీ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకాక్ నుంచి ఢిల్లీకి వచ్చిన ఇద్దరు ప్రయాణికుల లగేజీ బ్యాగుల్లో దాచిపెట్టి గంజాయిని తరలించే ప్రయత్నం చేస్తుండగా కస్టమ్స్ సిబ్బంది గుర్తించారు. అధికారులకు స్కానింగ్ సమయంలో అనుమానం రావడంతో ఆ ఇద్దరి బ్యాగులను సోదా చేయగా అందులో పెద్ద మొత్తంలో గంజాయి బయటపడింది. అధికారులు స్వాధీనం చేసుకున్న విదేశీ గంజాయికి అంతర్జాతీయ మార్కెట్‌లో దాదాపుగా రూ.15 కోట్లు విలువ ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గంజాయిని స్మగ్లింగ్ చేయడానికి ప్రయత్నించిన కేటుగాళ్లను అధికారులు అక్కడికక్కడే అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి మీద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. విదేశీ మార్గాల ద్వారా డ్రగ్స్ రవాణా పెరుగుతున్న నేపథ్యంలో ఎయిర్‌పోర్ట్‌లో తనిఖీలను మరింత కఠినతరం చేసినట్లు కస్టమ్స్ వర్గాలు వెల్లడించాయి.

# బంకిం దా కాదు...బంకిం బాబు

- ప్రధానికి సర్దిచెప్పిన సౌగత్ రాయ్



**న్యూఢిల్లీ, డిసెంబర్8 (జనంసాక్షి) :** వందేమాతరంపై చర్చ సందర్భంగా పార్లమెంట్‌లో ప్రధాని మోదీ ప్రసంగిస్తుండగా ఓ ఆసక్తికర ఘటన చోటుచేసుకొంది. వందేమాతరం గేయ రచయిత బంకించంద్ర ఛటర్జీని ప్రధాని బంకిం దా అని పలుమార్లు సంబోధించారు. అదే సమయంలో తృణమూల్ ఎంపీ సౌగత్ రాయ్ ప్రధాని 'దా' అని సంబోధించడంపై అభ్యంతరం చెప్పారు. సోదరుడు అనే సంబోధించేందుకు బెంగాలీ భాషలో 'దా' అని వాడతారని.. సాంస్కృతిక దిగ్గజానికి అటువంటి పదం వాడటం సరికాదని పేర్కొన్నారు. 'బంకిం బాబు' అని ప్రధాని సంబోధించాలని సూచించారు. దీనికి సానుకూలంగా స్పందించిన ప్రధాని వెంటనే స్పందించారు. ఇకనుంచి బంకిం బాబు అనే సంబోధిస్తానని వెల్లడించారు. తన పొరబాటును సరిచేసినందుకు సౌగత్‌రాయ్‌కు ధన్యవాదాలు చెబుతూ.. నేను మిమ్మల్ని దాదా అని సంబోధించవచ్చా..? లేదా దానిపై కూడా ఏమైనా అభ్యంతరాలున్నాయా..? అని సరదాగా ప్రశ్నించారు. సోమవారం నాటి చర్చలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంక గాంధీ పాల్గొనలేదు. దీంతో ఎంపీ గౌరవ్ గొగొయ్ ప్రతిపక్షాల తరపున చర్చను ప్రారంభించారు. అయితే రాహుల్ గైర్హాజరు కావడాన్ని భాజపా నేత సీఆర్ కేశవన్ తప్పుపట్టారు.

# దుర్గామాతపై చరణాలు తొలగించిన నెహ్రూ

- వందేమాతరం చర్చ సందర్భంగా కంగనా రనౌత్ వ్యాఖ్య

**న్యూఢిల్లీ, డిసెంబర్8 (జనంసాక్షి) :** స్వాతంత్ర్య సంగ్రామాన్ని నడిపించిన వందేమాతరం గేయానికి ఎట్టకేలకు గుర్తింపు వచ్చిందని, ఆ గేయం జాతికి గర్వకారణం అని, కానీ ఆ గేయంలో ఉన్న దుర్గామాత చరణాలను కాంగ్రెస్ పార్టీ తొలగించిందని బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ అన్నారు. లోక్‌సభలో వందేమాతరం గేయం గురించి చర్చ జరిగింది. ఆ చర్చలో ప్రధాని మోదీ మాట్లాడుతూ వందేమాతరం గీతాన్ని కాంగ్రెస్ ముక్కలు చేసినట్లు ఆరోపించారు. ఆ అంశం గురించి ఎంపీ కంగనా రనౌత్ స్పందించారు. పార్లమెంట్ ఆవరణలో రిపోర్టర్లతో ఆమె మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సంగ్రామాన్ని నడిపించిన గీతానికి ఇప్పుడు క్రెడిట్ దక్కడం గర్వకారణం అన్నారు. ఆ గేయంలోని దుర్గామాత చరణాలను తొలగించారని, కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ మహిళా వ్యతిరేకి అని ఆమె ఆరోపించారు. వందేమాతం గీతంలో ఉన్న దుర్గాదేవి చరణాలను 1937లో తొలగించినట్లు ఇటీవల బీజేపీ నేత సీఆర్ కేశవన్ పేర్కొన్నారు. కొన్ని వర్గాల ప్రజలను సంతోష పెట్టేందుకు నెహ్రూ ఆ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఆ గేయంలో ఉన్న తొలి రెండు చరణాలను మాత్రమే కాంగ్రెస్ పార్టీ ఆమోదించిందన్నారు. దీంతో ఆ గీతంపై ఇప్పుడు కొత్తగా చర్చ మొదలైంది. వందేమాతం గీతం గురించి ఎన్నో ఏళ్లుగా చర్చ సాగుతోందని, ఆ పాట గురించి అందరికీ తెలియాలని, మన సంస్కృతి, సంప్రదాయం, చరిత్ర గురించి తెలుసుకోవాలని బీజేపీ ఎంపీ అరుణ్ గోవిల్ అన్నారు.

# వందేమాతరంపై బిజెపి మాట్లాడడమా?

- చర్చలో సమాజ్‌వాది ఎంపీ అఖిలేశ్ యాదవ్



**న్యూఢిల్లీ, డిసెంబర్8 (జనంసాక్షి) :** నాడు భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనని వాళ్లు ఇప్పుడు వందేమాతరం గురించి, ఆ గీతం విలువల గురించి మాట్లాడుతున్నారని సమాజ్‌వాది పార్టీ ఎంపి అఖిలేష్ యాదవ్ విమర్శించారు. లోక్‌సభలో వందేమాతరంపై చర్చలో పాల్గొన్న అఖిలేష్.. అధికార బీజేపీ నేతలను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు. వందేమాతరం జాతీయ గేయమని, ఆ గేయాన్ని ఒకరి నమ్మకాలను ఇతరులపై రుద్దే సాధనంగా వినియోగించడం కరెక్టు కాదని అఖిలేష్ యాదవ్ వ్యాఖ్యానించారు. వందేమాతరం గీతానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లోక్‌సభలో చర్చ చేపట్టారు. వందేమాతర గీతం స్ఫూర్తిని ప్రతిఒక్కరూ అనుసరించాలని, స్వాతంత్ర్య పోరాటం సందర్భంగా ఈ గీతం ప్రజలను ఒక్కటి చేసిందని అన్నారు. అయితే ఇవాళ కొన్ని విచ్ఛిన్నకర శక్తులు దేశాన్ని విచ్ఛిన్నం చేయడం కోసం వందేమాతరం గీతాన్ని వాడుకుంటున్నాయని బీజేపీపై విమర్శలు చేశారు. వాళ్లు నాడు బ్రిటిష్ పాలకులు పాటించిన 'విభజించు.. పాలించు' పాలసీనే అనుసరిస్తున్నారని ఆరోపించారు.

# కొనసాగుతున్న బాంబు హెచ్చరికలు

- శంషాబాద్ వచ్చే విమానాలకు వరుస బెదిరింపులు




**హైదరాబాద్, డిసెంబర్ 8 (జనంసాక్షి) :** హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చే విమానాలకు బాంబు బెదిరింపుల పరంపర కొనసాగుతున్నది. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌కు వస్తున్న రెండు విమానాలకు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా మరో మూడు విమానాలకు బెరింపు మెయిల్స్ వచ్చాయి. దీంతో ఎయిర్‌పోర్ట్ సిబ్బంది, పోలీసులు అలర్ట్ అయ్యారు. తనిఖీలు చేపట్టారు. సోమవారం ఉదయం కేరళలోని కన్నూర్ నుంచి వచ్చిన ఇండిగో ఎయిర్ లైన్స్, ఫ్రాంక్‌ఫర్ట్–హైదరాబాద్ లుఫ్తాన్సా ఎయిర్ లైన్స్, లండన్–హైదరాబాద్ బ్రిటిష్ ఎయిర్ లైన్స్‌కు చెందిన విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో శంషాబాద్ విమానాశ్రయంలో వీటిని సురక్షితంగా ల్యాండింగ్ చేశారు. అనతరం బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేపట్టాయి. విమానాలకు ఐసోలేషన్‌కు తరలించారు.

# టిక్కెట్ ధరలపై కేంద్రం అజమాయిషీ

- టికెట్ రేట్ల పరిమితి అమల్లోకి..
- ఎయిర్ ఇండియా ప్రకటన

**న్యూఢిల్లీ, డిసెంబర్8 (జనంసాక్షి) :** 'ఇండిగో' సంక్షోభం నేపథ్యంలో ధరలను అదుపు చేసేందుకు ప్రభుత్వం ప్రకటించిన టికెట్ రేట్ల పరిమితిని ఎయిర్ ఇండియా సోమవారం నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. ఇది ఎకానమీ క్లాస్ టికెట్లకు వర్తిస్తుందని ఆ సంస్థ పేర్కొంది. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. డిసెంబర్ 6వ తేదీన పౌర విమానయాన మంత్రిత్వశాఖ జారీ చేసిన మార్గదర్శకాలను అమలుచేసే క్రమంలో ఎకానమీ క్లాస్ టికెట్ల బేస్ ధరల పరిమితిని అమలుచేస్తున్నాం. మా రిజర్వేషన్ వ్యవస్థలో కొత్త ధరలు అమల్లోకి తీసుకొచ్చాం. ధర పరిమితి అమలును ఎయిర్ ఇండియా కొనసాగిస్తుంది. వచ్చే మరికొన్ని గంటల్లో ఇది పూర్తిగా ప్రభావం చూపిస్తుంది. ఇక థర్డ్‌పార్టీ బుకింగ్స్ వ్యవస్థల్లో ఇబ్బందులు లేకుండా స్థిరంగా కొనసాగించేందుకు దీనిని దశల వారీగా అమలుచేయాల్సి ఉంటుంది. ఈ మార్పులు జరుగుతున్న సమయంలో ఎవరైనా ఎయిర్‌ఇండియా ఎకానమీ క్లాస్ టికెట్లను నిర్ధారించిన బేస్ ధరల కంటే ఎక్కువకు బుకింగ్ చేసుకొంటే.. ఆ వ్యత్యాసం మొత్తం రిఫండ్ చేస్తాం అని ఎక్స్‌లో పెట్టిన పోస్టులో వెల్లడించింది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) జారీ చేసిన ఎఫ్‌డీటీఎల్ నిబంధన అమల్లో ఇండిగో విఫలమైంది. దీంతో వందల సంఖ్యలో విమానాలు రద్దు చేయడంతో ఎయిర్ పోర్టుల్లో భారీ సంఖ్యలో ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగోలో తీవ్ర సంక్షోభం నెలకొన్న విషయం తెలిసిందే. గత ఆరు రోజులుగా ఈ సంస్థకు చెందిన వందలాది విమానాలు రద్దు, ఆలస్యం అవుతున్నాయి. ఏడో రోజైన సోమవారం ఉదయం కూడా 400 విమానాలు రద్దయ్యాయి. ఇండిగో సంక్షోభం దేశీయ విమాన ప్రయాణ ఛార్జీలపై ప్రభావం పడింది. పలు ఎయిర్‌లైన్స్ టికెట్ రేట్లను భారీగా పెంచిన విషయం తెలిసిందే. దీంతో రంగంలోకి దిగిన కేంద్ర ప్రభుత్వం టికెట్ ధరలపై పరిమితి విధించింది. ఈ మేరకు ఈనెల 6వ తేదీన మార్గదర్శకాలు జారీ చేసిన విషయం తెలిసిందే.ఈ ఆదేశాలకు అనుగుణంగా దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ అయిన ఎయిర్ ఇండియా (ఒతిస ఎనిటతిజీ) చర్యలు చేపట్టింది. టికెట్ రేట్లపై కేంద్రం విధించిన పరిమితిని నేటి నుంచి అమల్లోకి తెచ్చింది. ఈ పరిమితి ఎకానమీ క్లాస్ టికెట్లకు వర్తిస్తుందని తెలిపింది. ఈ మేరకు ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఎయిర్ ఇండియా 'ఎక్స్' వేదికగా ప్రకటించింది. ఈ మార్పుల వేళ ఎవరైనా ఎయిర్ ఇండియా ఎకానమీ క్లాస్ టికెట్లను నిర్ధరించిన బేస్ ధరల కంటే ఎక్కువకు బుకింగ్ చేసుకొంటే.. ఆ వ్యత్యాసం మొత్తం రిఫండ్ చేస్తామని స్పష్టం చేసింది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370